www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నూతన సీజేఐ ఎంపిక ప్రక్రియ ఆరంభం

వచ్చే నెల 23న జస్టిస్ గవాయ్ పదవీ విరమణ

వారసుడి పేరు సూచించాలని కేంద్రం లేఖ

సీజేఐ తర్వాత అత్యంత సీనియర్ జస్టిస్ సూర్యకాంత్.. ఆయనకే అవకాశం! **2**

2027 ఫిబ్రవరి 9 వరకు పదవీ కాలం

శుక్రవారం | 24-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 188 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: తదియ రా.1.20 తదుపరి చవితి, నక్షత్రం: అనూరాధ పూర్తి, వర్జ్యం: ఉ.9.21-11.09, దుర్ముహూర్తం: ఉ.8.32-9.18, మ.12.22-1.08, అమృతఘడియలు: రా.8.09-9.57, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.14, సూర్యాస్తమయం: 5.44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అబుధాబీ పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల సీఈవోలతో నెట్‌వర్క్ లంచ్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు జనార్దన్‌రెడ్డి, టీజీ భరత్

టెక్ కంపెనీ ప్రతినిధులతో నెట్‌వర్క్ లంచ్

అబూధాబీలోని ప్రముఖ టెక్ కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు నెట్‌వర్క్ లంచ్ చేశారు. ఈ ముఖాముఖిలో జీ42 సీఈవో మనుకుమార్ జైన్, ఏడీఐసీ గ్లోబల్ హెడ్ లలిత్ అగర్వాల్, ఐహెచ్‌సీ సీఈవో అజయ్ భాటియా, డబ్ల్యుఐఓ బ్యాంక్ సీఈవో జయేష్ పాటిల్, ట్రుక్కర్ సీఈవో గౌరవ్ బిశ్వాస్, ఇన్వెస్టన్ సీఈవో ఆశిష్ కోషి తదితరులు పాల్గొన్నారు. ఏపీని భారతదేశానికి టెక్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దాలన్న తమ లక్ష్యాన్ని చంద్రబాబు వారికి వివరించారు. యూఏఈలోని టెక్నాలజీ ఆధారిత కంపెనీలతో సంయుక్త వర్కింగ్ గ్రూపు ఏర్పాటు చేసి రాష్ట్రంలో భవిష్యత్ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలన్న తన ఆకాంక్షను కూడా తెలియజేశారు.

మా రాష్ట్రానికి రండి

గ్రీన్ ఎనర్జీలో ఎన్నెన్నో అవకాశాలు.. భారీగా పెట్టుబడులు పెట్టండి

యూఏఈ పారిశ్రామికవేత్తలకు సీఎం చంద్రబాబు ఆహ్వానం

బ్యాటరీ స్టోరేజీ, సూపర్ కెపాసిటర్స్ తయారీలో పెట్టుబడులకు అపెక్స్ ఆసక్తి

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై అగ్రియా సానుకూలత

యూఏఈలో రెండో రోజు చంద్రబాబు పర్యటన

అబుధాబీలో పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు

లులూ గ్రూప్ ఛైర్మన్ యూసఫ్ అలీతోనూ భేటీ

భారత కాన్సుల్ జనరల్ విందుకు హాజరు



అబూధాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ బృందంతో సీఎం చంద్రబాబు, మంత్రులు భరత్, జనార్దన్‌రెడ్డి

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ వస్తున్న నేపథ్యంలో గ్రీన్ ఎనర్జీపై ఫోకస్ పెట్టామని, ఈ రంగంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రెండో రోజు పర్యటనలో భాగంగా గురువారం ఆయన యూఏఈకి చెందిన పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి రంగంలో పెట్టుబడి పెట్టాలని ప్రముఖ సంస్థ అపెక్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఛైర్మన్ ఖలీఫా కౌరీని కోరారు. బ్యాటరీ స్టోరేజీ రంగంలో పెట్టుబడులపైనా చర్చించారు. హైకెపాసిటీ

మిగతా 13వ పేజీలో...

ఇవేం పిల్లిమొగ్గలు!?

గూగుల్ హబ్‌పై మొన్నటిదాకా విషం

వేస్ట్, గోడౌన్, కాలుష్యమంటూ ప్రచారం

పది రోజులుగా అదేపనిగా బురదజల్లుడు

జగన్ రోత మీడియాలో చర్చల పరంపర

నేడు గూగుల్‌ను స్వాగతిస్తూ జగన్ ప్రకటన



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

డామిట్.. డేటా సెంటర్‌పై వైసీపీ కథ అడ్డం తిరిగింది! మొన్నటిదాకా విషం చిమ్మిన నోటితోనే... నేడు స్వాగతించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విశాఖలో గూగుల్ ఏఐ హబ్‌పై దుష్ప్రచారాన్ని జనం నమ్మకపోవడంతో... నాలుక మడతేయాల్సి వచ్చింది. 'డేటా సెంటర్‌ను స్వాగతిస్తున్నాం' అంటూ వైసీపీ అధ్యక్షుడు గురువారం స్వయంగా ప్రకటన చేశారు. కానీ... పది రోజులుగా జరుగుతున్న కథ వేరు. గూగుల్ డేటా సెంటర్‌పై వైసీపీ నేతలు, మేధావుల ముసుగు వేసుకున్న జగన్ మద్దతుదారులు రకరకాల దుష్ప్రచారాలు చేశారు. జగన్ చానల్‌లో దీనిపై చర్చోపచర్చలు నడిపారు. గూగుల్ డేటా సెంటర్ ఒక గోడౌన్‌లాంటిది మాత్రమే అని ఒకరన్నారు. 'హమ్మో... దానివల్ల కాలుష్యం పెరిగిపోతుంది' అని

మిగతా 12వ పేజీలో...



గ్రామీణ డిజిటల్ ఆరోగ్య సేవల కోసం ఏపీతో కలిసి పనిచేయాలని కోరుతూ లేసా సీఈవో బిజిల్ సెక్ పాల్‌తో భేటీ అయిన మంత్రి లోకేశ్

క్వాంటమ్ రిసెర్చ్‌లో భాగస్వాములవ్వండి

వర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్‌కు లోకేశ్ అభ్యర్థన

రాష్ట్రాభివృద్ధి లక్ష్యాల సాధనకు సహకరించండి

ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఐవోటీల్లో నైపుణ్యాభివృద్ధికి తోడ్పడండి

స్మార్ట్ సిటీ ప్లానింగ్, వ్యర్థాల నిర్వహణ టెక్నాలజీ పంచండి

విక్టోరియా క్రీడల మంత్రితోనూ భేటీ.. క్రికెట్, హాకీల్లో ఉమ్మడి శిక్షణ శిబిరాలు, ఫ్రెండ్లీ మ్యాచ్‌లు నిర్వహించాలని వినతి

టాస్మేనియా వర్సిటీ సందర్శన.. లేసా ఆసియా పసిఫిక్ సీవోవోతో భేటీ

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి లక్ష్య సాధనలో భాగస్వామి కావాలని యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్‌ను ఏపీ విద్య, ఐటీ-ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ అభ్యర్థించారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఐదో రోజు గురువారం ఆయన వివిధ వర్సిటీలు, సంస్థల అధిపతులతో సమావేశమయ్యారు. తొలుత మెల్‌బోర్న్ వర్సిటీని సందర్శించారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎమ్మా జాన్స్టన్, డిప్యూటీ వైస్ చాన్స్‌లర్ (గ్లోబల్, కల్చర్-ఎంగేజ్‌మెంట్) ప్రొఫెసర్ మైకేల్ వెస్లీ, డీన్ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ జెన్నిఫర్ బలింత్, డీన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ మారెక్ తెసర్, డీన్ ఆఫ్ ఇంజనీరింగ్-ఐటీ ప్రొఫెసర్ నిర్మల్‌దాస్, డీన్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ మొయిరా ఓబ్రియాన్ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు. క్వాంటమ్ పరిశోధనలు, ఉపాధ్యాయ శిక్షణపై లోకేశ్ వారితో చర్చించారు. ఏపీ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలతో కలసి కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) వంటి ఆధునాతన సాంకేతికతల్లో

మిగతా 12వ పేజీలో...



అమరావతికి మరో

1,750 కోట్లు!

డిసెంబరు నాటికి ప్రపంచ బ్యాంకు విడుదల

ఇప్పటికే మొదటి విడతగా రూ.1,800 కోట్లు **14**

'స్వయం సహాయం'లో

ఏపీ ఫస్ట్

మహిళా సంఘాలకు రుణాలివ్వడంలో అగ్రస్థానం

దేశంలోనే అత్యధికంగా రూ.34.83 లక్షల కోట్ల పంపిణీ **11**

రెండు, మూడు స్థానాల్లో నిలిచిన ఉత్తరప్రదేశ్, బిహార్

బిహార్ మహాగర్‌బంధన్ సీఎం అభ్యర్థిగా

తేజస్వీ యాదవ్

ఉప ముఖ్యమంత్రి అభ్యర్థిగా వీఐపీ అధ్యక్షుడు సహనీ **2**

ప్రకటించిన అశోక్ గహ్లోత్

నాగ్ క్షిపణులు..

టార్పెడోలు

రూ.79 వేల కోట్లతో ఆయుధాల కొనుగోలుకు కేంద్రం ఆమోదం

రక్షణ రంగం బలోపేతం దిశగా మరో కీలక నిర్ణయం **2**

వీడని వాన.. తప్పిన వాయుగండం

దక్షిణ కోస్తాలో తీరం దాటిన అల్పపీడనం

రాష్ట్రంలో విస్తారంగా వానలు

నెల్లూరు జిల్లాలో వాగులో కొట్టుకుపోయి వ్యక్తి మృతి

నేడు మరో అల్పపీడనం.. వాయుగుండంగా మారే చాన్స్

29 వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు: ఐఎండీ

ప్రభావిత జిల్లాల్లో కంట్రోల్ రూముల ఏర్పాటు

రాష్ట్రాన్ని ముసురేసింది

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రానికి వాయుగుండం ముప్పు తప్పింది. బంగాళాఖాతంలో రెండు రోజులుగా కొనసాగిన తీవ్ర అల్పపీడనం బుధవారం రాత్రి అల్పపీడనంగా బలహీనపడి దక్షిణ కోస్తాలో తీరం దాటింది. అనంతరం ఇది కర్ణాటక పరిసరాల్లో కొనసాగుతూ శుక్రవారం నాటికి అరేబియా సముద్రంలోకి ప్రవేశించనుంది. దాని ప్రభావంతో బంగాళాఖాతం నుంచి భారీగా తేమగాలులు రాష్ట్రంపైకి రావడంతో గురువారం రాష్ట్రవ్యాప్తంగా ముసురుపట్టి, విస్తారంగా వర్షాలు కురిశాయి. గురువారం కోనసీమ, పశ్చిమగోదావరి, నెల్లూరు, కాకినాడ జిల్లాల్లో భారీ వర్షాలు కురవగా, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వాన పడింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోనలో 12, రావులపాలెంలో 9.2, ముమ్మిడివరంలో 9, పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో 8.5, కోనసీమ జిల్లా

మిగతా 14వ పేజీలో...



గురువారం విజయవాడలో జోరు వాన

ప్రాణ.. ఆస్తి నష్టం జరక్కూడదు!

భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

దుబాయ్ నుంచి సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

ప్రభావిత జిల్లాలకు అత్యవసర నిధులు మంజూరు

రష్యా చమురుపై ఆంక్షల మంటలు!

'రాస్‌నెఫ్ట్, లుకోయిల్'లపై అమెరికా ఆంక్షలు

వాటి నుంచి చమురు కొనే విదేశీ సంస్థలపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరిక

రష్యా సహజవాయువు దిగుమతులు, చమురు రవాణా నౌకలపై ఈయూ ఆంక్షలు

ఏడాది చివరికల్లా రష్యా చమురు కొనుగోళ్లను భారత్ ఆపేస్తుంది: ట్రంప్

ఉక్రెయిన్‌తో యుద్ధ విరమణ కోసం చేస్తున్న ప్రయత్నాలకు ఆంక్షలతో విఘాతం: రష్యా

ఆంక్షల నేపథ్యంలో చమురు ధరలకు రెక్కలు

ఆసియాన్ సదస్సుకు మోదీ వెళ్లట్లేదు!


వర్చువల్‌గా పాల్గొననున్న ప్రధాని

ట్రంప్ టార్గెట్ చేస్తారన్న భయం: కాంగ్రెస్



వాషింగ్టన్/ న్యూఢిల్లీ, అక్టోబరు 23: ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ఎలాగైనా ఆపుతానని చెబుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. రష్యాను మరింతగా ఇరుకున పెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. రష్యా ఆర్థిక వ్యవస్థకు కీలకమైన చమురు ఎగుమతులను దెబ్బతీసే చర్యలకు దిగారు. రష్యాకు చెందిన పెద్ద చమురు సంస్థలు రాస్‌నెఫ్ట్, లుకోయిల్‌లతో

మిగతా 2వ పేజీలో...



ఫార్మకో జినోమిక్స్‌పై అధ్యయనం జరిపిన ఏఐజీ వైద్యులు కల్యాణ్, ఉషతో నాగేశ్వర్‌రెడ్డి

మనిషిని బట్టే మందు!

జబ్బును బట్టి అందరికీ ఒకే ఔషధం సరికాదని మా పరిశోధనలో తేలింది

జన్యుక్రమం, శరీరతత్వానికి అనుగుణంగా వేర్వేరు మందులు **13**

అందుకు వీలు కల్పించేలా ఫార్మకోజినోమిక్స్ టెస్టు.. ఏఐజీలో రూ.5 వేలకే లభ్యం

ఆ రిపోర్టుతో జీవితాంతం కచ్చితమైన వైద్యం.. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి వెల్లడి

డిసెంబరు 10 నుంచి టెట్

షెడ్యూల్ విడుదల.. నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

డిసెంబరు 3 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

జనవరి 19న ఫలితాలు విడుదల **14**

నేడు నోటిఫికేషన్ ఇవ్వనున్న పాఠశాల విద్యాశాఖ



పాపం పండింది!

చెరువులోకి దూకి అత్యాచార నిందితుడి మృతి

బహిర్భూమి కోసం వాహనం ఆపి.. దూకేసిన నారాయణరావు

న్యాయాధికారి వద్దకు వెళ్తుండగా ఘటన

చెరువులో లభించిన మృతదేహం

చావడమే కరెక్ట్: కుటుంబ సభ్యులు



కాకినాడ/తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పశ్చాత్తాపమా... తప్పించుకునే ప్రయత్నంలో జరిగిన ప్రమాదమా... తునిలో బాలికపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడైన నారాయణరావు (62) చెరువులో శవమై తేలాడు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో నిందితుడి మరణం కూడా అంతే సంచలనంగా మారింది. తుని పట్టణ సీఐ, ఎస్ఐల కథనం ప్రకారం... కాకినాడ జిల్లా తుని పట్టణానికి

మిగతా 14వ పేజీలో...

భారతీయులకు చెడ్డపేరొస్తోంది!



అవగాహనారాహిత్యంతో అమెరికాలో అపఖ్యాతి

వీధుల్లో ఉత్సవాలు, లౌడ్ స్పీకర్లు, బాణసంచా ప్రమాదకరం

థియేటర్లలో పాలాభిషేకాలు, ఈలలు, డ్యాన్సులు వంటి చేష్టలతో మనపై అమెరికన్ల చిన్నచూపు

డాలస్‌లో అవగాహన సదస్సులో వక్తలు **13**

హెచ్-1బీపై లక్ష డాలర్ల ఫీజు వద్దు.. చట్టసభ సభ్యుల బృందం లేఖ **2**



తిరువూరులో రచ్చ

ఎంపీ కేశినేని చిన్ని X ఎమ్మెల్యే కొలికపూడి

2024 ఎన్నికల్లో టికెట్‌కు చిన్ని 5 కోట్లు అడిగారని కొలికపూడి ఆరోపణలు

నా డబ్బులు ఖర్చు చేస్తానే తప్ప వసూలు చేయను.. కొలికపూడి వైసీపీ కోవర్టు: ఎంపీ

వైసీపీ నాయకులతో ఆయనే వ్యాపారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే ధ్వజం

నియోజకవర్గంలో వేర్వేరుగా కార్యక్రమాలు.. మీడియా, సోషల్ మీడియాలో రచ్చ రచ్చ

బాధ్యత లేకుండా ప్రవర్తిస్తారా?

ఎన్టీఆర్ జిల్లా టీడీపీ నేతలపై సీఎం ఆగ్రహం

పెట్టుబడుల కోసం నేను విదేశాల్లో పర్యటిస్తుంటే రచ్చచేస్తారా? **13**

క్రమశిక్షణారాహిత్యాన్ని సహించను

పార్టీ కార్యాలయానికి ఎవరినీ పిలవొద్దు

నేనొచ్చాక సంగతి తేలుస్తా.. పల్లాకు ఆదేశం

వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టు నోటీసులు **12**

'తదుపరి దర్యాప్తు'పై అభిప్రాయాలు చెప్పాలని ఆదేశం

నూతన సీజేఐ ఎంపిక ప్రక్రియ ఆరంభం

» వారసుడి పేరు సూచించాలని జస్టిస్ గవాయ్‌కు కేంద్రం లేఖ

» జస్టిస్ సూర్యకాంత్‌కు అవకాశం?

న్యూఢిల్లీ, అక్టోబరు 23: సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నియామక ప్రక్రియను గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ వచ్చే నెల 23న పదవీ విరమణ చేయనుండడంతో కొత్తవారిని ఎంపిక చేయాల్సిన అవసరం ఏర్పడింది. వారసుడి పేరును సూచించాల్సిందిగా కోరుతూ జస్టిస్ గవాయ్‌కు లేఖ రాసింది. 65 ఏళ్ల వయసు వచ్చిన వెంటనే ప్రధాన న్యాయమూర్తి పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. దానిని పరిగణనలోకి తీసుకొని పదవీ విరమణకు నెల రోజులు ముందుగా కేంద్రం లేఖ రాయడం సంప్రదాయంగా వస్తోంది. సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి తరువాత అత్యంత సీనియర్ అయిన జడ్జిని తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా నియమించే ఆచారం ఉండడంతో ఆ అవకాశం జస్టిస్ సూర్యకాంత్‌కు దక్కే సూచనలు ఉన్నాయి. ఒకవేళ జస్టిస్ సూర్యకాంత్ నియమితులైతే ఆయన 15 నెలలపాటు అంటే నవంబరు 24 నుంచి 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకు పదవిలో కొనసాగనున్నారు.

విమానాల్లో పవర్ బ్యాంకులపై నిషేధం!

» విమానయాన భద్రతపై డీజీసీఏ సమాలోచనలు

న్యూఢిల్లీ, అక్టోబరు 23: దేశీయ విమానాల్లో పవర్ బ్యాంకులపై నిషేధం విధించడంపై పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) సమాలోచనలు జరుపుతోంది. ఆదివారం ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నాగాలాండ్‌లోని దిమాపూర్‌కు బయలుదేరిన ఇండిగో విమానంలో ఓ ప్రయాణికుని పవర్ బ్యాంక్ నుంచి మంటలు చెలరేగాయి. క్యాబిన్ సిబ్బంది సత్వరమే స్పందించి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి నష్టమూ వాటిల్లలేదు. ఈ ఘటన తరువాత లిథియం బ్యాటరీలతో పనిచేసే పవర్ బ్యాంకులను విమానాల్లో తీసుకువెళ్లడం, వాటిని ఉపయోగించడం ఎంత వరకు క్షేమమన్న అంశంపై సమగ్ర పరిశీలన అవసరమైంది. ఈ నేపథ్యంలో డీజీసీఏ సమాలోచనల తరువాత పవర్ బ్యాంక్‌లపై పూర్తి నిషేధం లేదా వాటి వాడకంపై కఠిన నిబంధనలు అమలు కావచ్చని తెలుస్తోంది.

ఒక్కో ఓటు తొలగింపునకు రూ.80

» కర్ణాటకలోని ఆళంద నియోజకవర్గ ఓటర్ల లిస్టు అక్రమాలపై సిట్ గుర్తింపు

బెంగళూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కలబురగి జిల్లా ఆళంద శాసనసభ నియోజకవర్గం ఓటర్ల జాబితా అవకతవకల కేసులో సిట్ అధికారులు కీలక విషయాలు గుర్తించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 6,018 మంది పేర్లను ఓటర్ల లిస్టు నుంచి తొలగించేందుకు డబ్బులు చెల్లించినట్లు గుర్తించారు. ఒక్కో ఓటు తొలగింపునకు రూ.80 చొప్పున ఓ డేటా సెంటర్ నిర్వాహకుడికి చెల్లించినట్లు సిట్ దర్యాప్తులో తేలింది. ఓట్లను తొలగింపునకు సంబంధించి 2022 డిసెంబరు, 2023 ఫిబ్రవరి మధ్య 6,018 దరఖాస్తులు చేశారని, ఇందుకుగానూ రూ.4.80 లక్షల చెల్లించారని గుర్తించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆళంద నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీఆర్ పాటిల్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత నెలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దయెత్తున ఓట్ల దొంగతనం ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. ఓటర్ల తొలగింపును పార్టీ గుర్తించకుంటే.. తాను ఆళంద సీటులో ఓడిపోయేవాడినని అన్నారు.

ఢిల్లీలో బిహారీ గ్యాంగ్‌స్టర్ల ఎన్‌కౌంటర్

» పోలీసుల ఎదురుకాల్పుల్లో నలుగురు హతం

న్యూఢిల్లీ, అక్టోబరు 23: ఢిల్లీలోని రోహిణి ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసుల ఎదురుకాల్పుల్లో మోస్ట్ వాంటెడ్ 'సిగ్మా అండ్ కంపెనీ' గ్యాంగ్ సభ్యులైన నలుగురు నేరస్తులు హతమయ్యారు. వీరిపై బిహార్‌లో హత్యలు, దోపిడీలు, క్రూరమైన నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిని రంజన్ పాఠక్ (25), బిమ్లేశ్ మహతో (25), మనీశ్ పాఠక్ (33), అమన్ ఠాకూర్ (21)గా పోలీసులు పేర్కొన్నారు. అందరూ బిహార్‌లోని సీతామర్హి జిల్లాకు చెందిన వారని, సిగ్మా గ్యాంగ్ సభ్యులని వెల్లడించారు. ఢిల్లీ, బిహార్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో భాగంగా జరిగిన ఎదురుకాల్పుల్లో వీరు హతమయ్యారని చెప్పారు. ఈ నేరగాళ్లు కొద్ది రోజులుగా ఢిల్లీలో దాగి ఉన్నారన్న సమాచారం మేరకు పోలీసులు సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో తారసపడిన వారు పోలీసులపై కాల్పులు జరిపారని, ప్రతిగా జరిపిన ఎదురుకాల్పుల్లో నలుగురు నేరస్తులు గాయపడ్డారని, ఆ తర్వాత ఆస్పత్రికి తరలించగా.. మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

నాన్నే నేరస్తుడని నమ్మించేలా

అమ్మను చంపేశాడు!

» చదువుకోమంటోందని ఓ బాలుడి ఘాతుకం

చెన్నై, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలని ఒత్తిడి చేస్తోందని తల్లిని ఓ బాలుడు చంపేయడమే కాకుండా.. ఆ నేరం తండ్రిపైకి వస్తుందని ధీమాగా ఉన్నాడు. అయితే పోలీసుల విచారణలో దొరికిపోయాడు. తమిళనాడులోని కళ్లకుర్చి జిల్లా కీల్‌కుప్పంవేలూరుకు చెందిన లారీ డ్రైవర్ గుణశేఖరన్, మహేశ్వరి (40) దంపతులకు ఓ కుమార్తె, 14 ఏళ్ల కుమారుడు ఉన్నారు. దీపావళి రోజు భర్త తీసుకొచ్చిన చీరను తీసుకునేందుకు మహేశ్వరి నిరాకరించింది. దీంతో ఆ దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో గుణశేఖరన్ ఆమెపై చేయిచేసుకున్నాడు. అనంతరం మహేశ్వరి ఇంటి నుంచి పొలానికి వెళ్లింది. అదే రోజు సాయంత్రం ఆమె మృతదేహం ఊరి చివరి పొలాల్లో రక్తపు మడుగులో పడి ఉంది. సమాచారం అందుకున్న నావలూరు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముందుగా మహేశ్వరి భర్తను అనుమానించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అయితే లోతైన దర్యాప్తు చేపట్టాక మహేశ్వరి కుమారుడే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు అనుమానించి బుధవారం అతనిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. చదువుకోవాలంటూ నిత్యం పోరుపెడుతున్న తల్లి పట్ల ఆ బాలుడు ఆగ్రహం పెంచుకుని ఆ ఘాతుకానికి పాల్పడినట్లు తేలింది. బాలుణ్ని అరెస్టు చేసిన పోలీసులు గురువారం జువైనల్ హోంకు తరలించారు.

మగాడివైతే యుద్ధానికి రా!

» పాక్ ఆర్మీ చీఫ్‌కు తాలిబన్ల సవాల్

న్యూఢిల్లీ, అక్టోబరు 23: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిం మునీర్‌కు తెహ్రీక్ తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) తీవ్ర హెచ్చరికలు చేసింది. పాక్ ఆర్మీ తన సైనికులను చావడానికి పంపడం మానుకోవాలని హితవు పలికింది. దీని బదులు ఉన్నతాధికారులే యుద్ధక్షేత్రంలోకి దిగి ముందుండి నడిపించాలని సవాలు విసిరింది. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ మధ్య ఇటీవల తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో టీటీపీ ఈ మేరకు పాక్ ఆర్మీకి హెచ్చరికలు చేయడం గమనార్హం. పాక్ సైనికులు ప్రాణాలు కోల్పోయిన అనేక ఘటనలకు సంబంధించిన వీడియోలను కూడా టీటీపీ విడుదల చేసింది. 'నువ్వు మగాడివైతే మమ్మల్ని ఎదుర్కో! తల్లిపాలు తాగినోడివైతే మాతో యుద్ధం చెయ్యి' అంటూ ఆ వీడియోల్లో మునీర్‌ను ఉద్దేశించి టీటీపీ కమాండర్ కజీమ్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు.

'సర్'కు సన్నాహాలు చేయండి

» రాష్ట్రాల సీఈఓలకు ఎన్నికల సంఘం ఆదేశాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 23: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) చేపట్టడానికి సన్నాహాలు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారు (సీఈఓ)లను ఆదేశించింది. ఈ సన్నాహాల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి నివేదికలు పంపించాలని సూచించింది. గురువారం ఇక్కడ ముగిసిన ఈసీఓల సదస్సులో ఈ సూచనలు చేసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో 'సర్'కు సంబంధించిన పలు అంశాలను ఎన్నికల సంఘం సీనియర్ అధికారులు వివరించారు. పలు సందేహాలను తీర్చారు. ఈ సమావేశాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలు పాల్గొన్నారు.

రష్యా చమురుపై

ఆంక్షల మంటలు!



(మొదటిపేజీ తరువాయి)

పాటు వాటి అనుబంధ కంపెనీలపై ఆంక్షలు విధించారు. అమెరికా సహా ప్రపంచ దేశాల్లోని కంపెనీలేవైనా.. సదరు రష్యా కంపెనీలతో ఎలాంటి లావాదేవీలు జరిపినా కఠిన చర్యలు చేపడతామని ప్రకటించారు. ఈ మేరకు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ ప్రకటన చేశారు. మిత్ర దేశాలన్నీ ఈ ఆంక్షలకు కట్టుబడి, తమతో కలిసి రావాలని కోరారు. రష్యా ఉక్రెయిన్‌లో ప్రజలను చంపడం ఆపి, వెంటనే కాల్పుల విరమణ పాటించడానికి ఇది సరైన సమయమని పేర్కొన్నారు. మరోవైపు యూరోపియన్ యూనియన్ కూడా రష్యా నుంచి సహజవాయువు దిగుమతులు, చమురు రవాణా నౌకలపై ఆంక్షలు విధించింది. రష్యాకు ఆర్థిక వనరులు అందకుండా చేయడమే తమ లక్ష్యమని ప్రకటించింది. ఇక రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించే అంశంపై ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉన్న 35 దేశాల ప్రతినిధులు శుక్రవారం లండన్‌లో సమావేశం కానున్నారు. కాగా, అమెరికా తాజా ఆంక్షలపై రష్యా మండిపడింది. ఉక్రెయిన్‌లో యుద్ధం నిలిపివేత దిశగా జరుగుతున్న దౌత్య ప్రయత్నాలకు ఈ ఆంక్షలు విఘాతం కలిగిస్తాయని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు. అమెరికా, ఇతర పశ్చిమ దేశాల ఆంక్షలను సమర్థంగా ఎదుర్కొనగలమని ధీమా వ్యక్తం చేశారు.

భారత్ కొనుగోళ్లు ఆపేస్తుంది: ట్రంప్

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. "రష్యా చమురులో 40%భారత్ కొనుగోలు చేస్తోంది. ఇప్పుడు ఆ కొనుగోళ్లు నిలిపివేసేందుకు సిద్ధమైంది. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టొచ్చు. ఈ ఏడాది చివరికల్లా పూర్తిగా నిలిపివేస్తుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. నిజానికి గతంలో రష్యా, చైనా మధ్య సంబంధాలు కూడా ఏమీ బాగుండేవి కావని.. కానీ అమెరికా మాజీ అధ్యక్షులు ఒబామా, బైడెన్ అమలు చేసిన విధానాల కారణంగా దగ్గరయ్యాయని వ్యాఖ్యానించారు. ఇప్పుడు పరిస్థితి మారుతోందన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎలా ఆపాలన్నదానిపై ఆసియాన్ సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో చర్చిస్తానని చెప్పారు.

చమురు ధరల మంటలు షురూ..

రష్యాకు చెందిన అతిపెద్ద చమురు సంస్థలపై ఆంక్షలు విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించగానే చమురు ధరల మంటలు మొదలయ్యాయి. గురువారం ఒక్కరోజే ముడి చమురు ధరలు 4.4% మేర పెరిగాయి. అమెరికా ఆంక్షల కారణంగా భారత్, చైనాల్లోని రిఫైనరీలు రష్యా చమురు సంస్థలతో లావాదేవీలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. దీనితో ఇతర దేశాల నుంచి చమురు దిగుమతి చేసుకోక తప్పదు. ఇది మార్కెట్లో డిమాండ్ పెంచుతుందనే ఉద్దేశంతో చమురు ధరలకు రెక్కలు వస్తున్నాయి.

పరస్పరం కొనసాగుతున్న దాడులు..

ఉక్రెయిన్‌లోని కీవ్, ఖార్కీవ్ సహా పది ప్రాంతాలపై రష్యా డ్రోన్, క్షిపణి దాడులు కొనసాగుతున్నాయని ఉక్రెయిన్ వైమానికదళం తెలిపింది. రష్యా బుధవారం రాత్రి 405 డ్రోన్లు, 28 క్షిపణి దాడులు చేసినట్టు వెల్లడించింది. ఈ దాడుల్లో ఆరుగురు చనిపోయారని పేర్కొంది. అదే సమయంలో తాము రష్యాలోని కీలక రసాయన కర్మాగారంపై దాడి చేసి ధ్వంసం చేశామని వెల్లడించింది.

రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించక తప్పదా!

ఉక్రెయిన్‌పై యుద్ధం నేపథ్యంలో రష్యాపై అమెరికా, యూరప్ దేశాలు గతంలో పలు ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి చమురు, గ్యాస్ దిగుమతులను తగ్గించుకున్నాయి. ఈ క్రమంలో రష్యా తమ చమురును అమ్ముకునేందుకు రాయితీలు ఇవ్వడం మొదలుపెట్టింది. దీనితో రష్యా నుంచి చైనా, భారత్ చమురు దిగుమతులను భారీగా పెంచుకున్నాయి. అయితే చైనా, భారత్ చమురు కొనుగోళ్లతో సమకూరిన సొమ్మును ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం రష్యా వినియోగిస్తోందని అమెరికా మండిపడుతోంది. ఈ క్రమంలోనే భారత్‌పై 50% సుంకాలు కూడా విధించింది. భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించాలన్న షరతు కూడా పెట్టింది. ఈ క్రమంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించేందుకు భారత్ సిద్ధమైంది కూడా. దీనికితోడు రష్యా చమురు కంపెనీలపై తాజా ఆంక్షల నేపథ్యంలో భారత రిఫైనరీలు దిగుమతులు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా భారత్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్ రష్యా నుంచి తక్కువ ధర చమురును భారీ స్థాయిలో దిగుమతి చేసుకుని, శుద్ధిచేసి.. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం, ఇతర ఉత్పత్తులను అమెరికా, యూరప్ దేశాలకు విక్రయిస్తోంది. రిలయన్స్‌కు రష్యా రాస్‌నెఫ్ట్ సంస్థ నుంచి రోజుకు 5లక్షల బ్యారెళ్ల చమురు సరఫరా ఒప్పందం కూడా ఉంది. ఆంక్షల వల్ల రిలయన్స్‌తోపాటు ప్రభుత్వరంగ సంస్థలైన ఐఓసీ, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం సంస్థలు రష్యా చమురు దిగుమతులను నిలిపివేయనున్నాయి.



ఆసియాన్ సదస్సుకు

మోదీ వెళ్లట్లే!

» వర్చువల్‌గా పాల్గొననున్న ప్రధాని

» మలేసియాలో ట్రంప్-మోదీ భేటీ లేనట్లే..



న్యూఢిల్లీ, అక్టోబరు 23: మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరగనున్న 47వ ఆసియాన్ సదస్సుకు ప్రధాని మోదీ హాజరవడం లేదు. ఈ విషయాన్ని గురువారం ఆయనే స్వయంగా వెల్లడించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న ఆసియాన్ సదస్సుకు వ్యక్తిగతంగా హాజరుకాలేకపోతున్నానని.. వర్చువల్‌గా పాల్గొంటానని తెలిపారు. అంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మోదీ భేటీ లేదన్నమాట. మోదీకి బదులుగా విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని అధికారిక వర్గాలు తెలిపాయి. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ఫోన్‌లో మాట్లాడినట్లు ప్రధాని మోదీ ఎక్స్‌లో తెలిపారు. ఆసియాన్ సదస్సు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. కాగా, భారత్ ఎప్పటికీ మలేసియాకు ప్రధాన భాగస్వామి అని ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం అన్నారు. ప్రధాని మోదీ తనకు ఫోన్ చేశారని తెలిపారు. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే ప్రధాని మోదీ ఆసియాన్ సదస్సుకు వెళ్లడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాగా, భారత్‌లోని కెనడా రాయబార కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది సంఖ్యను పెంచుకోవడానికి మోదీ సర్కారు అంగీకారం తెలిపింది.

హెచ్-1బీ వీసాపై లక్ష డాలర్ల ఫీజు వద్దు

» ట్రంప్‌నకు అమెరికా చట్టసభ సభ్యుల బృందం లేఖ

న్యూఢిల్లీ, అక్టోబరు 23: హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు సొంత పార్టీ నుంచే సెగ తగిలింది. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ అధికార రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీలకు చెందిన ఏడుగురు చట్టసభ సభ్యుల బృందం ఆయనకు లేఖ రాసింది. పెంచిన ఫీజు కారణంగా చిన్న కంపెనీలతో పాటు స్టార్టప్‌లపైనా తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని, ఆవిష్కరణలకు ఆటంకం ఏర్పడుతుందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న హెచ్-1బీ వీసా విధానంలో మార్పులు అవసరమని తాము కూడా అంగీకరిస్తున్నామని, అయితే ఫీజు పెంపు నిర్ణయం కంపెనీల యాజమాన్యాలకు గణనీయమైన సవాళ్లను సృష్టించడంతో పాటు అమెరికా పోటీ తత్వాన్ని బలహీనపరుస్తుందని హెచ్చరించారు. దీనివల్ల నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగులను దేశం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అమెరికన్ల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకొనే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడం, వీసా అర్హతల్లో మార్పులు తదితర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫీజులు పెంచడానికి బదులుగా ఈ వ్యవస్థను సరిదిద్దడానికి కాంగ్రెస్‌తో కలసి పనిచేయాలని అధ్యక్షుడిని కోరారు. హెచ్-1బీ ప్రోగ్రామ్‌లో సమస్యలను పరిష్కరించడానికి గల మార్గాలపై తమతో చర్చలు జరపాలని ట్రంప్‌తో పాటు వాణిజ్య మంత్రి లుట్నిక్‌ను సభ్యుల బృందం అభ్యర్థించింది.

కేదార్‌నాథ్, యమునోత్రి

ఆలయాల మూసివేత

రుద్రప్రయాగ్/ఉత్తరకాశీ, అక్టోబరు 23: శీతాకాలం రావడంతో హిమాలయాల్లోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాలను ఉత్తరాఖండ్ అధికారులు మూసివేశారు. ఈ సందర్భంగా గురువారం ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రుద్రప్రయాగ్ నుంచి కేదార్‌నాథుడి పల్లకి ఊరేగింపు ఆర్మీ మేళతాళాలు, సుమారు పది వేల మంది భక్తుల నినాదాల మధ్య ఘనంగా ప్రారంభమయింది. ఈ ఊరేగింపు శనివారం నాటికి ఉఖిమఠ్‌లోని ఓంకారేశ్వర ఆలయానికి చేరుకోనుంది. మిగిలిన ఆరునెలల పాటు ఆ ఆలయంలో కేదార్‌నాథుడు పూజలందుకుంటాడు. ఈ ఉత్సవాల్లో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్ ఆలయాలను అధికారులు మూసివేయగా, బద్రీనాథ్ ఆలయాన్ని నవంబరు 25న మూసివేయనున్నారు. మంచు, తీవ్రమైన చలి కారణంగా ప్రతి సంవత్సరం అక్టోబరు- నవంబరు నెలల్లో ఈ ఆలయాలను మూసివేసి ఏప్రిల్- మే నెలల్లో తిరిగి తెరుస్తారు.

మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ



పట్నా, అక్టోబరు 23: బిహార్ మహాగఠ్‌బంధన్ తరఫున సీఎం అభ్యర్థిగా రాష్ట్రీయ జనతాదళ్ నేత తేజస్వీ యాదవ్ పేరును ఎట్టకేలకు అధికారికంగా ప్రకటించారు. దీంతో పాటు డిప్యూటీ సీఎం అభ్యర్థిగా వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ(వీఐపీ) అధ్యక్షుడు ముఖేశ్ సహనీ పేరును కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ పాట్నాలో ప్రకటించారు. ఈ ఇద్దరి పేర్లపై కాంగ్రెస్ అధిష్ఠానంతో పాటు విపక్ష కూటమి అంగీకారం తెలిపిందని ఆయన వెల్లడించారు. తేజస్వీ గతంలోనే డిప్యూటీ సీఎంగా పనిచేయగా, సహనీ గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు.

ఎవరీ ముఖేశ్ సహనీ

వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ అధ్యక్షుడు ముఖేశ్ సహనీ 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేతో కలిసి నలుగురు అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా గెలిపించుకున్నారు. అయితే తాను మాత్రం ఓడిపోయారు. అయినా ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన బీజేపీ.. కేబినెట్‌లో మత్స్యశాఖ మంత్రిగా తీసుకుంది. అనంతర పరిణామాల్లో ఆయన పార్టీ ఎమ్మెల్యే ఒకరు చనిపోవడం, మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. ఆ తర్వాత సహనీకి బీజేపీ అవకాశం ఇవ్వకపోవడంతో మహాగఠ్‌బంధన్‌తో చేతులు కలిపారు. మరోవైపు.. బిహార్ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి కృష్ణ అల్లవరును వెంటనే తొలగించాలని డిమాండు చేస్తూ గురువారం పట్నాలో స్థానిక నేతలు ఆందోళనకు దిగారు. దీనిపై స్పందించిన అధిష్ఠానం.. కృష్ణ అల్లవరు యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగానూ కొనసాగుతుండగా ఆ బాధ్యతల నుంచి తప్పించింది. కాగా, బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఎన్డీయే వికాసానికి, మహాగఠ్‌బంధన్ వినాశనానికి మధ్య పోరుగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చెప్పారు. ఔరంగాబాద్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తాను పాట్నాలోనే పుట్టి పెరిగానని, ఆర్జేడీ అవినీతి పాలనను కళ్లారా చూశానన్నారు.

మరో వందేళ్ల దాకా మరచిపోలేరు: మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 23: మరో వందేళ్ల దాకా బిహార్‌లో ఆర్జేడీ ఆటవిక పాలనను ప్రజలు మరచిపోలేరని ప్రధాని మోదీ చెప్పారు. విపక్షాలది పార్టీల కూటమి కాదని, బెయిల్‌పై బయట కొచ్చిన దోపిడీదార్ల కూటమి అని ఆరోపించారు. యువ సంవాద్ పేరిట ఆయన ఆన్‌లైన్ ద్వారా బిహార్ యువతతో ముచ్చటించారు. కేంద్రంలోనూ, బిహార్‌లోనూ స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాలు ఉండటం వల్లే నిరంతర అభివృద్ధి జరుగుతోందన్నారు. తాజా ఎన్నికలు కొత్త చరిత్రను సృష్టించబోతున్నాయని, ఇందులో యువత కీలక పాత్ర పోషించబోతుందని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు హక్కు తప్పకుండా వినియోగించుకోవాలని ఓటర్లకు చెప్పాలని ప్రధాని యువతకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఓటర్లకు వివరించాలన్నారు.

కార్బైడ్ గన్.. 14 మంది పిల్లల చూపు పోగొట్టింది!

» మధ్యప్రదేశ్‌లో కొన్ని కుటుంబాల్లో చీకట్లు నింపిన దీపావళి

» ఈ తుపాకులపై కేంద్రం నిషేధం.. అయినా అడ్డగోలుగా విక్రయాలు



భోపాల్, అక్టోబరు 23: దీపావళి, కొందరి పిల్లల కంటిచూపును శాశ్వతంగా పోగొట్టి వారి జీవితాల్లో చీకట్లు నింపింది. అత్యంత ప్రమాదకరమైన కార్బైడ్ గన్‌ను పేల్చడం ద్వారా మధ్యప్రదేశ్‌లో కేవలం మూడు రోజుల్లో 122 మంది చిన్నారులు తీవ్ర నేత్ర సంబంధిత గాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. వీరిలో 14 మంది చిన్నారులు శాశ్వతంగా చూపు పోగొట్టుకున్నారు. విదిశ జిల్లాలో ఎక్కువ మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. భోపాల్, ఇండోర్, జబల్‌పూర్, గ్వాలియర్‌లోనూ ఎక్కువ కేసులు వెలుగుచూసినట్లు చెబుతున్నారు. కార్బైడ్ తుపాకులు అత్యంత ప్రమాదకరమైనవి కావడంతో వీటి అమ్మకాలపై అక్టోబరు 18న కేంద్రం నిషేధం విధించింది. అయినా.. వీటి విక్రయాలు భారీగా సాగాయి. కార్బైడ్ గన్ అనేది హ్యాండ్ మేడ్ గన్. ప్లాస్టిక్ గొట్టాలతో తయారు చేస్తారు. దానికి చిన్న రంధ్రం చేసి.. అందులో కాల్షియం కార్బైడ్ లేదా గన్‌పౌడర్ కూర్చి పేల్చుతారు. ఇది పేల్చితే బాంబుల తరహాలో భారీగా శబ్దం వస్తుండం, అప్పటికప్పుడు పైపులతో సులభంగా తయారు చేసుకునే వీలు ఉండటం, బయట కూడా తక్కువ ధర (రూ.150-రూ.200)కే లభిస్తుండటంతో మధ్యప్రదేశ్‌లో పిల్లలు ఈసారి ఎగబడి కొన్నారు. ఈ తుపాకులను పేల్చినప్పుడు కొన్నిసార్లు నిప్పుకణికల్లాంటి రసాయన రేణువులు, మంటలు నేరుగా ముఖంపైకే దూసుకొస్తాయి. ఆస్పత్రిపాలైన పిల్లల్లో చాలామంది పాక్షికంగా చూపు కోల్పోయారు. 'కార్బైడ్ గన్‌తో ఒక కన్ను పూర్తిగా కాలిపోయింది. ఆ కన్నుతో నేను ఇక చూడలేను' అని నేహా అనే 17 ఏళ్ల బాలిక చెప్పింది. 'సోషల్ మీడియాలో చూసి.. కార్బైడ్ గన్‌ను నేనే తయారు చేసి పండుగ రోజు పేల్చాను. ముఖమ్మీదే పేలడంతో ఒక కన్ను పూర్తిగా పోయింది' అని రాజ్ విశ్వకర్మ అనే యువకుడు చెప్పాడు. కార్బైడ్ గన్ తయారీ, విక్రయాలకు సంబంధించి విదిశ జిల్లాలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కార్బైడ్ గన్‌ను బొమ్మ తుపాకీగా పరిగణించొద్దని, అది అత్యంత ప్రమాదకరమైన పేలుడు పదార్థం అని.. కంటి రెటీనాను పూర్తిగా దెబ్బతీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నాగ్ క్షిపణులు.. టార్పెడోలు..

రూ.79 వేల కోట్లతో ఆయుధాల కొనుగోలుకు ఆమోదం



న్యూఢిల్లీ, అక్టోబరు 23: ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత రక్షణ రంగాన్ని బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. ఈ ఏడాది ఆగస్టులో రూ.67,000 కోట్ల విలువైన రక్షణ పరికరాల సేకరణ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్రం.. తాజాగా మరో రూ.79,000కోట్ల విలువైన ఆయుధాలు, సైనిక పరికరాలు, మిలిటరీ హార్డ్‌వేర్ కొనుగోలు ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన గురువారం జరిగిన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) సమావేశంలో.. ట్యాంక్ విధ్వంసక గైడెడ్ నాగ్-2 క్షిపణులు, ఉభయచర యుద్ధ నౌకలకు అవసరమైన ల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్స్, అడ్వాన్స్‌డ్ లైట్ వెయిట్ టార్పెడోలు, ఎలక్ట్రానిక్స్ ఇంటెలిజెన్స్, నిఘా వ్యవస్థలు సహా రూ.79,000 కోట్ల విలువైన ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇంత భారీ మొత్తంలో రక్షణ పరికరాల సేకరణకు ఆమోదం తెలపడం ఇది రెండోసారి. భారత నావికా దళం కోసం.. ల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్స్ (ఎల్‌పీడీ), 30 ఎంఎం నావల్ సర్ఫేస్ గన్స్ (ఎన్ఎస్‌జీ), అడ్వాన్స్‌డ్ లైట్ వెయిట్ టార్పెడోలు (ఏఎల్‌డబ్ల్యూటీ), ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రా-రెడ్ సెర్చ్ అండ్ ట్రాక్ సిస్టమ్, 76 ఎంఎం సూపర్ ర్యాపిడ్ గన్ మౌంట్ కోసం స్మార్ట్ మందుగుండు సామగ్రి కొనుగోలు చేయనున్నారు. ఎల్‌పీడీల సేకరణ వల్ల భారత నావికాదళం.. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌తో కలిసి ఉభయచర కార్యకలాపాలు చేపట్టేందుకు ఉపయోగపడతాయని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. డీఆర్‌డీవో దేశీయంగా అభివృద్ధిచేసిన ఏఎల్‌డబ్ల్యూటీలకు సంప్రదాయ, అణు జలాంతర్గాములను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం ఉంది. 30 ఎంఎం ఎన్ఎస్‌జీలతో నేవీ, భారత తీరప్రాంత రక్షణ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇక భారత సైన్యం కోసం.. 2,408 యాంటీ ట్యాంక్ గైడెడ్ నాగ్ మార్క్-2 మిస్సైల్స్ (నామిస్), గ్రౌండ్ బేస్డ్ మొబైల్ ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ సిస్టమ్, హై మొబిలిటీ వెహికిల్స్ (హెచ్ఎంవీ) కొనుగోలు చేసేందుకు ఆమోదం లభించినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. నాగ్ మార్క్-2 క్షిపణులను సమకూర్చుకుంటే శత్రువుల పోరాట వాహనాలు, బంకర్లు, స్థావరాలను లక్ష్యంగా దాడులు చేయడానికి ఉపయోగపడతాయని, గ్రౌండ్ బేస్డ్ మొబైల్ ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ శత్రువు కార్యకలాపాలకు సంబంధించిన సమచారాన్ని 24 గంటలూ అందిస్తుందని రక్షణ శాఖ పేర్కొంది. అలాగే భారత వైమానిక దళం కోసం కొలాబరేటివ్ లాంగ్ రేంజ్ టార్గెట్ సాచ్యురేషన్/డిస్ట్రక్షన్ సిస్టమ్ (సీఎల్ఆర్‌టీఎస్/డీఎస్)ను కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

380 పదాతిదళ బెటాలియన్లకు 'అష్నీ' డ్రోన్లు

భారత సైన్యంలోని 380 పదాతిదళ బెటాలియన్లను 'అష్నీ' డ్రోన్ ప్లాటూన్లతో అనుసంధానం చేసినట్టు పదాతిదళ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అజయ్ కుమార్ తెలిపారు. ఉత్తర, పశ్చిమ సరిహద్దుల్లో సైన్యం పోరాట సామర్థ్యాన్ని పెంచేందుకు ఆధునీకరణలో భాగంగా ఎలైట్ కమాండో యూనిట్లను పెంచుతున్నామని చెప్పారు. పదాతిదళ ఆధునీకరణలో భాగంగా సైన్యం రూ.2,770 కోట్లతో 4.25 లక్షల తుపాకీలు కూడా కొనుగోలు చేయనుందని చెప్పారు. 380 పదాతిదళ బెటాలియన్లలో ప్రతి బెటాలియన్‌కూ ఒక అష్నీ డ్రోన్ ప్లాటూన్‌ను అందిస్తున్నామని, వాటిలో కనీసం నాలుగు నిఘా డ్రోన్లు కూడా ఉంటాయన్నారు.

‘కొండ’పై నిండు కుండలు..

- ఐదు జలాశయాలకు జలకళ
- తిరుమలలో 204 రోజులకు సరిపడా నీరు

తిరుమల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వారంరోజులుగా కురిసిన వర్షాలకు తిరుమలలోని ఐదు జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. వీటిలో 11,805.62 లక్షల గ్యాలన్ల నీరు నిల్వ ఉంది. గడిచిన వారం రోజుల్లోనే 4,417.91 లక్షల గ్యాలన్ల నీరు డ్యాముల్లోకి చేరింది. తిరుమల అవసరాలకు రోజుకు 50 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ఇందులో సగ భాగాన్ని తిరుమలలోని ఐదు డ్యాముల నుంచి.. మిగతా సగం తిరుపతిలోని కల్యాణి డ్యాం ద్వారా వినియోగించుకుంటారు. అల్పపీడనం ప్రభావంతో గత వారం రోజులుగా తిరుమలలో వర్షం కురుస్తునే ఉంది. దీంతో పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార డ్యాముల్లో వారం కిందట 51.64 శాతంగా ఉన్న నీటి నిల్వలు ప్రస్తుతం 82.54 శాతానికి చేరాయి. ఇక, తిరుపతిలోని కల్యాణి డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 56,775 లక్షల గ్యాలన్లు కాగా.. ప్రస్తుతం 5,925.15 లక్షల గ్యాలన్ల నీటి నిల్వలున్నాయి. తిరుమలలోని ఐదు జలాశయాలు, తిరుపతిలోని కల్యాణి డ్యామ్‌లో ఇప్పుడున్న నీటి నిల్వల్లో డెడ్ స్టోరేజీని మినహాయించి 204 రోజులకు (2026 మే 15వ తేదీ వరకు) తిరుమల అవసరాలకు సరిపడా జల వనరులు అందుబాటులో ఉన్నాయని టీటీడీ అంచనా వేస్తోంది.


పాపవినాశనం డ్యామ్‌కు చేరిన వరద నీరు

డ్యాం పేరు	నిల్వ సామర్థ్యం (లక్షల గ్యాలన్లలో)	ప్రస్తుత నిల్వ (గురువారం ఉదయం 8 గంటల వరకు)
పాపవినాశనం	5240	4556.97
గోగర్భం	2833	2706.09
ఆకాశగంగ	685	485
కుమారధార	4258.98	3607.46
పసుపుధార	1287.51	450.10
మొత్తం	14,304.49	11,805.62

తిరుపతి జిల్లా నెల్లటూరులోని విద్యుత్ పరికరాల స్టోర్స్ లో జరిగిన అవకతవకలపై డీఈఈ, ఏఈని సస్పెండ్ చేస్తూ ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు ఎస్ఈ కార్యాలయంలో టెక్నికల్ ఈఈ బాలచంద్రకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.


విశాఖలో మత్స్యకార కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి

మత్స్యకారులను రప్పించేందుకు ప్రయత్నాలు

- విదేశాంగ శాఖతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంతో సంప్రదింపులు

అమరావతి/శ్రీకాకుళం/విజయనగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళ్లి బంగ్లాదేశ్ కోస్టుగార్డుకు చిక్కిన విజయనగరం జిల్లాకు చెందిన ఎనిమిది మంది మత్స్యకారులను స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కేంద్రంతో నిరంతరం మాట్లాడుతోంది. విదేశీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి డి.శ్యామ్‌ను సంప్రదిస్తూ మత్స్యకారుల సమాచారం తెలుసుకుంటోంది. మత్స్యకారులపై బంగ్లాదేశ్‌లో చార్జిషీటు దాఖలు కాగా ఢాకాలోని భారత హైకమిషనర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయ బృందం వారికి చట్టపరమైన సహాయాన్ని అందిస్తూ విడుదలకు ప్రయత్నిస్తోంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మత్స్యకారులను స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్‌తో గురువారం మాట్లాడారు. మత్స్యకారులను క్షేమంగా తీసుకువచ్చేలా ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా జైశంకర్ ఆయనకు తెలియజేశారు. అలానే బంగ్లాదేశ్‌లో ఉన్న ఇండియా మిషన్, కోస్ట్‌గార్డ్‌లతో నిరంతరం ఈ విషయమై సంప్రదింపులు జరుపుతున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. బంగ్లాదేశ్‌లోని మోంగ్లా పోలీసు స్టేషన్‌లో మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని, వారిని తిరిగి రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని గురువారం ఒక ప్రకటనలో వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఏపీఎన్ఆర్టీ సొసైటీ ద్వారా బంగ్లాదేశ్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదిస్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు.. విజయనగరం జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్డీవో డి.కీర్తి గురువారం విశాఖ వెళ్లి మత్స్యకారుల కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఆయా కుటుంబాలను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు కూడా పరామర్శించారు.

దొంగ నోట్ల ముఠా గుట్టు రట్టు

- మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అరెస్టు, మరో ముగ్గురి కోసం గాలింపు



మీడియా సమావేశంలో నకిలీ నోట్లను చూపిస్తున్న డీసీపీ మేరీ ప్రశాంతి, ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి

విశాఖపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దొంగ నోట్ల ముఠా గుట్టును విశాఖపట్నం పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో మధ్యప్రదేశ్‌కు చెందిన కీలక నిందితుడిని అరెస్టు చేశారు. ఈ వివరాలను గురువారం పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీ మేరీ ప్రశాంతి విలేకరులకు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని బర్వానీ జిల్లా సెంధ్వా తాలుకా కెర్మలా గ్రామానికి చెందిన శ్రీరామ్ అలియాస్ గుప్తాను దొంగనోట్ల తయారీ కేసులో ఉజ్జయిని ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తి ద్వారా విశాఖ నగరంలోని ఎంవీపీ కాలనీ సెక్టార్ 11లో నివాసం ఉంటున్న పాల వరప్రసాద్‌తో అతనికి పరిచయం ఏర్పడింది. విశాఖలోని తన ఇంట్లో దొంగ నోట్లు తయారుచేసుకోవచ్చని వరప్రసాద్ చెప్పడంతో.. శ్రీరామ్ దొంగనోట్ల తయారీకి అవసరమైన ప్రింటర్, పేపర్లు, కటింగ్ యంత్రాలు, గమ్, రంగులు ముంబై తెప్పించాడు. మొదటి దశలో రూ.10 లక్షలు విలువైన రూ.500, రూ.200 నకిలీ నోట్లు తయారుచేసి, నగరానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి ద్వారా చలామణి చేసేందుకు విఫలయత్నం చేశారు. మళ్లీ రూ.500, రూ.200 నకిలీ నోట్ల తయారీని ఇటీవల ప్రారంభించారు. దీనిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో ఎంవీపీ పోలీసులతో కలిసి బుధవారం రాత్రి వరప్రసాద్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో దొంగ నోట్లు తయారుచేస్తూ శ్రీరామ్ పట్టుబడ్డాడు. ల్యాప్‌టాప్, ప్రింటర్‌తోపాటు ఒకే పేపర్‌పై నాలుగు చొప్పున రూ.500, రూ.200 నకిలీనోట్లు ప్రింట్ చేసిన కాగితాలతోపాటు ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీరామ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. మిగిలినవారి కోసం గాలిస్తున్నారు.

ఎన్జీ రంగా వర్సిటీలో గోల్‌మాల్!

- రూ.వందల కోట్ల నిధుల వినియోగంపై రికార్డులు తారుమారు
- పాలక మండలి అనుమతి లేకుండానే ఫైనాన్స్ కమిటీ ఏర్పాటు
- మొత్తం 92 పోస్టులు ఉంటే ఏకంగా 105 మందికి పదోన్నతులు
- ఇన్‌చార్జి వీసీపై విజిలెన్స్‌కు వర్సిటీ ప్రొఫెసర్ ఫిర్యాదు

(గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిధుల గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వర్సిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన రూ.వందల కోట్ల నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను ట్యాంపరింగ్ చేస్తున్నారని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అక్కడే పని చేస్తున్న ఒక ప్రొఫెసర్ ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మి తనకు అనుకూలమైన అధికారులను కీలకమైన స్థానాల్లో నియమించుకొని గతంలో జరిగిన అక్రమాలు బయటకు రాకుండా రికార్డులు తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. వీసీ అవినీతి, అక్రమాలపై ఈ ఏడాది సెప్టెంబరులో గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. చేసిన తప్పులు కప్పి పుచ్చుకునేందుకు అప్పటి వరకు వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్న జి.రామచంద్రరావును విచారణ ప్రారంభం కావటానికి ముందే సెప్టెంబరు 11న తొలగించారని వెల్లడించారు. రిజిస్ట్రార్‌ను తొలగించే విషయాన్ని పాలక మండలి సమావేశంలో చర్చించాల్సి ఉండగా ఇన్‌చార్జి వీసీ సొంత నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ఆయన స్థానంలో మరో వ్యక్తిని నియమించారని, గతంలో కోరం లేకుండానే పాలక మండలి ద్వారా తీసుకున్న అనేక నిర్ణయాలను సరిచేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా నోట్ ఫైల్స్ తారుమారు చేస్తున్నారని, కొన్ని పత్రాలపై పాత తేదీలతో నోట్స్ రాస్తున్నారని ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.

ప్రొఫెసర్ ఫిర్యాదులో ఆరోపణలు ఇవీ..

- ఫైనాన్స్ కమిటీ లేకుండానే రూ.వందల కోట్ల నిధులు వినియోగించారని ఆరోపణలు రావడంతో కమిటీని హడావిడిగా ఏర్పాటు చేశారు.
- ఎన్జీ రంగా యూనివర్సిటీ చట్టం ప్రకారం ఫైనాన్స్ కమిటీని పాలక మండలి అనుమతితో నియమించాల్సి ఉండగా, వీసీ సొంతంగా నియమించారు. దానికి చట్టబద్ధత లేదు.
- ఇన్‌చార్జి వీసీపై ప్రభుత్వం విచారణ కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్‌గా ఉన్న డాక్టర్ జి.కరుణాసాగర్‌తో పాటు మరికొందరు ఉన్నతాధికారులను రాత్రికి రాత్రి స్థానచలనం కలిగించారు.
- వర్సిటీలో 92 పోస్టులు ఉంటే 105 మందికి సెప్టెంబరు 11న పదోన్నతి కల్పించారు. దీని వెనుక భారీ స్థాయిలో ముడుపులు చేతులు మారాయి.

వీసీని తొలగించి విచారణ చేపట్టాలి...

ఇన్‌చార్జి వీసీపై విచారణ సక్రమంగా జరగాలంటే వెంటనే ఆమెను ఆ పదవి నుంచి తొలగించాలంటూ గవర్నర్‌కు సదరు ప్రొఫెసర్ వినతిపత్రం సమర్పించారు. రంగా వర్సిటీ చట్టంలోని సెక్షన్ 11,(7) ప్రకారం... ఉద్దేశపూర్వకంగా అధికారాలను వీసీ దుర్వినియోగ పరిస్తే చాన్సలర్ వెంటనే పదవి నుంచి తొలగించాలని స్పష్టంగా ఉందని అందులో పేర్కొన్నారు. ఇన్‌చార్జి వీసీ కోరం లేకుండా పాలక మండలి సమావేశం ఏర్పాటు చేయటం, కీలకమైన నిర్ణయాలు తీసుకోవటం, ఫైనాన్స్ కమిటీ లేకుండా రూ.వందల కోట్లు ఖర్చు చేయటం, రికార్డులు ట్యాంపరింగ్ చేయటం వంటివి అధికార దుర్వినియోగం కిందకు వస్తాయని తెలిపారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

తెలుగు విశ్వవిద్యాలయం తొలి వీసీగా మునిరత్నం నాయుడు బాధ్యతల స్వీకరణ


మునిరత్నం నాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తొలి వైస్‌చాన్సలర్‌గా ఆచార్య డి.మునిరత్నం నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం (బొమ్మూరు పీఠం)లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రార్, ఇతర ప్రధాన విభాగాల అధికారులు, ఇతర సిబ్బంది నియామకాలు పూర్తి చేసి, జనవరి నాటికి పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు. ఈ విశ్వవిద్యాలయం పరిధిలో 22 ముఖ్య విభాగాలు ఉన్నాయని, అందులో భాషాపీఠం, చరిత్ర-సంస్కృతి పీఠం ముఖ్యమైనవని తెలిపారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. రాజమహేంద్రవరం కేంద్రంలో తెలుగు ఎం.ఏ, శ్రీశైలంలో సంస్కృతి-చరిత్ర విభాగాల్లో ఎంఫిల్, పీహెచ్‌డీ, కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రంలో నృత్యానికి సంబంధించిన సర్టిఫికెట్, డిప్లమో కోర్సులు ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తోందన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి కోసం తన పరిధిలో రూ.30 లక్షలు నిధులు సమీకరించినట్టు చెప్పారు. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ త్వరలో విశ్వవిద్యాలయాన్ని సందర్శించి అవసరమైన గ్రాంట్ విడుదల చేయనున్నట్టు ఆయన వివరించారు.

మర్రివలస వంతెనకు వచ్చే ఏడాది శంకుస్థాపన

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మర్రివలస వంతెనకు వచ్చే ఏడాది శంకుస్థాపన చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. చంపావతి నదిపై వంతెన లేక ఇబ్బంది పడుతున్న విజయనగరం జిల్లా గజపతినగరం మండలంలోని మర్రివలస గ్రామస్థుల సమస్యలపై ‘ఎన్నాళ్లీ కష్టాలు’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’ ప్రధాన సంచికలో గురువారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మంత్రి కొండపల్లి ఈ నెల ఒకటిన జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా మర్రివలస సమస్యను తీసుకెళ్లామని ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం స్పందించి మర్రివలస గ్రామానికి మినీ వంతెనకు నిధుల కేటాయింపునకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో టెండర్లు పిలిచి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు.

తల్లిదండ్రులను మత్తులో ఉంచి.. బాలికపై ఏడాదిగా అత్యాచారం

- శ్రీకాకుళం జిల్లాలో వెలుగుచూసిన దాష్టీకం
- ఆటోడ్రైవర్‌తో పాటు, బాధితురాలి తల్లిపైనా పోక్సో కేసు

రణస్థలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తండ్రి అనారోగ్యాన్ని, తల్లి బలహీనతను ఆసరాగా చేసుకున్న ఓ వ్యక్తి వారి 14 ఏళ్ల కుమార్తెపై ఏడాదిగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో వెలుగుచూసిన ఈ దాష్టీకానికి సంబంధించి పోలీసుల కథనం మేరకు.. మండలంలో ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ.. స్థానిక పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆయన నిద్రపోవాలంటే అందుకు సంబంధించిన మాత్ర వేసుకోవాల్సిందే. ఆయన కుమార్తె పక్క గ్రామంలోని ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఇతర విద్యార్థులతో కలిసి ఆటోలో పాఠశాలకు వెళ్లి వస్తోంది. ఈ క్రమంలో ఆటోడ్రైవర్ పిన్నింటి రామారావు కన్ను ఆ బాలికపై పడింది. తండ్రి అనారోగ్య ఇబ్బందిని గ్రహించి, ఆపై బాలిక తల్లికి మద్యం అలవాటు చేశాడు. తల్లిండ్రులిద్దరూ మత్తులో ఉన్న సమయంలో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గత ఏడాదిగా ఈ దుశ్చర్య కొనసాగిస్తున్నాడు. ఓ రోజు అనుమానం వచ్చి తండ్రి మాత్ర వేసుకోలేదు. కుమార్తెపై ఆటోడ్రైవర్ లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నాడు. దీంతో బాలిక ఏడాదిగా జరుగుతున్న అఘాయిత్యాన్ని తండ్రికి చెప్పగా, జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మద్యానికి బానిసగా మారిన బాలిక తల్లి కూడా ఈ విషయంలో ఆటోడ్రైవర్‌ను ప్రోత్సహించినట్టు పోలీసులు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలిక తల్లిపై, ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

శాంతి నారాయణకు జీవన సాఫల్య పురస్కారం



అనంతపురం టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాకు చెందిన రచయిత, విమలా శాంతి సాహిత్య సామాజిక సేవాసంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ శాంతి నారాయణ..అమృత లత జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. నిజామాబాద్‌కు చెందిన ఇందూరు అపురూప అవార్డ్స్ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత ఈ విషయాన్ని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024, 2025 సంవత్సరాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుంచి ఆరుగురు సీనియర్ రచయితలను ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు. 2024 సంవత్సరానికి డాక్టర్ శాంతి నారాయణ ఎంపికయ్యారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మోదీ అతి జాగ్రత్త!

భారత ప్రధాని నరేంద్రమోదీ ఆసియాన్ సదస్సుకు వెళ్ళడం లేదు. కౌలాలంపూర్‌లో ఈనెల 26–27తేదీల్లో జరగబోతున్న ఈ సదస్సుకు ఆయన వర్చువల్‌గా హాజరవుతారని మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రాహీం గురువారం ప్రకటించడంతో పాటు, దీపావళి వేడుకల కారణంగానే మోదీ రాలేకపోతున్నారని కూడా తెలియచేశారు. మలేషియా అధ్యక్షతన జరిగే ఈ సదస్సు విజయవంతం కావాలని ఆశిస్తూ మోదీ కూడా తన ట్వీట్‌లో ఈ వర్చువల్ హాజరు అంశాన్ని ఖరారుచేశారు. వ్యక్తిగత గైర్హాజరుకు కారణం దీపావళి వేడుకలంటూ పైకి చెబుతున్నప్పటికీ, దగ్గరపడిన బిహార్ ఎన్నికలు కారణం కావచ్చునని విశ్లేషకుల వాదన. కానీ, కాంగ్రెస్‌కు మాత్రం ఇందులో మరోకోణం కనిపించింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ సదస్సుకు వస్తున్నందున మోదీ ఇలా మొఖం చాటేస్తున్నారని కాంగ్రెస్ ప్రతినిధి జైరామ్ రమేష్ అంటున్నారు. 'సోషల్ మీడియాలో ట్రంప్‌ను ఆకాశానికి ఎత్తేయడం వేరు, పక్కనే నిలబడి భుజంభుజం రాసుకోవడం వేరు. ఆపరేషన్ సిందూర్‌ను తానే ఆపానని యాభైమూడుసార్లు, భారత్ ఇకపై రష్యా చమురు కొనబోదని ఇప్పటికే ఐదుసార్లు చెప్పుకున్న మనిషికి ఎదురుపడటం రిస్కే.' అని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. మొన్నటికి మొన్న గాజా శాంతి సదస్సుకు మోదీ గైర్హాజరు కావడానికి కూడా ఇదే కారణమని గుర్తుచేస్తూ, ఇలా అంతర్జాతీయవేదికలకు మొఖం చాటేస్తూంటే ప్రపంచనాయకులతో ముచ్చట్లు, వారితో ఫోటోలు దిగుతూ తనను తాను విశ్వగురుగా అభివర్ణించుకొనే అవకాశం తప్పిపోతుంది కదా? అని జైరాం రమేష్ ఎద్దేవా చేస్తూ, 'బచ్‌కే రే రహ్నారే బాబా, బచ్‌కే రహ్నారే' అన్న పాత హిందీ చిత్రగీతాన్ని గుర్తుచేశారు.

బిహార్ ఎన్నికలు భారతీయ జనతాపార్టీకి ముఖ్యమే కానీ, ఒక అంతర్జాతీయ సదస్సుకోసం మోదీ ఓ రెండురోజులు తన షెడ్యూల్ సర్దుకోలేరా? ఆసియాన్‌తో మనబంధం ఇటీవల బాగా బలపడింది కూడా. అనేకదేశాధినేతలతో చర్చలు జరపగలిగే అవకాశం ఉండికూడా కౌలాలంపూర్ పోవద్దన్న నిర్ణయం వెనుక ట్రంప్‌కు ఎదురుపడటం ఎందుకన్న ఆలోచన ఉండే ఉంటుంది. మోదీ తనకు ఆప్తమిత్రుడని అంటూనే ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ట్రంప్‌కు ఎదురుపడటం ప్రమాదమే. అంతా సవ్యంగా ఉన్నప్పుడే ట్రంప్‌తో భేటీ అంటే ఒక అనిశ్చితి. ఓ ప్రమాదహెచ్చరిక. ఎర్రతివాచీలే ఉంటాయన్న నమ్మకమేమీ లేదు. ఉక్రెయిన్ అధ్యక్షుడి గతానుభవం తెలియనిదేమీ కాదు.


గురువారం మళ్ళీ రెండు రష్యన్ చమురుకంపెనీలపై ట్రంప్ సరికొత్త ఆంక్షలు విధిస్తే, ఇటువంటివి చాలా చూశామని రష్యా తేలికగా తీసిపారేసింది. ముడిచమురు కొనడం ఆపేస్తానని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ చెబుతున్నప్పుడల్లా మన ప్రభుత్వం ఔననీ, కాదనీ అనకుండా, అతి జాగ్రత్తగా మాట్లాడుతూ వస్తోంది. ట్రంప్ మాటలు నమ్మక్కర్లేదని అనుకున్నప్పటికీ, అమెరికా ఒత్తిళ్ళతో గతంలో చాలా రాజీలు పడిన, ఆయా దేశాలనుంచి చమురుకొనడం మానేసిన అనుభవం మనకు ఉన్నది కనుక, ట్రంప్ ఒత్తిడిమేరకు రష్యా నుంచి చమురు దిగుమతులు వేగంగా తగ్గించుకొనే ఆలోచనలో భారత్ ఉండవచ్చు. దేశప్రయోజనాలే పరమావధి అని పైకి చెబుతున్నప్పటికీ, ప్రస్తుత భారీ దిగుమతుల్లోనూ సామాన్యుల ప్రయోజనాలు అంతగా లేవు కనుక, ఆ నిర్ణయం ఎప్పుడైనా జరగవచ్చు. అధికారంలోకి రాగానే ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించగలననుకున్న ట్రంప్ అది సాధ్యం కాకపోవడంతో తలకిందులైపోతున్నారు. పుతిన్‌ను దారికి తేవడం సాధ్యం కాక, మళ్ళీ జెలెన్‌స్కీమీద కన్నెర్రచేశారు. తక్షణమే యుద్ధం ఆగాలంటే రష్యా ఆక్రమించుకున్న ప్రాంతాలన్నింటినీ ఉక్రెయిన్ వదులుకోవాలని ఒత్తిడి తెస్తున్నారు. ఉక్రెయిన్‌కు తోమహాక్ క్షిపణులు ఇస్తానని బెదిరించినంతమాత్రాన రష్యా వొణికిపోతుందని అనుకోవడం అవివేకం. రష్యన్ నగరాలన్నింటినీ ధ్వంసం చేయగల ఆ క్షిపణులు నిజంగానే ఉక్రెయిన్ చేతికి వస్తే, అది మరో ప్రపంచయుద్ధానికి దారితీస్తుంది తప్ప యుద్ధం ముగిసిపోదు. ఇంతాచేసి చివరకు జెలెన్‌స్కీకి క్షిపణులు ఇవ్వనుపొమ్మనడం ద్వారా ట్రంప్ మరింత పరువుపోగొట్టుకున్నారు. ట్రంప్ స్టేట్స్‌మాన్ కాదు, షోమాన్ అన్న వ్యాఖ్య పూర్తినిజం. పెద్దరికంతో, గుంభనంగా వ్యవహారాలు నెరపడం ఆయనకు తెలియదు. భారత్–అమెరికా వాణిజ్యచర్చలు కొలిక్కివచ్చి, ఒప్పందాలమీద సంతకాలు అయ్యేంతవరకూ తప్పించుకు తిరుగువాడు ధన్యుడే.

సంస్కృతి... శాపమా? వరమా?

సంస్కృతీ సంప్రదాయాల ప్రభావం నుంచి పూర్తిగా బయటపడటం మనకు అసాధ్యం. భూమ్మీద ఉన్నంతవరకూ గురుత్వాకర్షణను తప్పించుకోవటం ఎలా సాధ్యపడదో సంస్కృతి విషయంలోనూ మన పరిస్థితి అంతే! మనల్ని బంధించేది గురుత్వాకర్షణ శక్తి అని గుర్తించిన తర్వాతే దాన్ని అధిగమించే నియమాలను కనిపెట్టి అంతరిక్ష విన్యాసాలను చేయగలుగుతున్నాం. ఆకాశ ప్రయాణాలను సాగించగలుగుతున్నాం. అట్లాగే సంస్కృతిలో మంచిచెడులను గుర్తిస్తేనే మంచిని పెంచగలం. చెడుని తుంచగలం. ఒకనాటి పాశ్చాత్య ఆధిపత్యానికి సంస్కృతే కారణమని గట్టిగా వాదించే ఆర్థిక చరిత్రవేత్త జోయెల్ మోకియర్ ఈసారి నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. పాశ్చాత్య సంస్కృతి ఒక్కదానికే ఆ శక్తి ఎట్లా వచ్చింది? మిగతా వాటిల్లో అదెందుకు లేదు? మోకియర్ ప్రతిపాదనల లోతుల్లోకి వెళితేనే నిజం కొంత తెలుస్తుంది.

ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ శక్తిని ప్రతిపాదించటం విజ్ఞానశాస్త్ర గతినే మార్చేసింది. ఇది అందరికీ తెలిసిందే. న్యూటన్ ముందూ తర్వాతా ఎందరో మహామహులు తమ ప్రయోగాలు, పరిశీలనలు ఆధారంగా విశ్వం స్వరూప, స్వభావాలను వర్ణించి మన ఆలోచనల్లో సమూల మార్పులు తెచ్చారు. అనుభవ జ్ఞానం ఆధారంగానే మన అభిప్రాయాలను ఏర్పరుచుకోవాలనీ నిర్దేశించారు. పెద్దలు చెప్పారనో, పవిత్ర గ్రంథాలు పేర్కొన్నాయనో భావిస్తూ పరిశీలనాశక్తిని కొండెక్కిస్తే మన చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచాన్ని మన అవసరాలకు అనుగుణంగా సమర్థంగా ఉపయోగించుకోలేమనీ తేల్చిచెప్పారు. మనుషులు పారిశ్రామిక విప్లవంలోకి అడుగు పెట్టటానికి ప్రయోగ–పరిశీలన ఆధార ఆలోచనలే ప్రధాన కారణమయ్యాయి.

మరి ఈ ఆలోచనలు యూరపులోనే పరిపక్వతను పొంది, అక్కడే పారిశ్రామిక విప్లవానికి ఎందుకు దారితీశాయి? వేల సంవత్సరాల నాగరికతలకు నిలయాలైన ఆసియా, ఆఫ్రికా ఖండాలు ఆ పరిణామానికి తొలుత ఎందుకు దూరంగా ఉండిపోయాయి? కారణం ఎక్కడ ఉంది? ఆ లోపానికి బాధ్యులెవరు? ఆసియా, ఆఫ్రికాలకు కాలం కలిసి రాలేదా? ప్రకృతిలోని అసమానతలే అందుకు దోహదం చేశాయా? సంప్రదాయాలూ, సంస్కృతులూ కొత్త ఆలోచనలకు ప్రతిబంధకాలయ్యాయా? ఇవన్నీ కీలక ప్రశ్నలు. అన్నీ పారిశ్రామిక విప్లవం చుట్టూ తిరిగేవే. పారిశ్రామిక విప్లవం కొన్ని దేశాలకు ఆధిపత్యాన్ని కట్టబెడితే, కొన్ని దేశాలకు పరాధీనతను ప్రసాదించింది. ధనిక–పేద దేశాలను సృష్టించింది. వలసరాజ్యాలు, సామ్రాజ్యాల ఏర్పాటుకు దారితీసింది. ఒక్కమాటలో చెప్పాలంటే పారిశ్రామిక విప్లవానికి సాటిరాగలిగిన విప్లవం మానవజాతి చరిత్రలోనే లేదు. అంతటి ప్రభావం చూపించిన పారిశ్రామిక విప్లవానికి దోహదం చేసిన కారణాలను మోకియర్ విశ్లేషిస్తే, దాని తదనంతరం ఏర్పడిన ఆర్థిక వ్యవస్థలో సృజనాత్మక విధ్వంసం ద్వారా వచ్చే సాంకేతిక మార్పులను ఆయనతో పాటు నోబెల్ బహుమతిని పంచుకున్న ఫిలిప్పే ఆగియన్, పీటర్ హొవిట్‌లు పరిశోధించారు.



మనం సంస్కృతి అనే పదాన్ని తరచూ చాలా పరిమిత అర్థంలో వాడతాం. సామాజికశాస్త్రాల్లో దానికి చాలా విస్తృతార్థం ఉంది. సంప్రదాయాలు, పూజలు, ఆరాధనా పద్ధతులు, కుటుంబ సంబంధాలు, మంచీచెడులు, ధర్మాధర్మాలు, నైతిక ప్రవర్తనలు, బాధ్యతలు లాంటివన్నీ సంస్కృతిలో భాగమే. కానీ వీటన్నిటికంటే మించింది వివేచనాశక్తి. హేతుబద్ధంగా ఆలోచించగలిగే తత్వం. కాలక్రమంలో సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలు ముందుకాళ్లకు బంధనాలుగా మారతాయి. వాటిని తొలగించుకునే శక్తి కూడా సంస్కృతిలో భాగంగానే మనుషులకు లభించాలి. అలా లభించాలంటే వివేచనా శక్తి, హేతుబద్ధ ఆలోచనలకు సంస్కృతిలో ప్రాధాన్యత ఏర్పడాలి. ముఖ్యంగా సమాజంలో పై మెట్టులో ఉన్న వర్గాలు సంస్కృతిలో ఆ మేరకు సంస్కరణలకు మార్గాలు తెరవాలి. అట్లా యూరపులో కొత్త ఆలోచనలకు ద్వారాలు తెరవబట్టే పారిశ్రామిక విప్లవం సాధ్యమైందని జోయెల్‌మోకియర్ ప్రతిపాదించారు.

> “ ప్రయోగాలు, పరిశీలనలు, అనుభవాలు, హేతుబద్ధ వివేచన అనేవి జ్ఞానసముపార్జనకు సోపానాలుగా మారి విశ్వజనీనతను సంతరించుకున్నప్పుడు వాటిని గుడ్డిగా తిరస్కరించటం తిరోగమనమే అవుతుంది. దేశంలో ఇప్పుడు ఆ ఛాయలు కనపడుతున్నాయి. సకలశాస్త్రాలకూ, ప్రజాస్వామ్య పద్ధతులకూ, పర్యావరణ పరిరక్షణ విధానాలకూ భారతదేశాన్నే పురిటిగడ్డగా భావించే సంకుచితత్వం పెరుగుతోంది. దేశంపైనా, వ్యక్తులపైనా, సమూహాలపైనా గుడ్డి ప్రేమ, గుడ్డి ద్వేషం సంకుచితత్వాన్నే నేర్పుతుంది. పాత సాంకేతిక పరిజ్ఞానాలను కొత్తవాటితో తోసిపుచ్చటమే సృజనాత్మక విధ్వంసంగా ఆర్థికశాస్త్రంలో పేర్కొంటారు. కొత్త సృజనతో పాత సృజన కనుమరుగు అవుతుంది. సంస్కృతికైనా ఈ సూత్రం వర్తిస్తుంది.

వలసదేశాలను దోచుకోవటం, ఆఫ్రికా వాసులను బానిసలుగా అమెరికా ఖండానికి తీసుకువెళ్లటం, అక్కడి నుంచి బంగారం, వెండి లోహాలను కొల్లగొట్టటం, బలప్రయోగంతో ఆసియా–ఆఫ్రికా వ్యాపారస్థులను లొంగదీసుకోవటం, అతితక్కువ ధరలకు ముడిసరుకులను తరలించుకుపోవటం, రైతుల చేతుల్లో నుంచి భూములను తొలగించి వారిని కార్మికులుగా మారేలా చేయటం, బ్రిటన్‌కు భూమిపైపొరల్లో బొగ్గు తేలికగా లభించటం లాంటివన్నీ కలగలిసి పారిశ్రామిక విప్లవానికీ, ఆ తర్వాత యూరోపు ఆధిపత్యానికీ దోహదం చేశాయనీ చెప్పే వాదనలను తోసిపుచ్చుతూ జోయెల్‌మోకియర్ చేసిన ప్రతిపాదనలు ఆర్థిక చరిత్రకారుల్లో ఇప్పటికీ చర్చలను రగుల్చుతూనే ఉన్నాయి. ప్రయోగాలకూ, పరిశీలనలకూ ప్రాధాన్యమిచ్చే సంస్కృతి యూరపులో కొలంబస్ సాహసిక నౌకాయానాల కాలం నుంచి మొదలై ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించే నాటికి గట్టిగా స్థిరపడిందనీ, 18వ శతాబ్దంలో అదింకా బలపడి పారిశ్రామిక విప్లవానికి కావాల్సిన మేధో భూమికను తయారుచేసిందన్నదే మోకియర్ ప్రతిపాదనల్లో ప్రధానమైంది. ఆ సంస్కృతి వల్లే అనేక రంగాల్లో విజ్ఞానం పోగుపడి, యంత్రాల తయారీకి దారితీశాయని చెప్పారు. దేశాల తలరాతలను సంస్కృతే మార్చిందనీ, దేశాల మధ్య ఆర్థిక అంతరాల అన్వేషణకు సంస్కృతిలోకే తొంగిచూడాలని చెబుతూ మోకియర్ ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. మోకియర్ దృష్టి నుంచి చూస్తే సొంత సంస్కృతి సర్వశ్రేష్ఠమని గుడ్డిగా భావించే ఏ సమాజమూ ముందుకు వెళ్లలేదు.


■ రాహుల్ కుమార్

మోకియర్ ప్రతిపాదనలతో నూటికినూరుపాళ్లు ఏకీభవించటం కష్టమైనా చాలా దేశాల్లో జాతీయ సంస్కృతి పేరుతో భిన్నాభిప్రాయాలను కాలరాస్తున్న నేపథ్యంలో, సంస్కృతిలోని లోపాలను ఎత్తిచూపే వారిని దేశ వ్యతిరేకులుగా ముద్రవేస్తున్న కాలంలో సంస్కృతిలోని మంచిచెడులను చర్చించుకోటానికి మళ్లీ అవి ఒక సందర్భాన్ని ఇచ్చాయి. పారిశ్రామిక విప్లవానికి దోహదం చేసిన ఆలోచనాపరులందరూ తమతమ ప్రతిపాదనలతో సంప్రదాయ సంస్కృతీ పునాదులను కదిలించారు. అలా కదిలించకపోతే ప్రగతి సాధ్యమయ్యేదే కాదు. మోకియర్ వాదన సారాంశాన్ని 10 అంశాలుగా చూడొచ్చు. 1) జ్ఞానసముపార్జనకు, కొత్త ఆవిష్కరణలకు, ప్రగతి భావనకు సమాజంలో గౌరవం పెరగటం మొదటిదిగా చెప్పుకోవచ్చు. ఒకప్పుడు మతపరమైన విషయాలకే తప్ప ఇతరత్రా వాటికి గౌరవస్థానం ఉండేది కాదు. 2) 1500–1800 మధ్యకాలంలో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఆలోచనాపరులు సరిహద్దులను చెరిపివేసి అన్నిటినీ ఇచ్చిపుచ్చుకున్నారు. దీన్నే సరిహద్దులను దాటిన మేధగా పిలిచేవారు. ప్రకృతిని అర్థం చేసుకోవటం ద్వారా జీవితం మెరుగుపడుతుందనే భావనను బలంగా వ్యాప్తిచేశారు. 3) రాజకీయ, న్యాయ, నైతిక అంశాలపై కొత్త ఆలోచనలు రేకెత్తిస్తూనే ఉపయోగకర జ్ఞానానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అంటే జ్ఞానం మనిషికి ప్రత్యక్షంగా ఉపయోగపడాలి. అతని జీవన పరిస్థితిని మెరుగుపర్చటమే దాని పరమార్థం కావాలి. 4) జ్ఞానం అనేది నిరంతరం విస్తరించేదిగానూ ప్రగతికి దోహదం చేసేదిగానూ పేర్కొంటూ భవిష్యత్తు మరింత అభివృద్ధిదాయకమన్న ఆశను పెంపొందించారు. 5) రాయల్ సొసైటీ లాంటి విజ్ఞానసంఘాలు విరివిగా ఏర్పడ్డాయి. పుస్తకాలు, విజ్ఞానసర్వస్వాలు ప్రచురితమయ్యాయి. కొత్త పరికరాల సృష్టి, ఆవిష్కరణలతో ఉత్పత్తి పెరిగింది. 6) యూరపులోని చిన్నచిన్న రాజ్యాల మధ్య పోటీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను పెంచింది. రాజకీయ, సైనిక అవసరాలు కూడా ఆవిష్కరణల్లో పోటీకి కారణమయ్యాయి. 7) ప్రశ్నించే స్వేచ్ఛకూ, భిన్నాభిప్రాయాలను సహించే ధోరణికీ ప్రోత్సాహం పెరిగింది. ఈ రెండు లేకపోతే శాస్త్రీయపురోగతే ఆగిపోయేది. ప్రశ్నించటం వల్ల తప్పులను వెంటనే సవరించుకునే వీలుకలిగింది. మరోవైపు సంప్రదాయాలనూ, చర్చి ఆధిపత్యాన్నీ ప్రశ్నించటం మొదలైంది. 8) మత చింతనాపరుల కంటే నూతన భావాల, పరికరాల ఆవిష్కర్తల ప్రతిష్ఠ పెరిగింది. 9) జ్ఞానం, సాంకేతికత, ఉత్పత్తి పరస్పరం ప్రభావితమై సంపద పెరగటానికి కారణమైంది. పెరిగిన సంపదతో విద్యారంగంలోకి వచ్చేవారి సంఖ్య ఎక్కువైంది. పెరిగిన విద్యాధికులతో జ్ఞానం మరింత విస్తృతమైంది. జ్ఞానం ఒక స్థాయికి చేరుకుని ఆగిపోకుండా నిరంతరం విస్తృతమయ్యే ప్రవాహంలా మారింది. 10) పారిశ్రామిక విప్లవానికి ఆర్థిక అంశాలు తీవ్రంగా ప్రభావితం చేసినా దానికి దోహదం చేసింది మాత్రం సాంస్కృతిక రంగంలో వచ్చిన విప్లవమే.

మోకియర్ కంటే ముందు కూడా సంస్కృతీ ప్రాధాన్యం గురించి చెప్పిన వారూ ఉన్నారు. ఆధునిక సామాజిక శాస్త్రానికి మూలపురుషుడిగా భావించే మాక్స్‌వెబర్ 1905లోనే ప్రొటెస్టంట్ నైతికత (ప్రొటెస్టంట్ ఎథిక్) పేరుతో దాన్ని వివరించారు. కఠినశ్రమ, క్రమశిక్షణ, పొదుపు, నిజాయితీ, ఆత్మనియంత్రణ, సమయపాలన, క్రమబద్ధజీవితం అనేవి ఆ నైతికతలో భాగమనీ ఇవన్నీ ఆధునిక క్యాపిటలిస్టు ఆర్థికవ్యవస్థకు ప్రాణాధారాలనీ వెబర్ సూత్రీకరించారు. ఇవేమీ ఇస్లాం, హిందూమతాల్లో అంత ప్రముఖంగా లేవనీ కూడా వెబర్ విమర్శించారు.

> పారిశ్రామిక విప్లవానికి సాటిరాగలిగిన విప్లవం మానవజాతి చరిత్రలోనే లేదు. అంతటి ప్రభావం చూపించిన పారిశ్రామిక విప్లవానికి దోహదం చేసిన కారణాలను మోకియర్ విశ్లేషిస్తే, దాని తదనంతరం ఏర్పడిన ఆర్థిక వ్యవస్థలో సృజనాత్మక విధ్వంసం ద్వారా వచ్చే సాంకేతిక మార్పులను ఆయనతో పాటు నోబెల్ బహుమతిని పంచుకున్న ఫిలిప్పే ఆగియన్, పీటర్ హొవిట్‌లు పరిశోధించారు.

పాశ్చాత్య ఆధిపత్యానికి ఇట్లా సొంత సంస్కృతిలో వచ్చిన మార్పులే ప్రధాన కారణమని చెప్పే వివరణతో విభేదించే ప్రభావవంతమైన విశ్లేషణలు ఇప్పటికే ఎన్నో వచ్చాయి. కానీ ఎన్ని ఇతర కారణాలను చెప్పుకొన్నా భావ, వైజ్ఞానిక రంగంలో పాశ్చాత్య దేశాల్లో వచ్చిన మార్పుల ప్రభావాన్ని కాదనలేం. 16, 17, 18, 19 శతాబ్దాల్లో పాశ్చాత్య గడ్డమీద నుంచి వచ్చిన సిద్ధాంతాలూ, విశ్లేషణల్లో కొన్నైనా ఆధిపత్యాల్ని, అసమానతలను, వలస దోపిడీలనూ, సామ్రాజ్యవాదాన్ని ప్రశ్నించేలా చేశాయి. అందుకే ఒక సంస్కృతి నుంచీ జనించిన భావాలు ఇతర సమాజాలకు పూర్తిగా పనికి రావనీ చెప్పలేం. అట్లా భావిస్తే ప్రజాస్వామ్యంతో మొదలుపెట్టి ఎన్నో ఆధునిక ఆలోచనలను వదులుకోవాల్సి వస్తుంది. ప్రయోగాలు, పరిశీలనలు, అనుభవాలు, హేతుబద్ధ వివేచన అనేవి జ్ఞానసముపార్జనకు సోపానాలుగా మారి విశ్వజనీనతను సంతరించుకున్నప్పుడు వాటిని గుడ్డిగా తిరస్కరించటం తిరోగమనమే అవుతుంది. దేశంలో ఇప్పుడు ఆ ఛాయలు కనపడుతున్నాయి. సకలశాస్త్రాలకూ, ప్రజాస్వామ్య పద్ధతులకూ, పర్యావరణ పరిరక్షణ విధానాలకూ భారతదేశాన్నే పురిటిగడ్డగా భావించే సంకుచితత్వం పెరుగుతోంది. దేశంపైనా, వ్యక్తులపైనా, సమూహాలపైనా గుడ్డి ప్రేమ, గుడ్డి ద్వేషం సంకుచితత్వాన్నే నేర్పుతుంది. పాత సాంకేతిక పరిజ్ఞానాలను కొత్తవాటితో తోసిపుచ్చటమే సృజనాత్మక విధ్వంసంగా ఆర్థికశాస్త్రంలో పేర్కొంటారు. కొత్త సృజనతో పాత సృజన కనుమరుగు అవుతుంది. సంస్కృతికైనా ఈ సూత్రం వర్తిస్తుంది. కొత్త సృజనకు దారి ఇవ్వాలంటే సంస్కృతి కూడా సంస్కరణకు గురికాక తప్పదు. సంస్కృతిపై అతి మమకారాన్ని వదులుకోకా తప్పదు.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ఈ ప్రశ్నలకు సమాధానాలు ఏమిటి?

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులలో ఏకైక నిశ్చయత అనిశ్చితి మాత్రమే! వాతావరణ మార్పును ఎదుర్కోవాల్సిన పద్ధతులపై ఎడతెగని మథనం జరుగుతోంది. అంతిమంగా ఏ భావాలు, పద్ధతులు విజయం పొందుతాయన్నది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ స్థాయి విషయమై ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించిన విషయాన్ని పరిశీలనలోకి తీసుకోండి. అది, 2023లో 420.4 పీపీఎమ్ నుంచి 2024లో 423.9 పీపీఎమ్‌కు పెరిగింది. ఈ పెరుగుదల పూర్వపు పెరుగుదలలు అన్నిటికంటే అధికంగా ఉన్నదని ఆ ప్రపంచ సంస్థ పేర్కొంది. దీని వల్ల ఉష్ణోగ్రతలు మరింతగా తీవ్రమవుతాయని, ప్రాకృతిక విపత్తుల సంభవత అధికమవుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ స్పష్టం చేసింది. అయినప్పటికీ వాతావరణ మార్పును నిరోధించేందుకు తక్షణమే తగు చర్యలు చేపట్టడంలో తీవ్ర తాత్సారం జరుగుతోంది. ఈ తిరోగమన పోకడల్లో అనేక దేశాలు పోటీపడుతున్నాయి! కాలుష్యకారక వాయు ఉద్గారాలను తగ్గించే సాంకేతికతలు, పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించుకోవడాన్ని ముమ్మరం చేసేందుకు ప్రపంచ దేశాలు సంశయిస్తున్నాయి. మరి ఈ పరిస్థితుల్లో వాతావరణ మార్పునరికట్టే చర్యల తక్షణ ఆవశ్యకత లేక ఆర్థిక ప్రయోజనాలే పరమ లక్ష్యంగా ఉన్న క్రియాశూన్యతలో ఏది అంతిమంగా ప్రాధాన్యం పొందుతుందనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న.


■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఈ శోచనీయ పరిస్థితుల్లో ఒక శుభ పరిణామమూ చోటుచేసుకున్నది. ఈ ఏడాది ప్రథమార్థంలో పునరుత్పాదక ఇంధన వనరులు మొదటిసారిగా బొగ్గును అధిగమించి ప్రపంచవ్యాప్తంగా విద్యుదుత్పాదనకు అతిపెద్ద వనరుగా మారాయి. 2025 మొదటి ఆరునెలల్లో పునరుత్పాదక ఇంధన వనరులు 5072 టీడబ్ల్యూహెచ్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా, శిలాజ ఇంధనమైన బొగ్గు 4896 టీడబ్ల్యూహెచ్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసిందని నిపుణ ఆలోచనాశీలుర బృందం (థింక్ ట్యాంక్) 'Ember' నివేదిక 'Global Electricity MidYear Insights–2025' వెల్లడించింది. పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుదుత్పాదనలో అగ్రగామిగా ఉన్న చైనాయే బొగ్గు ఆధారిత కొత్త థర్మల్ విద్యుదుత్పాదన కేంద్రాల నిర్మాణంలో చురుగ్గా ఉన్నదని 'Carbon Brief' అనే వెబ్‌సైట్ వెల్లడించింది. భారత విద్యుత్ రంగంలోనూ ఇలానే జరుగుతోందనేది మనం విస్మరించలేని వాస్తవం. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారిత విద్యుదుత్పాదన మరింతగా ఉధృతమవుతుందా లేక విద్యుదుత్పత్తికి ప్రధాన వనరుగా శిలాజ ఇంధనాలే ప్రధానంగా పునర్వినియోగమవుతాయా?



> విద్యుత్ వాహనాల తయారీకి కీలకమైన అరుదైన భూ ఖనిజాల ఎగుమతిపై చైనా ఇటీవల విధించిన ఆంక్షలతో హరిత పరివర్తన (గ్రీన్ ట్రాన్సిషన్)కు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వర్తమాన ప్రపంచ ఆర్థిక, వాణిజ్య పరిస్థితులలో విద్యుత్ వాహనాల తయారీ వేగవంతమవుతుందా లేక మందగిస్తుందా అనేది మన ముందున్న ఒక ముఖ్యమైన ప్రశ్న.

సరే, ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వాహనాల వైపు మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది. రవాణా రంగంలో కర్బన ఉద్గారాల తీవ్రతను తగ్గించడంలో విద్యుత్ వాహనాలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. తత్కారణంగా ఈ అధునాతన వాహనాలకు విశేష ప్రోత్సాహం లభిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా విక్రయమవుతున్న కొత్త కార్లలో 20శాతం విద్యుత్ వాహనాలే అని 'ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ' (ఐఈఏ) వెల్లడించింది. విద్యుత్ వాహనాల ఉత్పత్తి, వినియోగంలో చైనా ప్రపంచ అగ్రగామిగా ఉన్నది. విద్యుత్ వాహనాల సరఫరా గొలుసులో చైనాకు తిరుగులేని ప్రాబల్యం ఉన్నది. లిథియం, కోబాల్ట్ మొదలైన ముడి పదార్థాల తవ్వకం, ప్రాసెస్ చేయడం; బ్యాటరీ సెల్స్‌ను ఉత్పత్తి చేయడం, వాటిని వాహనాలలో అనుసంధానించడం; వాహనాలను అసెంబుల్ చేయడం.. మరింత స్పష్టంగా చెప్పాలంటే విద్యుత్ వాహనాల తయారీ, పంపిణీ ప్రక్రియలన్నిటా చైనాదే సంపూర్ణ ఆధిపత్యం. సరిగ్గా ఈ కారణాల వల్లే ఇతర వాహనాల తయారీలో అగ్రగాములుగా ఉన్న దేశాలు విద్యుత్ వాహనాల ఉత్పత్తిని చేపట్టేందుకు సంశయిస్తున్నాయి. విద్యుత్ వాహనాల రంగంలో అగ్రగామిగా వెలుగొందాలన్న తమ ఆకాంక్షను నెరవేర్చుకునేందుకు తమకు అనుకూల పరిస్థితులు లేవని, చైనాతో పోటీపడలేమన్న వాస్తవాన్ని గుర్తించాయి. ఈ కారణంగానే విద్యుత్ వాహనాలకు ప్రకటించిన సబ్సిడీలను ఉపసంహరించుకుంటున్నాయి. సంప్రదాయక ఐసీ ఇంజన్లతో నడిచే వాహహనాల తయారీకి దశల వారీగా ముగింపు పలకడంపై పునరాలోచన చేస్తున్నాయి. విద్యుత్ వాహనాల తయారీకి కీలకమైన అరుదైన భూ ఖనిజాల ఎగుమతిపై చైనా ఇటీవల విధించిన ఆంక్షలతో హరిత పరివర్తన (గ్రీన్ ట్రాన్సిషన్ – కర్బన ఉద్గారాలు అధికంగా ఉండే ఆర్థిక వ్యవస్థ నుంచి అవి తక్కువగా ఉండే ఆర్థిక వ్యవస్థకు మారడం)కు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వర్తమాన ప్రపంచ ఆర్థిక, వాణిజ్య పరిస్థితులలో విద్యుత్ వాహనాల తయారీ వేగవంతమవుతుందా లేక మందగిస్తుందా అనేది మన ముందున్న ఒక ముఖ్యమైన ప్రశ్న.

నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి, అస్థిరత నెలకొన్నాయని, వాణిజ్య ఘర్షణలు, రాజకీయ అనిశ్చితి అందుకు ప్రధాన కారణాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) సంస్థ ఇటీవల వెలువరించిన 'వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్' నివేదిక పేర్కొంది. 2000 సంవత్సరం తరువాత ప్రప్రథమంగా 2025లో పేద దేశాలు అభివృద్ధి సహాయం కింద విదేశీ ప్రభుత్వాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి పొందుతున్న నిధుల కంటే తీసుకున్న రుణాలపై వడ్డీలు చెల్లించేందుకే అధిక మొత్తాలను వెచ్చిస్తున్నాయనే చేదు సత్యాన్ని కూడా ఐఎమ్ఎఫ్ నివేదిక వెల్లడించింది. మరి ఈ గందరగోళ, అవ్యవస్థిత ప్రపంచంలో మన భవిష్యత్తు ఏమిటి? సానుకూల మార్పుల పవనాలు మరింత వేగంగా, శక్తిమంతంగా వీచేందుకు మనం ఏం చేయాలి? అన్నదే మన చివరి ప్రశ్న. బహుశా, ఇది మాత్రమే మనం వేసుకోవాల్సిన ఏకైక ప్రశ్న.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

జన సమూహాల నిర్వహణలో రైల్వే దక్షత


మన దేశం 1.4 బిలియన్ల జనాభాతో అన్నివిధాలా వృద్ధి చెందుతున్నది. అనేక జాతులు, సంస్కృతులు, భాషలు, పండుగల సమాహారమైన ఈ దేశంలో సహజంగానే ప్రజలంతా ఒకే చోట గుమికూడే సందర్భాలు ఎక్కువ. ఇలాంటి సందర్భాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద గుంపుల నిర్వహణకు మన దేశం వేదికగా మారుతున్నది. దేశంలో జనాభా పెరిగే కొద్దీ, గుంపులు కూడా అంతకంతకూ పెద్దవి అవుతున్నాయి. వాటిని నియంత్రించటం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది.

గుంపుల నిర్వహణ (క్రౌడ్ మేనేజ్‌మెంట్) అంటే మనుషుల్ని బలవంతంగా అదుపు చేయటమో, వారికి కాపలా కాయటమో కాదు; బహిరంగ ప్రదేశాల్లో గుమికూడిన మనుషుల ప్రవర్తన పట్ల శాస్త్రీయమైన అవగాహనతో వ్యవహరించటం. భారత్ వంటి దేశంలో గుంపుల నియంత్రణ ఎంతో ముఖ్యమైన అంశం. దేశ జనాభా పెరిగే కొద్దీ, ప్రజా సమూహాల కదలికని అదుపు చేయటం, ముఖ్యంగా ఇరుకు ప్రదేశాల్లోను, ఆవేశపూరితమైన వాతావరణంలోను మనుషుల్ని నియంత్రించటం చాలా కష్టంగా మారింది. దేశంలో నగరాలు విస్తరించేకొద్దీ, వలసలు పెరిగేకొద్దీ, గుంపుల నియంత్రణలో ఇప్పుడు సైకాలజీ, టెక్నాలజీల వినియోగమూ, ముందస్తు ప్రణాళికల అవసరమూ పెరిగింది.

ఇటీవల తమిళనాడులోని కరూర్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా జరిగిన తొక్కిసలాట– గుంపుల నియంత్రణ ఎంత అవసరమో మరోమారు తెలియజెప్పింది. ఒక నటుడి రాజకీయ ప్రచారం సందర్భంగా ఆ ప్రాంతంలో ముప్పై వేల మందికి పైగా జనాభా గుమికూడారు. భారతదేశంలో 2000–2022 సంవత్సరాల మధ్య జరిగిన ప్రమాద మరణాలూ, ఆత్మహత్యలపై ఎన్‌సీఆర్‌బీ ప్రకటించిన నివేదిక ప్రకారం తొక్కిసలాటల్లో 3,074 మంది ప్రాణాలు పోయాయి. గత మూడు దశాబ్దాలుగా నాలుగువేలకు పైగా తొక్కిసలాట ఘటనలు జరిగాయి. వీటిలో 2001–2014 మధ్య జరిగిన 79 శాతం తొక్కిసలాట ఘటనలు ప్రార్థనా స్థలాల్లోనే జరిగాయి.

అది కుంభమేళా అయినా, రాజకీయ ప్రచార సభ అయినా– గుంపుల్లో మానవ స్వభావాన్ని అంచనా వేసి నియంత్రించగలగటం వల్ల చాలా ప్రమాదాలను నివారించగలం. ఒక సామూహిక కలయిక సక్రమంగా జరగటానికి బారికేడ్లు ఉంటే సరిపోవు. ఒకరి పరిస్థితిని మరొకరు అర్థం చేసుకోవటం, పరస్పర గౌరవాన్ని ఇవ్వటం, పౌర బాధ్యతను పాటించటం ముఖ్యం. ఎంతమంది హాజరవుతారన్న లెక్కలూ, అందుకు తగ్గ ఏర్పాట్లతోపాటు, మానవ స్వభావాన్ని అర్థం చేసుకోవటం కూడా గుంపులను నిర్వహించటంలో కీలకమైన అంశం. లక్షలాది మంది ఒకేచోట చేరినప్పుడు వారంతా సంయమనంతో కదిలారా, గందరగోళంతో చెల్లాచెదురయ్యారా అన్నది ముందస్తు ప్రణాళికని బట్టి ఉంటుంది. గుంపుల నిర్వహణలో చిన్న చిన్న లోపాలే తొక్కిసలాటలకు దారితీస్తాయి.

> ప్రయాగ్‌రాజ్‌లో 2025లో జరిగిన కుంభమేళాను అతిపెద్ద మానవ సమీకరణగా చెప్పవచ్చు. ఇంతటి భారీ ఉత్సవం కోసం భారతీయ రైల్వే నెలల ముందు నుంచీ ప్లానింగ్‌తో సిద్ధంగా ఉంది. ఇక్కడ గుంపుల నిర్వహణ కోసం రైల్వే చేపట్టిన చర్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా అలాంటి సందర్భాలకు ఆదర్శంగా మారాయి.



కుంభమేళా సందర్భంలో భారతీయ రైల్వే దానికి సిద్ధమైన తీరు నుంచి ఎన్నో మంచి పాఠాలను నేర్చుకోవచ్చు. ప్రయాగ్‌రాజ్‌లో 2025లో జరిగిన కుంభమేళాను భూమి మీదే అతిపెద్ద మానవ సమీకరణగా చెప్పవచ్చు. దీన్ని నిర్వహించిన తీరు గుంపుల నిర్వహణకు ఒక ఆదర్శంగా నిలుస్తుంది. పన్నెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ భారీ వేడుకలో భాగంగా త్రివేణీ సంగమ స్థలిలో పుణ్యస్నానం చేసేందుకు కోట్లాదిమంది ఒకచోటకు చేరతారు. ఈ ఏడాది 67 కోట్ల మంది ఈ ఉత్సవంలో పాల్గొన్నారని అంచనా. ఎక్కువ మంది హాజరైన రోజుగా చెప్తున్న జనవరి 29న ఏకంగా ఏడు కోట్ల అరవై లక్షల మంది పాల్గొన్నారు. ఇంతటి భారీ ఉత్సవం కోసం భారతీయ రైల్వే నెలల ముందు నుంచీ ప్లానింగ్‌తో సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగా– టెంపరరీ స్టేషన్లు, శాటిలైట్ స్టేషన్లు తెరిచారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా జన సాంద్రతను అంచనా వేస్తూ, డ్రోన్ సర్వేలెన్స్‌ను నిరంతరం వాడారు. రైల్వేలకు, పోలీసులకు, ఇతర పౌర సంబంధ అధికారులకు మధ్య సమన్వయాన్ని సాధించారు. ప్రజలతో వ్యవహరించే సిబ్బందికి స్పష్టంగా సామరస్యంగా ఎలా నడుచుకోవాలో శిక్షణ ఇప్పించారు. కచ్చితమైన గణాంకాలకు తోడుగా, టెక్నాలజీని, ఏఐను విస్తృతంగా వాడారు. రైల్వే పరిసరాలను ఎప్పటికప్పుడు రీడిజైన్ చేస్తూ మాక్ డ్రిల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ రైల్వే రికార్డు స్థాయిలో 17,152 రైళ్లను నడిపింది.

ప్రయాగ్‌రాజ్‌తో పాటు ఆ దరిదాపుల్లో ఉన్న రైల్వే స్టేషన్లు అన్నింటికీ పెద్ద స్థాయిలో మార్పులు చేపట్టారు. 48 కొత్త ప్లాట్‌ఫామ్‌లూ, 21 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలూ, 21 రోడ్‌ఓవర్ బ్రిడ్జిలూ, రోడ్ అండర్ బ్రిడ్జిలూ నిర్మించారు. ప్రయాగ్‌రాజ్, పపామావ్, రాంబాగ్, ఝూసీ ప్రాంతాల్లో రైల్వే యార్డ్ రీమోడలింగ్ పనులను చేపట్టారు. గుంపుల ఉధృతి తీవ్రస్థాయికి చేరిన సమయాల్లో వాళ్లకి చోటు కల్పించేలా శాశ్వత నిర్మాణాలను చేపట్టారు. ప్రయాణికుల రాకడను నిత్యం కనిపెడుతూ ఉండటానికి వెయ్యికి పైగా సీసీ టీవీ సర్వేలెన్స్ కెమెరాలను వాడారు. అలాగే ప్రకటనలను వేర్వేరు భాషల్లో వినిపించటం వల్ల చాలావరకు గందరగోళాన్ని తగ్గించగలిగారు.

కుంభమేళా సందర్భంగా గుంపులను నియంత్రించేందుకు, నిర్వహించేందుకు భారతీయ రైల్వే తీసుకున్న చర్యలు ఇప్పుడు ఇలాంటి మరికొన్ని సందర్భాల కోసం ఉపయోగపడుతున్నాయి. 2027లో నాసిక్‌లో జరగనున్న సింహస్థ కుంభమేళా, అదే ఏడాది రాజమండ్రిలో జరగనున్న పుష్కరాలు, 2028లో ఉజ్జయినిలో జరగనున్న కుంభమేళాల కోసం ఆయా స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచటం కోసం భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో గుంపుల నిర్వహణ కోసం భారతీయ రైల్వే చేపట్టిన చర్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా అలాంటి సందర్భాలకు ఆదర్శంగా మారాయి.

పరిసర వ్యవస్థల అభివృద్ధితోపాటు, సిమ్యులేషన్, స్పష్టమైన సైన్‌లు, గుంపుల కదలికను అంచనా వేయటం.. ఇవన్నీ సమర్థమైన గుంపుల నిర్వహణకు ఎంతో కీలకం. మన దేశంలో ప్రజా సమూహాలు పరిమాణంలో పెరుగుతూనే ఉంటాయి. ప్రజలు గుంపులుగా ఒకచోట గుమికూడటం ఆగదు. కానీ తెలివిగా వ్యవహరిస్తే– ఆ గుంపులు సామూహిక అయోమయంగా గాక, సామూహిక ఐక్యతకు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ విషయంలో కుంభమేళా నేర్పిన పాఠం: "సమూహాన్ని నడపాలంటే ముందు దాని స్వభావాన్ని అర్థం చేసుకోవాలి".


■ ఇతీ పాండే
ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్
సౌత్ సెంట్రల్ రైల్వే



జగజ్జననికి గాజుల అలంకారం

● భారీగా తరలివచ్చిన భక్తులు

6





పదవుల ఫైట్

ఎంపీ కేశినేని శివనాథ్ వర్సెస్ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

పార్టీ, సంస్థాగత పదవుల విషయంలో రాజుకున్న వివాదం

- తిరువూరులో ఒకేరోజు ఇద్దరూ పోటాపోటీ కార్యక్రమాలు
- డబ్బు తీసుకుని పదవులు ఇచ్చారంటూ కొలికపూడి ఆరోపణలు
- ఇసుక, పేకాట క్లబ్‌లు, గంజాయి వ్యాపారం చేయిస్తున్నారని వ్యాఖ్య
- వైసీపీతో కొలికపూడి అంటకాగుతున్నారన్న ఎంపీ కేశినేని చిన్ని
- వైసీపీ కోవర్టులకు పదవులు ఇవ్వరని ప్రతిగా కౌంటర్
- తనకు డబ్బు ఇచ్చావంటే ఎవరూ నమ్మరని సమాధానం

పార్టీ, సొసైటీ పదవుల నియామకాల వ్యవహారం తిరువూరు నియోజకవర్గంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మధ్య రాజకీయ రగడకు దారితీసింది. కొద్దిరోజులుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు గురువారం వ్యక్తిగత ఆరోపణలు చేసుకునే వరకు వెళ్లడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. ఈ సమయంలోనే తిరువూరు నియోజకవర్గంలో గురువారం ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ వేర్వేరుగా పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు ఒకరిపై ఒకరు ఆరోపణలు సంధించుకోవటంతో విభేదాలు బట్టబయలు అయ్యాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : తిరువూరు నియోజకవర్గంలో కొద్దిరోజుల కిందట సంస్థాగత పార్టీ పదవులకు సంబంధించి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. తన ప్రమేయం లేకుండా పదవుల ఎంపిక జరిగిందని ఎమ్మెల్యే శిబిరం ఆరోపిస్తుండగా, పార్టీకి పనిచేసిన వారికే పదవులు ఇచ్చామని ఎంపీ శిబిరం చెబుతోంది. సంస్థాగత పదవుల వ్యవహారంతో మొదలైన వివాదం ఆ తర్వాత సొసైటీ చైర్మన్ల ఎంపికతో ముదిరి పాకాన పడింది. వారం రోజులుగా ఇరుపక్షాల మధ్య పరోక్షంగా మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.. ఎంపీ కార్యాలయంలోని కిషోర్, సూరపనేని రాజాపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఎంపీ అనుచరులు కూడా ప్రతిగా ఎమ్మెల్యే కొలికపూడి, ఆయన అనుచరుల వ్యాఖ్యలకు కౌంటర్లు ఇస్తూ వస్తున్నారు. తిరువూరులో గురువారం గ్రామస్థాయిలో ప్రజా సమస్యలు, వాటి పరిష్కారం, ప్రజల నుంచి సలహాల స్వీకరణ పేరుతో ఎంపీ కేశినేని శివనాథ్ కార్యక్రమాలు చేపట్టారు. ఇదే క్రమంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన వారి పరామర్శల పేరుతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కూడా పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇద్దరూ వేర్వేరుగా కార్యక్రమాలకు పిలుపునివ్వటంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెండుగా చీలిపోయి ఆ కార్యక్రమాల్లో మిగతా 6లో..



వైసీపీ నేతలతో తిరిగే వారికి పదవులు ఇవ్వాలా?
● ఎంపీ కేశినేని శివనాథ్

6

పదవులు అమ్ముకున్నారు
● కొలికపూడి శ్రీనివాసరావు, తిరువూరు ఎమ్మెల్యే

వైసీపీ నేతలతో టచ్‌లో ఉంటున్నారా?

కొలికపూడి వైసీపీ కోవర్టుగా ఉన్నాడని ఎంపీ కేశినేని శివనాథ్ ఆరోపించటంతో ఆయన కదలికలపై అనుమానాలు నెలకొంటున్నాయి. వైసీపీ సర్పంచ్‌కు సీఎంఆర్‌ఎఫ్ డబ్బు ఇప్పించటంతో పాటు ఆ పార్టీ నాయకుల ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేస్తున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. పేర్ని నాని, దేవినేని అవినాష్, కేశినేని నాని, స్వామిదాసులతో కలిసి తిరుగుతున్నారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. కేశినేని వ్యాఖ్యలపై కొలికపూడి శ్రీనివాసరావు కూడా స్పందించారు. తాను జగన్‌పై పోరాడి రాజకీయాల్లోకి వచ్చానని, అమరావతి ఉద్యమాన్ని నడిపిన విషయాన్ని ప్రస్తావిస్తూ తనను వైసీపీ కోవర్టుగా ఆరోపిస్తున్నవారే ఆ పార్టీ నేతలతో వ్యాపారాలు చేస్తున్నారని ఎంపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

జోరు వాన

జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

● నగరంలో జనజీవనం అస్తవ్యస్తం ● జలమయమైన రహదారులు



బందరురోడ్డులో..



విజయవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తమైంది. రహదారులు జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేవలం నగరంలోనే 109.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి కురిసిన వర్షానికి ఆటోనగర్, కానూరు, మాచవరం, గుణదల, పటమటలంక, బెంజిసర్కిల్, ఏలూరు రోడ్డు, ఎంజీ రోడ్డు, సింగ్‌నగర్, విద్యాధరపురం, పీఎన్‌బీఎస్ జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ డ్రెయినేజీలు నిండిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మోకాలి లోతు వరకు నీరు చేరింది.

వర్షపాతం వివరాలు

జిల్లాలో అత్యధికంగా విజయవాడ తూర్పులో 24.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా వత్సవాయిలో 1.5 మి.మీ వర్షపాతం నమోదైంది. విజయవాడ పశ్చిమ 22.8 మి.మీ, విజయవాడ ఉత్తరం 21.3, విజయవాడ సెంట్రల్ 21.0, ఏ.కొండూరు 20.8, విజయవాడ రూరల్ 17.5, తిరువూరు 11.5, మైలవరం 6.5, కంచికచర్ల 6.3, వీరులపాడు 6.0, నందిగామ 5.3, ఇబ్రహీంపట్నం 5.3, జి.కొండూరు 3.3, జగ్గయ్యపేట 2.5, పెనుగంచిప్రోలు 1.8 మి.మీ వర్షపాతం నమోదైంది. గంపలగూడెం, రెడ్డిగూడెం, విస్సన్నపేట మండలాల్లో వర్ష ప్రభావం కనిపించలేదు.

ఇసుక లారీల పట్టివేత

● జగ్గయ్యపేట వద్ద జాతీయ రహదారిపై పట్టుకున్న పోలీసులు
● పోలీసుల అదుపులో ఓ వ్యక్తి.. మిగతా వారు పరార్

6లో

బ్రహ్మలింగయ్య చెరువులో బోటింగ్ పాయింట్

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

8లో

క్యామెట్ కల్లోలం

● బానిసలవుతున్న యువత



రికార్డు వేలం

కెనాల్ రోడ్డు పార్కింగ్ వేలంలో రికార్డు స్థాయి పాట

- ఇద్దరు కాంట్రాక్టర్లు రూ.5.71 కోట్లకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్
- ఇద్దరి మధ్య తేడా రూ.6 వేలే..
- నగరంలోని అన్ని పార్కింగ్‌లకు కలిపినా రాని ఆదాయం
- కొనసాగిస్తారా? వదిలేస్తారా? కాంట్రాక్టర్లపై అనుమానాలు

కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని కెనాల్ రోడ్డు పార్కింగ్ వేలం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలోనే రికార్డు సృష్టించింది. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్‌లో ఒక కాంట్రాక్టర్ రూ.5కోట్ల71లక్షల26వేలకు, మరొక కాంట్రాక్టర్ రూ.5కోట్ల71లక్షల20వేలకు టెండర్ వేయడం సంచలనంగా మారింది.

ఎందుకిలా..?

కెనాల్ రోడ్డు పార్కింగ్‌కు సంబంధించి టెండర్ షెడ్యూల్‌ను ఈనెల 2న కార్పొరేషన్ ప్రకటించింది. ఈ-ప్రొక్యూర్‌మెట్ టెండర్ షెడ్యూల్‌కు గురువారం ఉదయం 11.30 గంటల వరకు గడువు విధించారు. ఆ పార్కింగ్‌కు సంవత్సరానికి ఆఫ్‌సెట్ వాల్యూను రూ.41,56,130, ఈఎండీ కింద రూ.10,39,100 నిర్ణయించారు. ముగ్గురు టెండర్ వేయగా, వారిలో ఒకరు రిజెక్ట్ అయ్యారు. మరో ఇద్దరు.. నగరంలోని జీఎంఆర్ ట్రేడర్స్, కడపకు చెందిన గ్రామాడియన్ స్టూడియోకు చెందినవారు. జీఎంఆర్ ట్రేడర్స్ మిగతా 6లో..

అవినీతి ఆటంబాంబ్

ఈ దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపితే, వాణిజ్యపన్నుల శాఖలోని మూడో డివిజన్‌ను మాత్రం నోట్ల కట్టలతో ముంచేసింది. పన్నులు చెల్లించకుండా ఇతర రాష్ట్రాల నుంచి దీపావళి సరుకును రప్పించుకున్న హోల్‌సేల్ డీలర్లకు ఆయాచితంగా మేలు చేకూర్చినందుకు ఈ డివిజన్‌కు చెందిన అధికారులకు భారీగా ముడుపులు అందాయి. ఈ విషయం ప్రస్తుతం వాణిజ్యపన్నుల శాఖలో దుమారాన్ని రేపుతోంది.

వాణిజ్యపన్నుల శాఖ మూడో డివిజన్‌లో దీపావళి డీల్

గుడివాడలో ఇద్దరు డీలర్ల నుంచి రూ.25 లక్షల వసూలు

- రూ.30 కోట్ల విలువచేసే సరుకును రూ.కోటిగా చూపించినందుకే..
- చక్రంతిప్పిన నలుగురు.. వారిలో ఇద్దరు అధికారులు, ఇద్దరు ఉద్యోగులు
- డీలర్లు, అధికారులకు మధ్య సంధానకర్తగా వ్యవహరించిన ఎస్టీపీ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : గవర్నరుపేట సర్కిల్‌లోని సబార్డినేట్ కొండపల్లి శ్రీనివాసరావు ట్రాన్స్‌పోర్టు వ్యాపారి నుంచి డబ్బు వసూలు చేసి ఏసీబీకి చిక్కి కొద్దిరోజులు కూడా గడవకుండానే అధికారులు, సిబ్బంది ఎలాంటి జంకుబెంకు లేకుండా వసూళ్లకు ద్వారాలను తెరిచారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని అమలు చేయడం ప్రారంభించాక వాణిజ్య పన్నుల శాఖలో అధికారులు, సిబ్బంది ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. ఈ విషయాన్ని వ్యాపారులు, హోల్‌సేల్ డీలర్లే బహిరంగంగా చెబుతున్నారు. వాణిజ్యపన్నుల శాఖ మూడో డివిజన్‌లో ఇద్దరు అధికారులు, ఇద్దరు సిబ్బంది కలిసి దీపావళి టపాసులు విక్రయించే హోల్‌సేల్ డీలర్ల నుంచి ఏకంగా రూ.25 లక్షలు వసూలు చేశారు. ఈ విషయం ఆ శాఖలో చర్చకు దారితీసింది.

రూ.కోట్ల సరుకును దాచేసి..

వాణిజ్యపన్నుల శాఖ మూడో డివిజన్‌లో మొత్తం ఐదు సర్కిళ్లు ఉన్నాయి. ఈ కార్యాలయం అయోధ్యనగర్‌లోని లోటస్‌లో ఉంది. గుడివాడ, మచిలీపట్నం, పెనమలూరు, రామవరప్పాడు, పటమట సర్కిళ్లు ఈ మూడో డివిజన్‌లో పరిధిలో ఉంటాయి. ఇందులో గుడివాడ సర్కిల్ ఈ డివిజన్‌కు గుండెకాయ వంటిది. హోల్‌సేల్ వ్యాపారులు, డీలర్లు ఎక్కువగా ఉండేది ఈ సర్కిల్‌లోనే. తర్వాత పెనమలూరు సర్కిల్‌లోని గన్నవరంలో ఈ డీలర్లు ఉంటారు. మచిలీపట్నం సర్కిల్‌లో మినీ హోల్‌సేల్ డీలర్లు ఉంటారు. దీపావళికి శివకాశి, తమిళనాడు నుంచి దీపావళి సరుకును ఈ డీలర్లు రప్పిస్తుంటారు. ఇది ఏటా జరిగే ప్రక్రియ. ఈ ఏడాది గుడివాడలో ఇద్దరు ప్రముఖ డీలర్లు రూ.కోట్ల సరుకును దిగుమతి చేసుకున్నారు. దీనికి ఎలాంటి వేబిల్లులు, ప్రభుత్వానికి పన్నులు చెల్లించలేదు. ఈ ఇద్దరు డీలర్లు రూ.కోటి సరుకే తమ వద్ద ఉన్నట్టు చూపించారు. వాస్తవానికి వారి వద్ద రూ.10 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు విలువచేసే సరుకు ఉంది. దీన్ని వారు ఉమ్మడి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలోని వ్యాపారులకు సరఫరా చేశారు. ఎలాంటి బిల్లులు లేకుండా అంత మొత్తంలో సరుకును దిగుమతి చేసుకున్న ఈ డీలర్లతో పాటు మినీ హోల్‌సేల్ డీలర్ల గోదాములు, షాపుల్లో తనిఖీలు చేయకుండా భారీ మొత్తంలో ముడుపులు అందుకున్నారు.



లోటస్‌లోని కార్యాలయం

ఆ నలుగురు కనుసన్నల్లో..

గుడివాడలోని ఇద్దరు ప్రముఖ హోల్‌సేల్ డీలర్లతో పాటు మినీ హోల్‌సేల్ వ్యాపారుల నుంచి రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేశారు. డివిజన్‌లో పనిచేసే ఇద్దరు అధికారులు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్ల మిగతా 6లో..

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఎన్టీఆర్ జిల్లా యువజనోత్సవాలు



8

అడ్మిషన్లు అంతంతే



- కృష్ణా వర్సిటీలో వివిధ కోర్సుల్లో అనుమతి ఇచ్చిన సీట్లు 454
- భర్తీ అయినవి 186, మిగిలిపోయినవి 268
- తరగతులు ప్రారంభమై నెలరోజులు
- హాస్టల్ భవనాలు లేకపోవడంతో విద్యార్థుల విముఖత
- మేనేజ్‌మెంట్ కోటాలో సీట్ల భర్తీ ఎప్పటికో..

6

సరుకు రవాణాకు సులభమైన మార్గం

విజయవాడ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ కస్టమ్స్ అండ్ కార్గో స్క్రీనింగ్ అవసరం

విజయవాడ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ కస్టమ్స్ అండ్ కార్గో స్క్రీనింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. కార్గో రవాణా చేయాలంటే ఈ స్క్రీనింగ్ తప్పనిసరి. ఎయిర్‌పోర్టులో ఇప్పటి వరకు దేశీయంగా మాత్రమే కస్టమ్స్ అండ్ కార్గో స్క్రీనింగ్ సదుపాయం ఉంది. విదేశీ విమానాలకు సంబంధించి లేదు. ఈ కారణం వల్ల విదేశాలకు వెళ్లే విమానాల్లో మన దగ్గర నుంచి సరుకు రవాణా చేయలేని పరిస్థితి ఏర్పడింది.

- సింగపూర్ సర్వీసు ప్రారంభమవుతున్న నేపథ్యంలో డిమాండ్
- ఇప్పటివరకు కృష్ణాజిల్లా పీతలు చెన్నై నుంచి సింగపూర్‌కు ఎగుమతి
- ఇంటర్నేషనల్ కార్గో స్క్రీనింగ్ వస్తే ఇక్కడి నుంచే నేరుగా పంపించొచ్చు
- విదేశాలకు సరుకు రవాణా చేసే అవకాశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రస్తుతం విజయవాడ విమానాశ్రయం నుంచి షార్జాకు విమాన సర్వీసు నడుస్తోంది. కొద్దిరోజుల్లో సింగపూర్‌కు సర్వీసు నడుస్తుంది. దుబాయ్, తదితర దేశాలకు కూడా సర్వీసులు నడిచే అవకాశం ఉంది. విదేశాలకు వెళ్లే విమానాల్లో ప్రయాణికులతో పాటు కార్గో రవాణా కూడా చేయొచ్చు. దాదాపు ఐదారు టన్నుల కార్గోను రవాణా చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్నేషనల్ కార్గో స్క్రీనింగ్ లేకపోవటం వల్ల విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి కేవలం ప్రయాణికులే మిగతా 6లో..


ఆందోళన చేస్తున్న ఆస్పత్రుల యాజమాన్యాలు

బకాయిలు చెల్లించండి

- నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం చలో విజయవాడ
- పూర్తి బకాయిలు చెల్లించే వరకు ఆందోళన
- ఆత్మహత్యలు చేసుకోకముందే బకాయిలు చెల్లించాలి

ధర్నాచౌక్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం రూ. 2600 కోట్ల బకాయిలను ఇచ్చేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని ఆశ (ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్) నేతలు పేర్కొన్నారు. గురువారం చలో విజయవాడలో భాగంగా స్థానిక ధర్నచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ తీరుతో తమ ఆసుపత్రులను మూసివేసే పరిస్థితికి వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు ఆత్మహత్యలకు పాల్పడకముందే ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. పేదలకు వైద్య సేవలందించి వారి ప్రాణాలు కాపాడే తమ కష్టాలను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2007లో ఉన్న ధరలనే ఇప్పటికీ ఇస్తున్నారని వాటిని కూడా పూర్తిగా చెల్లించకుండా వేలకోట్లు పెండింగ్‌లో పెట్టడం జరుగుతుందన్నారు. గట్టిగా నిలదీయకపోవడంతో తమను ప్రభుత్వం చులకనగా చూస్తున్నదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆసుపత్రులను నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రూ.650 కోట్లు వెంటనే విడుదల చేసి రూ. 2వేల కోట్లు విడతల వారీగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, ఏపీ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్‌లు ధర్నాకు మద్దతు పలికాయి. అన్ని సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పాటు చేసి పోరాడుతామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఎన్టీఆర్ వైద్యసేవలు పూర్తిగా నిలిపివేశామన్నారు. యూనివర్సల్ స్కీంలో తాము భాగస్వామ్యం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వంతో చర్చలు విఫలమైతే జేఏసీ తరపున చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. రూ. 250 కోట్లు చెల్లిస్తామన్న ప్రభుత్వ ప్రకటనకు తాము అంగీకరించలేదన్నారు. రూ.650 కోట్లు తమ ఖాతాల్లో పడితేనే ఆందోళన విరమిస్తామని స్పష్టం చేశారు. ఆశ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి.ఎల్.నారాయణ, చంద్రమౌళీశ్వరరావు, కార్యదర్శి అవినాష్, కోశాధికారి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా బొడ్డు మురళీకృష్ణ



వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు, దేవి శ్రేష్ఠ గోల్డ్ డైమండ్స్ వ్యాపార నిర్వాహకులు బొడ్డు మురళీకృష్ణ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు సూచన మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోంట్ల రామ మోహన్ గురువారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు. మురళీకృష్ణ వాసవి క్లబ్ అంతర్జాతీయ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో సభ్యులు, పేదలకు వివిధ రకాలుగా తోడ్పాటు అందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. మురళీకృష్ణ నియామకం పట్ల జిల్లా, మండల ఆర్యవైశ్య, వాసవి ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నియామక పత్రాల అందజేత

విజయవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు శుక్రవారం నాడు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నారు. డీఆర్ఎం కార్యాలయం వద్ద రైల్వే ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా, కేంద్రమంత్రి నేరుగా ఉద్యోగాలు పొందిన 68మందికి నియామక పత్రాలు అందజేస్తారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు పాల్గొనున్నారు.


అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న శాప్ చైర్మన్

క్రీడా కోచ్‌లకు నియామక పత్రాల అందజేత

విజయవాడ స్పోర్ట్స్ : రాష్ట్ర క్రీడా ప్రాధికారసంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 13ఔట్‌సోర్సింగ్ కోచ్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు గురువారం శాప్‌కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవినాయుడు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడానికి శాప్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర విభజన అనంతరం క్రీడాప్రాధికార సంస్థ తొలిసారిగా పారా స్పోర్ట్స్, షూటింగ్ విభాగాలకు కోచ్‌లను నియమించడం క్రీడాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. 13మంది కోచ్‌లు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తమ సేవలను అందించనున్నారని తెలిపారు.

అంగలూరు డైట్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు డైట్‌లో ఖాళీగా ఉన్న రెండు సీనియర్ లెక్చరర్, ఆరు లెక్చరర్ పోస్టులు డిప్యూటేషన్ పద్ధతిపై భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు డీఈవో పీవీజే రామారావు తెలిపారు. అర్హత గల స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 31లోగా 58 ఏళ్లు మించరాదని, సబ్జెక్టుల్లో 55శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలని, సర్వీసు ఐదేళ్లు పూర్తిచేసి ఉండాలని తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు, భాషా పండితులు అర్హులు కాదన్నారు. దరఖాస్తులు గూగుల్ ఫారంలో సమర్పించాలన్నారు. ఎంపికయిన అభ్యర్థులకు నవంబరు 1 నుంచి 8వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. నవంబరు 14, 15 తేదీల్లో ఇంటర్వ్యూలు జరుపుతామన్నారు.

స్థాయీ సంఘంలో 9 అంశాలకు ఆమోదం

చిట్టినగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : నగరపాలకసంస్థ స్థాయీ సంఘం సమావేశంలో 9 అంశాలకు ఆమోద ముద్రవేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన గురువారం నగరపాలక సంస్థ నూతన భవనం సమావేశ హాలులో స్థాయీ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో 21 అంశాలపై చర్చించి 9అంశాలను ఆమోదించారు. ఒక అంశం రికార్డు చేయ్యడంతోపాటు పరిపాలన పరమైన అంశాలకు సంబంధించి ఒక అంశమును ధ్రువికరించుటం జరిగింది. ఆరు అంశాలను వాయిదా వేయటంతోపాటు 4 అంశాలను ర్యాటీఫై చేశారు. సమావేశంలో పలువురు కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గాజుల అలంకారంలో కనకదుర్గమ్మ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గాదేవి గురువారం యమద్వితీయను పురస్కరించుకుని గాజుల అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యులు, ఈవో శీనా నాయక్, దాతల సహకారంతో గాజుల ఉత్సవం ఘనంగా జరిగింది. 4,31,932 గాజులు భక్తుల నుంచి విరాళంగా వచ్చాయి. 300 మందికి పైగా సేవా సిబ్బంది 24 గంటలు పనిచేసి అమ్మవారి మూలవిరాట్టు, అంతరాలయాన్ని గాజులతో అలంకరించారు. గాజుల అలంకరణతో అంతరాలయం కాంతులీనింది. గాజుల అలంకారంలో అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.


గాజుల అలంకారంలో దుర్గమ్మ ప్రధాన ఆలయం


కృష్ణాయూనివర్సిటీ

అడ్మిషన్లు అంతంతే!

- కృష్ణావర్సిటీలో వివిధకోర్సుల్లో అనుమతి ఇచ్చిన సీట్లు 454
- భర్తీ అయినవి 186, మిగిలిపోయినవి 268
- తరగతులు ప్రారంభమై నెలరోజులు
- హాస్టల్ భవనాలు లేకపోవడంతో విద్యార్థుల విముఖత
- మేనేజ్‌మెంట్ కోటాలో సీట్ల భర్తీ ఎప్పటికో..

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం)

కృష్ణాయూనివర్సిటీలో ఈ ఏడాది పీజీ కోర్సుల్లో ఆశించిన మేర విద్యార్థినీ, విద్యార్థులు చేరలేదు. యూనివర్సిటీలో నూతన కోర్సులు ప్రవేశపెడుతున్నామని వర్సిటీ అధికారులు విస్తృత ప్రచారం చేసినా అడ్మిషన్‌ల విషయంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. పీజీ కోర్సులకు సంబంధించి 454 సీట్లకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రెండు విడతలుగా జరిగిన కౌన్సెలింగ్‌లో ఆయా కోర్సుల్లో కేవలం 186మంది విద్యార్థులు మాత్రమే చేరారు. రెండు విడతలుగా కౌన్సెలింగ్ జరిగినా ఫలితంలేదు. మేనేజ్‌మెంట్ కోటాలో వివిధ కోర్సుల్లో ఎప్పుడు విద్యార్థులను చేర్చుకుంటారో యూనివర్సిటీ అధికారులు స్పష్టమైన తేదీలను ఇప్పటివరకు ప్రకటించలేదు. గతనెల 23నుంచి 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీ కోర్సులకు తరగతులు ప్రారంభమయ్యాయి.

కోర్సుల్లో విద్యార్థుల చేరిక ఇలా..

కృష్ణాయూనివర్సిటీలో వివిధ పీజీ కోర్సుల్లో రెండు విడతలుగా జరిగిన కౌన్సెలింగ్‌లో విద్యార్థినీ విద్యార్థుల అడ్మిషన్‌లకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంగ్లీష్ విభాగంలో 33సీట్లు ఉండగా ఒక్కరు మాత్రమే చేరారు. ఫిజిక్స్ విభాగంలో 33 సీట్లకుగాను ఒక్కరుకూడా చేరలేదు. మాథ్స్ విభాగంలో 33సీట్లకుగాను ఒక్కరుకూడా చేరలేదు. ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో 40సీట్లకుగాను 33మంది, అనలాటికల్ కెమిస్ట్రీ విభాగంలో 40సీట్లకుగాను 33మంది చేరారు. జువాలజీ విభాగంలో 33సీట్లకుగాను 9మంది చేరారు. బోటనీ విభాగంలో 33సీట్లకుగాను 10మంది చేరారు. ఎంబీఏ విభాగంలో 66 సీట్లకుగాను 39మంది, ఎంసీఏ విభాగంలో 66సీట్లకుగాను 39మంది చేరారు. ఎంకాం విభాగంలో 33 సీట్లకుగాను ఒక్కరుకూడా చేరలేదు. యూనివర్సిటీలో పది పీజీ కోర్సుల్లో 454 సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా కేవలం 186సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. అన్ని కోర్సుల్లో 268 సీట్లు మిగిలిపోయాయి. వర్సిటీలో చేరేందుకు వచ్చిన కొందరు విద్యార్థినీ, విద్యార్థులు హస్టల్స్ వసతి లేకపోవడంతో ఇక్కడ చేరినా వెనక్కి వెళ్లిపోయారు. ఎంఏ ఇంగ్లీష్ కోర్సులో గత నాలుగేళ్లుగా ఇద్దరు, లేక ముగ్గురే చేరుతున్నారు. వీరికి ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు పాఠాలు బోధిస్తున్నారు. ఏడాదికి ఈ కోర్సు నిర్వహణకు రూ.1.20కోట్ల వరకు ఖర్చు చేయడం గమనించదగ్గ అంశం. ఇంగ్లీష్ పీజీ కోర్సులో ఈ ఏడాది ఒక్కరే చేరినా ఈ కోర్సును కొనసాగిస్తున్నారు. ఎమ్మెస్సీ మాథ్స్, కెమిస్ట్రీ పీజీ కోర్సులను ఈ ఏడాది రద్దు చేసినట్టు సమాచారం. ఇంజనీరింగ్ కళాశాలకు భవనం లేకపోవడంతో ఈ రెండు కోర్సులకు సంబంధించిన నాలుగు గదులను ఇంజనీరింగ్ కళాశాలకు అదనంగా ఈ ఏడాది కేటాయించారు.

ఫుడ్‌కోర్టు అందుబాటులోకి వచ్చేనా..

ఈ ఏడాది జూన్ 25న కృష్ణాయూనివర్సిటీ 7, 8 స్నాతకోత్సవాలను నిర్వహించారు. గవర్నర్ అబ్దుల్‌నజీర్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ రోజు యూనివర్సిటీప్రాంగణంలోని ఫుడ్‌కోర్టును గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభింపచేశారు. ఫుడ్‌కోర్టును ప్రారంభించి నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. ఫుడ్‌కోర్టును అందుబాటులోకి తెచ్చేందుకు టెండర్ల ప్రక్రియను ఎప్పటికి పూర్తిచేస్తారు. ఎప్పటికి అందుబాటులోకి తెస్తారనే అంశంపై యూనివర్సిటీ అధికారులు పెదవి విప్పడం లేదు.



దుర్గగుడిలో సహస్రలింగార్చన

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా దుర్గగుడిలో గురువారం రాత్రి సహస్రలింగార్చన సేవ అత్యంత భక్తి నిష్ఠలతో సాగింది. నమక చమక పారాయణలతో ఆలయ ప్రాంగణం పులకించింది. ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి బృందం సహస్రలింగార్చన చేసి బిల్వ పత్రాలు, వివిధ పుష్పాలను సమర్పించారు. సహస్రలింగార్చన, సహస్రదీపార్చన, ఊంజల్ సేవల్లో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు, ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. ప్రదోష కాలంలో 'మహా నివేదన', పంచ హారతులు, చతుర్వేద స్వస్తి జరిగాయి. భక్తులచే ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు శ్రీమల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం వద్ద దీపోత్సవం (ఆర్జిత సేవ) నిర్వహిస్తున్నారు.

బిఈడీ పరీక్షా ఫలితాలు విడుదల

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బిఈడీ పరీక్షా ఫలితాలను కేయూ ఉపకులపతి కూన రాంజీ గురువారం విడుదల చేశారు. బిఈడీ 2వ సెమిస్టర్‌లో 1351 మంది పరీక్షలు రాయగా, 71 శాతంతో 961 మంది ఉత్తీర్ణులయ్యారు. స్పెషల్ బిఈడీ 2వ సెమిస్టర్‌లో 66 మంది పరీక్ష రాయగా, 85 శాతంతో 56 మంది ఉత్తీర్ణులైనట్టు పరీక్షల నియంత్రణ అధికారి బ్రహ్మచారి తెలిపారు. రీవాల్యుయేషన్ కోరు వారు నవంబరు 4లోగా నిర్ణీత రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పదవుల ఫైట్

(5వ పేజీ తరువాయి)

పాల్గొన్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటల తూటాలు పేలాయి.

పదవుల వివాదమా? వ్యక్తిగతమా?

తిరువూరు మండల పార్టీ అధ్యక్షుడిగా దుబ్బాకు వెంకటేశ్వరరావును నియమించారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ లీడర్ అయిన దుబ్బాకు ఆ తర్వాత వైసీపీలోకి వచ్చి తిరిగి టీడీపీలో చేరారు. వయోభారం కారణంగా తాను పనిచేయలేనని చెప్పినప్పటికీ ఆయనకు ఆ పదవి ఇచ్చారని ఎమ్మెల్యే కార్యాలయం గుర్రుగా ఉంది. ఈ పదవికి మేకల చంద్ర, మల్లెల శ్రీనివాస్ వంటివారు కూడా పోటీ పడ్డారు. గంపలగూడెం మండల పార్టీ అధ్యక్షుడిగా వి.రామకృష్ణను నియమించారు. ఇలా మండల, టౌన్ పార్టీ సంస్థాగత పదవులకు పలువురిని నియమించారు. ఈ పదవుల జాబితాను అప్పట్లో ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. ఆ రోజున అభ్యంతరాలు తెలపని కొలికపూడి రెండు నెలల తర్వాత అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోనూ ఇష్టానుసారంగా పదవులు ఇచ్చారన్న కారణంతో కొలికపూడి మరింత అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఎంపీకి రూ.5 కోట్లు ఇచ్చానని, పదవులకు డబ్బు వసూలు చేశారని కూడా ఆయన ఆరోపణలు చేశారు.

వైసీపీ నేతలతో టచ్‌లో ఉంటున్నారా?

కొలికపూడి వైసీపీ కోవర్టుగా ఉన్నాడని ఎంపీ కేశినేని శివనాథ్ ఆరోపించటంతో ఆయన కదలికలపై అనుమానాలు నెలకొంటున్నాయి. వైసీపీ సర్పంచ్‌కు సీఎంఆర్ఎఫ్ డబ్బు ఇప్పించటంతో పాటు ఆ పార్టీ నాయకుల ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేస్తున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. పేర్ని నాని, దేవినేని అవినాష్, కేశినేని నాని, స్వామిదాసులతో కలిసి తిరుగుతున్నారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. కేశినేని వ్యాఖ్యలపై కొలికపూడి శ్రీనివాసరావు కూడా స్పందించారు. తాను జగన్‌పై పోరాడి రాజకీయాల్లోకి వచ్చానని, అమరావతి ఉద్యమాన్ని నడిపిన విషయాన్ని ప్రస్తావిస్తూ తనను వైసీపీ కోవర్టుగా ఆరోపిస్తున్నవారే ఆ పార్టీ నేతలతో వ్యాపారాలు చేస్తున్నారని ఎంపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

వైసీపీ నేతలతో చెట్టపట్టాల్ వేసుకునే వారికి పదవులు ఇవ్వాలా?

- ఎంపీ కేశినేని శివనాథ్

ఎంపీగా నేను అందజేసిన సీఎంఆర్ఎఫ్ సహాయం ఎవరూ చేయలేదు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలను దృష్టిలో ఉంచుకుని సహాయం చేస్తాను. కొలికపూడి మాత్రం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల కంటే కూడా వైసీపీ వారికి సహాయం చేస్తారు. వైసీపీ సర్పంచ్‌కు రూ.10 లక్షల సహాయం ఇప్పించారు. నేనెక్కడికి వెళ్లినా టీడీపీ, జనసేన నాయకులతో వెళ్తాను తప్ప. వైసీపీ వారితో వెళ్లను. నేను తిరువూరు నియోజకవర్గంలో ఐదు రూపాయలు అయినా తీసుకున్నానని మీరు నమ్ముతారా? నా క్రెడిబిలిటీ అది. నేను నా సొంత డబ్బు ఖర్చు పెడతానే కానీ, ఎవరి వద్దా తీసుకోను. నాకు విజయవాడలో కానీ, రాష్ట్రంలో కానీ వ్యాపారాలు లేవు. హైదరాబాద్‌లో నా కుటుంబం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంది.

పదవులు అమ్ముకున్నారు

- కొలికపూడి శ్రీనివాసరావు, తిరువూరు ఎమ్మెల్యే

నా నియోజకవర్గంలో నేను చెప్పిన వారికి కాకుండా ఎంపీ చెప్పినట్టుగా పదవులు ఇచ్చారు. పేర్లు మారిపోయాయి. పదవులు ఇవ్వటానికి డబ్బు వసూలు చేశారు. సంస్థాగత పదవులతో పాటు పీఏసీల్లోనూ అన్యాయం జరిగింది. నాడు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినప్పుడే నా దగ్గర ఎంపీ రూ.5 కోట్లు డబ్బు వసూలు చేశారు. తిరువూరు నియోజకవర్గంలో నా ద్వారా జరిగే అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. టెండర్లన్నీ రద్దు చేయిస్తున్నారు. ఇసుక, పేకాట క్లబ్‌ల నిర్వహణతో పాటు చివరికి గంజాయి బ్యాచ్‌తో కూడా వ్యాపారం చేయిస్తున్నారు. వైసీపీ నాయకులతో నేను తిరగటం లేదు. వారితో ఎంపీనే వ్యాపారాలు చేస్తున్నారు.

సులభమైన మార్గం

(5వ పేజీ తరువాయి)

తప్ప సరుకును రవాణా చేయలేని పరిస్థితి ఏర్పడింది. వచ్చేనెల 10 నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ సర్వీసు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఇంటర్నేషనల్ కస్టమ్స్ అండ్ కార్గో స్క్రీనింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ డిమాండ్ చేస్తోంది.

కృష్ణాజిల్లా నుంచి పీతల రవాణా.. ఆదాయం తమిళనాడుకు

కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం, నాగాయలంక నుంచి ప్రతి రెండు, మూడు రోజులకు రెండున్నర టన్నుల పీతలను సింగపూర్‌కు రవాణా చేస్తున్నారు. సముద్రం నుంచి కొట్టుకొచ్చే 10 నుంచి 50 గ్రాములు కలిగిన పీతల పిల్లలు, వాటి పిల్లలను చెరువుల్లో పెంచుతున్నారు. ఇలా పెంచే వారంతా అర ఎకరంలోపు చెరువులు కలిగిన రైతులే. ఈ పీతలు నాలుగైదు నెలల్లోనే 500 గ్రాముల నుంచి కేజీ వరకు పెరుగుతాయి. వీటిని కొనడానికి ట్రేడర్లే వీరి దగ్గరకు వస్తారు. ఇలా కొన్న ట్రేడర్లు విదేశీ ఎగుమతి లైసెన్స్ కలిగిన ఎక్స్‌పోర్టర్లకు విక్రయిస్తారు. ఎక్స్‌పోర్టర్లు నేరుగా సింగపూర్‌లోని రెస్టారెంట్లకు, మార్కెట్లకు పంపిస్తారు. మచిలీపట్నం, నాగాయలంకకు చెందిన రైతులు కేజీ పీతలను 50-56 డాలర్లకు ట్రేడర్లకు విక్రయిస్తున్నారు. సింగపూర్‌లో వీటి ధర 200 డాలర్ల వరకు ఉంటోంది. దీనిని బట్టి ట్రేడర్లు, ఎక్స్‌పోర్టర్లకు ఎంత లాభం ఉంటుందో ఊహించుకోవచ్చు. ప్రస్తుతం సింగపూర్‌కు రవాణా చేయటానికి వీలుగా చెన్నైకు రోడ్డు మార్గంలో పంపిస్తున్నారు. అక్కడి నుంచి విమానాల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. విజయవాడ నుంచి త్వరలో ప్రారంభమయ్యే సింగపూర్ విమాన సర్వీసుకు కస్టమ్స్ అండ్ కార్గో క్లియరెన్స్ ఉంటే రైతులకు, ట్రేడర్లకు రవాణా ఖర్చులు ఆదా అవుతాయి. వేగంగా రవాణా చేయటానికి ఆస్కారం ఉంటుంది. ఇక్కడి నుంచి సింగపూర్‌కు కేవలం నాలుగు గంటల్లోనే రవాణా చేయవచ్చు.

ఇంటర్నేషనల్ కస్టమ్స్ అండ్ కార్గో స్క్రీనింగ్ తప్పనిసరి

- పి.భాస్కరరావు, ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు

సింగపూర్‌కు విమాన సర్వీసుల ప్రారంభానికి ముందే విజయవాడ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ కస్టమ్స్ అండ్ కార్గో స్క్రీనింగ్ ఏర్పాటు కావాలి. లేదంటే కార్గో ప్రయోజనాలను కోల్పోతాం. ప్రభుత్వానికి కూడా ఆదాయం వస్తుంది. మేము ఇప్పటికే కార్గో స్క్రీనింగ్ గురించి డిమాండ్ చేశాం. సింగపూర్‌కు మన జిల్లా నుంచి పీతలు, చేపలు, పండ్లు, ఆహార ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నారు. విజయవాడ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ కార్గో స్క్రీనింగ్ ఏర్పాటు ద్వారా ఇక్కడి నుంచి నేరుగా ఎగుమతులకు అవకాశం ఏర్పడుతుంది. రైతులకు ప్రయోజనకరంగా మారుతుంది.

సీఎం చంద్రబాబుపై రేషన్ డీలర్ల భరోసా

- తమ సమస్యలు పట్టించుకోవాలని వినతి

మొగల్రాజపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు 15 రోజుల పాటు రేషన్ సరుకులు అందుబాటులో ఉంచుతామని ఎన్నికల ముందు ఏదైతే చెప్పారో దానిని చేసి చూపించిన చంద్రబాబు రేషన్ డీలర్లకు కూడా న్యాయం చేస్తారనే భరోసాను వివిధ జిల్లాల రేషన్ డీలర్ల జిల్లా సంఘాల ప్రతినిధులు వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక అధ్యక్షుడు ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో విజయవాడ బెంజిసర్కిల్‌లో ఉన్న ఒక ఫంక్షన్ హాలులో రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్‌లకు ఎపుడు కమీషన్ పెంచినా అది చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలోనే జరిగిందని గుర్తు చేశారు. డోర్ డెలివరీ పేరుతో ప్రజలకు నిత్యావసరాలు ఒక పూటకు పరిమితం చేయడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పాదయాత్రలో చూసిన ఆయన డోర్ డెలివరీ తొలగించి అటు ప్రజలకు న్యాయం చేయడంతో పాటు ఇటు రేషన్ డీలర్ల ఉనికిని తిరిగి తీసుకొచ్చారని తెలిపారు. 16 లక్షలకు పైగా ఉన్న 65 సంవత్సరాలు దాటిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ప్రతి నెలా నాలుగురోజుల ముందుగానే సరుకులు తమ ద్వారా అందిస్తున్నారని చెప్పారు. డీలర్లు కూడా ప్రభుత్వ ఆదేశాలను సమర్థంగా అమలు చేస్తున్నారని చెప్పారు. కాకపోతే డీలర్లలో కూడా 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు కూడా ఉన్నారని, ఈ విషయమై పునరాలోచించి డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. హెల్పర్ చార్జీలు ఇప్పించడం, డోర్ డెలివరీ కోసం ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసిన బియ్యం ఇప్పించడం చేయాలని కోరారు. రేషన్‌డీలర్లకు సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు 2019లో చంద్రబాబు ఇచ్చిన మట్టిఖర్చుల జీవోను తిరిగి అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తమ జిల్లాల్లో ఉన్న సమస్యలను తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి టి.రవిచంద్రారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకరి సూర్యారావు, యు.ఉదయేశ్వరరావు, ఎం. ఇందిర , జొన్నలగడ్డ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో చంద్రబాబు మీద నమ్మకం ఉందని డీలర్లంతా చేతులు పైకి ఎత్తి ప్రతిజ్ఞ చేశారు.

అవినీతి ఆటంబాంబ్

(5వ పేజీ తరువాయి)

కనుసన్నల్లో ఈ దీపావళి డీల్ నడిచినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాణిజ్యపన్నుల శాఖలోని ఉద్యోగవర్గాలు దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. వ్యాపారులకు, అధికారులకు మధ్య ఒక ఎస్టీపీ (సేల్స్‌ట్యాక్స్ ప్రాక్టీషనర్) అనుసంధానకర్తగా వ్యవహరించాడు. జీఎస్టీ తగ్గింపునకు సంబంధించిన అవగాహన కార్యక్రమంలో అధికారులు మచిలీపట్నంలో సూపర్ జీఎస్టీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటుచేసే హడావిడిలో ఉన్నారు. దీన్ని అదునుగా తీసుకున్న ఈ నలుగురు కలిసి ఎస్టీపీ ద్వారా వసూళ్ల కథను నడిపించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి విచారణకు ఆదేశిస్తారా, ఇదంతా మామూలే అన్నట్టుగా వదిలేస్తారా చూడాలి.

ఇసుక లారీల పట్టివేత

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై తెలంగాణాకు ఇసుక తరలిస్తున్న రెండు లారీలతో పాటు ఎస్కార్ట్‌గా ఉన్న కారు, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని చిల్లకల్లు స్టేషన్‌కు తరలించినట్టు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రాత్రి గస్తీలో భాగంగా పోలీస్ వాహనాన్ని చూసి హైవేపై లారీలను వదిలి డ్రైవర్‌లు పారిపోగా వారిలో ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించినట్టు తెలిపారు. కొండపల్లి ఖిల్లా రోడ్డులో డంప్ వద్ద లోడు చేసుకున్నామని ఎస్కార్ట్‌గా కారు కూడా ఉందని ఇచ్చిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఇసుక పాలసీ అమలులోకి వచ్చిన నాటినుంచి 15 నెలల కాలంలో అక్రమ ఇసుక రవాణాకు సంబంధించి 105 కేసులు నమోదు చేసి 146 మందిని అదుపులోకి తీసుకుని 126 వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. జగ్గయ్యపేట స్టేషన్‌లో ఎనిమిది కేసులు, 11 మంది వ్యక్తులు, తొమ్మిది వాహనాలు, పెనుగంచిప్రోలు పరిధిలో 14 కేసులు, 20 మంది వ్యక్తులు, 13 వాహనాలు, వత్సవాయి పరిధిలో 25 కేసులు, 43 మంది వ్యక్తులు, 39 వాహనాలు, చిల్లకల్లు పరిధిలో 60 కేసులు, 79 మంది వ్యక్తులు, 67 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.


పట్టుబడిన లారీలు

రికార్డు వేలం

(5వ పేజీ తరువాయి)

రూ.5కోట్ల71లక్షల26వేలకు, గ్రామాడియన్ స్టూడియో రూ.5కోట్ల71లక్షల20వేలకు టెండర్ వేశారు. అయితే, ఈ పాట ఆదాయం కార్పొరేషన్ పార్కింగ్‌లన్నింటినీ కలిపినా రాదు. కాంట్రాక్టర్లు ఎందుకు ఇంత మొత్తంలో వేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆదాయం రాదని తెలిసినా రూ.కోట్లలో పోటీపడి మరి హెచ్చు పాడిన కాంట్రాక్టర్ల వ్యవహారం ప్రశ్నార్థకంగా మారింది. కమిషనర్ స్పందించి ఇద్దరి కాంట్రాక్టర్ల ఈఎండీ మొత్తాన్ని జమచేసి మళ్లీ ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని పలువురు కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135,144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

వీధిలైటుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



భారతీనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వివేకానంద కాలనీలోని కనకమేడల రవీంద్ర కుమార్ కమిటీహాల్ రోడ్డులో గురువారం విద్యుత్ సిబ్బంది వీధి లైటుకు మరమ్మతు చేశారు. 11వ డివిజన్‌లోని వివేకానంద కాలనీలోని కనకమేడల రవీంద్ర కుమార్ కమిటీహాల్ రోడ్డులో వీధిలైట్లు వెలగడం లేదు అనే శీర్షికతో గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు సిబ్బందిని పంపించి ఆ రోడ్డులోని వీధిలైట్లను మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించారు.

ప్రభుత్వాసుపత్రికి దివీస్ వితరణ

● ఆర్వో ప్లాంట్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ రూ.66.67 లక్షల విలువైన 14 ఆర్వో ప్లాంట్‌లను వితరణగా ఇచ్చింది. ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం పూర్తైన ఈ ప్లాంట్‌లను తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ గురువారం ప్రారంభించారు. ప్రతి గంటకు వెయ్యి లీటర్ల నీటిని అందించే మూడు ప్లాంట్‌లను, ప్రతి గంటకు 100 లీటర్ల నీటిని సరఫరా చేసే 11 ప్లాంట్‌లను ఆసుపత్రిలో నెలకొల్పడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల ఆరోగ్యానికి తోడ్పాడునందిస్తున్న దివీస్ ల్యాబ్ నిర్వాహకులను అభినందించారు. ఆసుపత్రి సిబ్బంది, రోగులకు శుద్ధమైన తాగునీరు అందించడానికి ఈ ప్లాంట్‌లు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ జి.వి.వి.సత్యనారాయణ, ఏడీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

నిర్మలా శిశుభవన్‌లో హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు



నిర్మలా శిశుభవన్‌లో చిన్నారులకు కేక్ తినిపిస్తున్న గద్దె క్రాంతికుమార్

కృష్ణలంక, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు ప్రభాస్ జన్మదినం సందర్భంగా ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో, పోడూరు పవన్ నేతృత్వంలో కృష్ణలంక నిర్మల శిశుభవన్‌లో పిల్లలతో కలిసి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ముఖ్య అతిథిగా హాజరై పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి ప్రభాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.నర్సింహారావు, చింతపల్లి వంశీ, కంచర్ల అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

ఏక్ భారత్ శ్రేష్ఠలో నలంద ఎన్‌సీసీ క్యాడెట్లకు బహుమతులు



క్యాడెట్లతో కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ

లబ్బీపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్, బీహార్ డైరెక్టరేట్ పరిధిలోని కొడెర్మాపూర్‌లోని సైనిక్ స్కూల్‌లో ఈ నెల 6 నుంచి 16వరకు జరిగిన ఏక్ భారత్ శ్రేష్ఠ శిబిరంలో తమ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న తమ కళాశాల క్యాడెట్లు పి.నివాస్, బి.ఈశ్వరరావు, ఎస్‌జెఎస్ అనూషలు వివిధ సాంస్కృతిక, సహపాఠ్య కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులు గెలుపొందారని, 4ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ లోని టి.పావనిసాయి సోలో డాన్స్‌లో గోల్డ్ మెడల్ ట్రోఫీ సాధించిందని, జె.బుజ్జి, కె.అశ్వినిలు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా 4ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ జీసీ పాండె, ఇతర కమాండింగ్ ఆఫీసర్‌లు క్యాడెట్‌లను అభినందించారు.



జలమయమైన ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు, కరెంట్ ఆఫీస్ రోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డు, పటమట కోనేరు వారి వీధి సమీపంలో బందరు రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

భారీ వర్షం...ఆటోనగర్ అతలాకుతలం

● రోడ్లు జలమయం..స్తంభించిన జనజీవనం
● ఇబ్బందిపడిన వాహనచోదకులు, పాదచారులు

ఆటోనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలకు జవహర్ ఆటోనగర్ అతలాకుతలమయింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు ఆటోనగర్‌లోని అన్ని రోడ్లు జలమయమయ్యాయి. వంద అడుగుల రోడ్డుతోపాటు కరెంట్ ఆఫీస్‌రోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డు, బళ్లెంవారివీధి కాటా సెంటర్, సాయి హోటల్ ప్రాంతాలతోపాటు అంతర్గత రోడ్లు సైతం జలమయమయ్యాయి. ఇటు వాహనచోదకుల నుంచి అటు పాదచారుల వరకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా రోడ్ల మధ్యలో ఉన్న గోతుల్లో



దర్శిపేట అంతర్గత రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

వర్షపునీరు చేరడంతో వాహనచోదకుల ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ద్విచక్ర వాహనచోదకులు నీటిలోని గోతుల్లో పడి గాయాలకు గురయ్యారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, ఉన్న డ్రెయినుల్లో పూడిక తీయకపోవడంతో రోడ్లపై ఎక్కడ పడిన వర్షపునీరు అక్కడ నిలిచిపోయింది. దీనివల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. డ్రెయినేజీలోని నీరు సైతం రోడ్లపైకి రావడంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు.

రామలింగేశ్వరనగర్: పటమట ఎన్టీఆర్ సర్కిల్ నుంచి హైస్కూల్ రోడ్డు వరకు బందరు రోడ్డు కాలువను తలపించింది. రోడ్డుకు ఇరువైపులా మోకాలు లోతులో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్కూల్, కాలేజీల విద్యార్థులు, విధులు ముగించుకుని ఇంటికి చేరే ఉద్యోగులు, ఆటోనగర్‌లోని కార్మికులు ట్రాఫిక్‌లో ఇరుక్కుని తీవ్ర అసహనానికి గురయ్యారు. దర్శిపేట నుంచి అంబేడ్కర్‌నగర్, సత్యనారాయణనగర్, లంబాడిపేట ప్రాంతాలకు చేరుకునే రోడ్డుపై, ఇదే ప్రాంతాల్లోని అంతర్గత రోడ్లు సైతం జలమయమయ్యాయి. పటమట, దర్శిపేట, అంబేడ్కర్‌నగర్, లంబాడీపేట, సత్యనారాయణనగర్, కృష్ణవేణి రోడ్డు ప్రాంతాల్లో డ్రెయినేజీలు పూడిక దశకు చేరుకున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా, చెదారంతో నిండిపోయిన డ్రెయినేజీలు నీటి పారుదలకు అడ్డంకిగా మారాయి. దీంతో వర్షానికి రోడ్డుపై నీరు రోజుల తరబడి నిలిచిపోతుంది.

కొండపై కూలిన ఇళ్లు తప్పిన ప్రమాదం



మొగల్రాజపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏడో డివిజన్‌లో గురువారం కొండ మీద రెండు ఇళ్లు కూలాయి. అదృష్టవశాత్తు కింద ఇంట్లో వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. బోయపాటి మాధవరావు రోడ్డు ఏటీ క్యాసిల్ పక్క రోడ్డు కొండమీద భారీ వర్షానికి రెండు ఇళ్లు కూలాయి. కిందున్న ఇల్లు పైకప్పు, వరండా దెబ్బతిన్నాయి. విషయం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి వెళ్లగా ఆయన డివిజన్ పార్టీ నాయకులను అప్రమత్తం చేసి సంఘటనా స్థలానికి పంపారు. వారు వీఎంసీ, సచివాలయ సిబ్బందిని తీసుకెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. దెబ్బతిన్న ఇంట్లో వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. డివిజన్ అధ్యక్షుడు సతీష్‌చంద్ర, అల్లా నాగవిజయ్ తదితరులు పాల్గొన్నారు.

మూడో డివిజన్‌లో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే గద్దె



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పులోని ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మూడో డివిజన్‌లోని సమస్యలన్నీ పరిష్కారం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. గురువారం తూర్పు పరిధిలోని 3వ డివిజన్ ఈఎస్‌ఐ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డివిజన్‌లో రూ.30లక్షల వ్యయంతో చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులకు, 12వ సచివాలయం దగ్గర రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుతం 3వ డివిజన్‌లో కల్వర్టులు, రోడ్డు, భూగర్భ డ్రెయినేజీ సదుపాయాలను కల్పించడానికి రూ.30లక్షల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడి బాబురావు, గుత్తికొండ కృష్ణమోహన్, సునీల్, తూమాటి ప్రేమ్‌నాథ్, రమేష్, పండు, పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలి

అసిస్టెంట్ ప్రొఫెసర్ సాయికుమార్

భారతీనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులందరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని అసిస్టెంట్ ప్రొఫెసర్ డి లోకేష్ సాయికుమార్ అన్నారు. ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా అనే అంశంపై గురువారం ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీవీపీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డి లోకేష్ సాయికుమార్ మాట్లాడుతూ రాబోయే రోజులలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ రంగాలలో రాణించాలంటే పైథాన్ ప్రోగ్రామింగ్ చాలా అవసరం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా లోకేష్ సాయికుమార్‌ను ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కాండీకున్నా, విభాగాధిపతులు ఘనంగా సత్కరించారు. విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



లోకేష్ సాయికుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ కాండీకున్నా, విభాగాధిపతులు, విద్యార్థులు



నగర డీసీపీ(అడ్మిన్) సరితకు శాలివాహన డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ పేరేపి గురువారం చిత్రపటాన్ని అందజేశారు.

- భారతీనగర్

డ్రెయిన్లలో మురుగు నిలవనీయొద్దు

నగర కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రధాన డ్రెయిన్లలో మురుగు, వర్షం నీరు పారుదలకు ఆటంకం కలగకుండా ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. టిక్కిల్ రోడ్డు, మదర్ థెరెసా జంక్షన్, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డు, లయోలా కాలేజ్ రోడ్డు, ఈఎస్‌ఐ హాస్పిటల్ జంక్షన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, 33 తూముల సెంటర్ ప్రాంతాలను గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. డ్రోన్‌లతో ప్రధాన డ్రెయిన్లలో మురుగు ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. 33తుమ్ముల కాల్వలో గుర్రపు డెక్కలను తొలగించాలని, ఈఎస్‌ఐ జంక్షన్ కింద ఉన్న డ్రెయిన్ లెవల్ పెంచి మురుగు పారుదల అయ్యేలా చూడాలన్నారు. అనంతరం ధర్నా చౌక్ వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. పర్యటనలో ఈఈ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రోన్ సహాయంతో ప్రధాన డ్రెయిన్ మురుగునీరు పారుదల పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర


టెన్నిస్ టోర్నీలో వీఎంసీ ఉద్యోగి చాంపియన్

ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో 17 వరకు జరిగిన ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 35 ప్లస్ డబుల్స్ విభాగంలో వీఎంసీ ఎస్టేట్ సెక్షన్‌లో పనిచేస్తున్న అడ్మిన్ కార్యదర్శి రామకూరి రాంబాబు, మహేష్ (విజయనగరం) జోడి డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్నారు. రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిల్లో పలు టోర్నమెంట్లలో పాల్గొని విజయం సాధిస్తున్న రాంబాబుని కమిషనర్ ధ్యానచంద్ర గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు ఒత్తిడి తేవాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

గాంధీనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో స్టే ఉన్నందున రిజర్వేషన్లు కొనసాగించేందుకు రాజ్యాంగ సవరణ తప్ప మరో మార్గం లేదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సవరణ కోసం క్షేత్రస్థాయిలో రాజకీయ చర్యలు జరిపే దిశగా కృషి చేయాలని తీర్మానించారు. ఆంధ్రా పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రా పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ జలాది చంద్రనంద్ మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగ సవరణకు టీడీపీ, జనసేన పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలను కలుపుకుని రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని, రాష్ట్ర అధ్యక్షుడు గిద్దా శ్రీనివాస నాయుడు, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధంరెడ్డి శివశంకర్‌రెడ్డి, శ్రీధర్, ఎల్.జయబాబు తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘాల నేతలు

పార్వతీదేవి అలంకారంలో భ్రమరాంబదేవి

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతశివాలయంలో కార్తీకమాస నక్షదీక్ష మహోత్సవాల్లో భాగంగా గురువారం భ్రమరాంబ అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో నటరాజన్ షణ్ముగం పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారికి ఖడ్గమాల, సహస్రనామార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లేశ్వరస్వామికి



మహన్యాసపూర్వక ఏకదాశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షణలు, పంచహారతులు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బి.మధు, సభ్యులు, ఎన్.విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం నరకప్రాయం

గోసాల- మద్దూరు రోడ్డు నరకానికి చిరునామాగా మారింది. ఈ రోడ్డులోకి ప్రవేశించగానే రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందా..! అన్న అనుమానం వస్తుంది. 1990లో ప్రయాణ అనుభూతులను ఈ రోడ్డు కలిగిస్తుంది. ఎద్దుల బండి ఇరుసు చక్రాలు సైతం ఇరుక్కుపోయేలా ఈ రోడ్డు ఉంటుందనడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. దూరం తక్కువే అయినా ప్రయాణ భారం ఎక్కువ.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ

● భారీ గుంతలతో గోసాల - మద్దూరు రోడ్డు ● నడిచేందుకు వీలు లేక అష్టకష్టాలు

కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని గోసాల నుంచి మద్దూరు వెళ్లే రోడ్డు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలోని గోసాల గ్రామం నుంచి ఈ రోడ్డు ప్రారంభమవుతుంది. మద్దూరు గ్రామ ప్రజలు జాతీయ రహదారిపైకి చేరుకునేందుకు ఇదే ప్రధాన మార్గం. మద్దూరు నుంచి గోసాల గ్రామంలోని జాతీయ రహదారి వరకు 5 కిలోమీటర్లు విస్తరించి ఉంటుంది. పాఠశాలలు, కళాశాలల బస్సులు ఈ రోడ్డుపై ఎక్కువగా తిరుగుతుంటాయి. గ్రామాల్లోని రైతులు ధాన్య దిగుబడులను ఇంటికి తెచ్చుకునేందుకు ఇదొక్కటే మార్గం. రైతులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులు ఇలా నిత్యం ప్రజా రవాణా ఈ రోడ్డుపై సాగుతుంటుంది. సమీప గ్రామాల్లోని జనజీవనానికి కీలకంగా ఉండే ఈ రోడ్డు ప్రస్తుతం అధ్వాన్నంగా మారింది.







నరకానికి నకలు

ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా రోడ్డు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఐదు నెలల క్రితం వరకు చిన్నచిన్న గోతులతో ఉండేది. ఈ ఏడాది ఆగస్టు నుంచి తరచూ కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డుపై గుంతలు కనుమరుగై అదే స్థానంలో అగాధాలు ఏర్పడ్డాయి. ఒక్కో ప్రదేశంలో నాలుగైదు మీటర్ల వెడల్పుతో అడుగు లోతులో ఉండే అగాధాలు ప్రయాణానికి తీవ్ర అటంకంగా మారాయి. దారి పొడవునా ఈ భారీ అగాధాలు అనేకం ఉన్నాయి. మరీ ముఖ్యంగా రోడ్డు మలుపులో ఏర్పడిన భారీ అగాధం ప్రమాదాలకు కారణమవుతుంది. ఏదైనా బస్సు, కారులో ప్రయాణించాలంటే భయం వేస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. బస్సు, కారు, లారీలు రోడ్డుపై అటూ ఇటూ ఒరుగుతూ వెళుతుండటం పడిపోతుందేమోనన్న భయాందోళనకు గురి చేస్తుందని చెబుతున్నారు. ఈ రోడ్డులో కనీసం వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో రోడ్లు లేని ఓ అడవిలో ప్రయాణం చేస్తున్నట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నేటికీ బహుజనులకు అందని రాజ్యాంగ ఫలాలు

గాంధీనగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా బహుజనులకు నేటికి రాజ్యాంగ ఫలాలు అందడం లేదని పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్, కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు గిద్దా శ్రీనివాస నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా దమాషా ప్రకారం నామినేటెడ్ పోస్టులు కేటాయించాలన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. బీసీలకు నష్టం లేకుండా కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జాతీయ చైర్మన్ నారగోని మాట్లాడుతూ సామాజిక సమానత్వం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్యను ఘనంగా సత్కరించారు. ఫ్రంట్ నేతలు వీరంకి ఆయ్యన్న, జి.బాబు, చందు, ఎం..లలిత కుమారి, సిని లత, జానకిలక్ష్మీ, జీవీ.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ దూర విద్యాకేంద్రం ఈ ఏడాది జూలై, ఆగస్టులో నిర్వహించిన బి.ఎ., బీకాం (జనరల్ కంప్యూటర్ అప్లికేషన్స్), బి.బి.ఎ, ఎంఏ, బి.ఎల్ఐసీ, ఎంఏ ఎకనామిక్స్, బీఎల్ఎస్ కోర్సుల పరీక్షలకు సంబంధించి ఫలితాలను తాత్కాలిక రెక్టార్ ఆచార్య శివ రాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, దూరవిద్య సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు గురువారం విడుదల చేశారు. రీ-వాల్యుయేషన్‌కు వచ్చే నెల 4 లోపు దరఖాస్తు చేసుకోవాలని దూరవిద్య పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జైనులాబ్దిన్ తెలిపారు. ఒక్కొక్క పేపరు రీ-వాల్యుయేషన్‌కు డిగ్రీ విద్యార్థులు రూ.770, పీజీ, బీఎల్ఐసీ విద్యార్థులు రూ.960 చెల్లించాలన్నారు. రీవాల్యుయేషన్ దరఖాస్తులను వచ్చే నెల 7లోపు విశ్వవిద్యాలయంలోని దూరవిద్య పరీక్షల సమన్వయకర్తకు అందజేయాలన్నారు. ఫలితాలను ఏఎన్యూసిడిఈడాట్‌ఇన్ఫో అంతర్జాలం నుంచి పొందవచ్చన్నారు.

ఆక్వాలో ప్రపంచానికే రోల్‌మోడల్‌గా నందివాడ

గుడివాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాబోయే 8 నెలల్లో నం దివాడ క్లస్టర్‌లో ఆక్వాసాగు చేసి ప్రపంచానికి రోల్‌మోడల్‌గా చూపిస్తామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి బీ రాజశేఖర్ అన్నారు. గురువారం గుడివాడ వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాల ఫంక్షన్‌హాల్‌లో ఆక్వా ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో ఆంధ్ర ఆక్వా రైతులకు గ్లోబల్ గుర్తింపు లక్ష్యంగా డిజిటల్ ట్రేసబిలిటీ నందివాడ ముందడుగు పేరుతో చేపట్టిన పైలెట్ ప్రాజెక్టును ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆక్వా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులు సాధికారత సాధించాలనే ముఖ్య ఉద్దేశంతో ఆక్వాసాగులో సుస్థిరత సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్ మాట్లాడుతూ నందివాడ మండలంలో 7వేల ఎకరాలకు గాను 5వేల ఎకరాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకున్నామన్నారు. మిగిలిన రైతులు నవంబరు 15లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలుంటేనే ఆ ఉత్పత్తులను వారు అంగీకరిస్తారని లేనిపక్షంలో తిరస్కరిస్తారన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆక్వాసాగు మంచి అవకాశమని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆక్వా రైతులు కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని సూచించారు. తొలుత ఆక్వా ఎక్స్ఛేంజ్ సంస్థ సహ వ్యవస్థాపకులు కిరణ్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వెల్కమ్ ఫిషరీస్ అధినేత ఆనంద్‌ను ఘనంగా సత్కరించారు. మత్స్యశాఖ జేడీ నాగరాజు, గుడివాడ ఆర్డీవో జీ బాలసుబ్రహ్మణ్యం, ఏపీఎస్ఏడీఏ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తికొండ శ్రీరాజబాబు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఆక్వారైతులు, అధికారులు పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల పండు గ రద్దీని పురస్కరించుకుని దక్షిణ మ ధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ గురువారం ఒక ప్రకట న విడుదల చేశారు. 06558 కలబుర్గి-బెంగుళూరు కంటోన్మెంట్ ఈనెల 24న ఒక సర్వీసు నడుస్తుంది. 06248 బరోని - ఎస్ఎంవిటి బెంగళూరు ఈనెల 26న ఒక సర్వీసు నడుస్తుంది. 06228 ముజఫర్‌పూర్ - ఎస్ఎంవిటి బెంగళూరు ఈనెల 27న ఒక సర్వీసు నడుస్తుంది. 06552 దర్భాంగ - ఎస్ఎంవిటి బేంగళూరు ఈనెల 27న ఒక సర్వీసు నడుస్తుంది. ఇదే రైలు 06551 నెంబరుతో ఈనెల 24న బెంగళూరు నుంచి దర్భాంగ ఒక సర్వీసు నడుస్తుంది. 06184 బరోని - ఎర్నాకులం జంక్షన్ చౌక్ ఈనెల 26న ఒక సర్వీసు నడుస్తుంది. 06188 బరోని జంక్షన్ - కొడనూర్ జంక్షన్ ఈనెల 27న సోమవారం ఒక సర్వీసుగా నడుస్తుంది. 06194 బరోని - కొడనూర్ ఈనెల 28న ఒక సర్వీసు నడుస్తుంది. 06193 కొడనూర్ జంక్షన్ - బరోని జంక్షన్ ఈనెల 25న ఒక సర్వీసు నడుస్తుంది. 07642 మచిలీపట్నం - చర్లపల్లి ఈనెల 24న బయలుదేరుతుంది. 07641 చర్లపల్లి - మచిలీపట్నం ఈనెల 26న బయలుదేరుతుంది.

తిరోగమన దిశలో పాలన చేసిన జగన్: గన్నే

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైఎస్ జగన్ తిరోగమన దిశగా పాలన చేశాడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డికి కృత్రిమ మేధ (ఏఐ) అంటే ఏమిటో తెలియదంటూ విమర్శించారు. తాడేపల్లిలో జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై గన్నే ప్రసాద్ స్పందించారు. ఉద్యోగుల గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌రెడ్డికి లేదన్నారు. నకిలీ మద్యం సృష్టికర్త జోగి రమేష్ అంటూ మరోసారి స్పందిస్తూ దానికి సూత్రధారి ఎమ్మెల్యే జగన్ రెడ్డి అని విమర్శించారు. రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్‌ను చంద్రబాబు, నారా లోకేశ్‌లు తీసుకువస్తే జగన్‌రెడ్డి తన విలేకరుల సమావేశంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) కొత్త అర్థం చెప్పాడన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ సైబర్ సిటీ, హైటెక్ సిటీ చూస్తే చంద్రబాబే గుర్తుకువస్తారని, వాటి సృష్టికర్త ఆయనేనని ఎవరైనా చెబుతారన్నారు.

అర్బన్ బ్యాంకులను పటిష్ఠపరచాలి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సహకార రంగంలోని అర్బన్ బ్యాంకులను డిపాజిట్ల సేకరణ ద్వారా పటిష్ఠపరచాలని, గృహ నిర్మాణాలకు రుణాలివ్వాలని మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. మచిలీపట్నం అర్బన్ బ్యాంకు నూతన అధ్యక్షుడిగా ఐ దిలీప్‌కుమార్ గురువారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. వర్షంలో సైతం పెద్ద ఎత్తున టీడీపీ నేతలు అర్బన్ బ్యాంకుకు తరలివచ్చారు. వేదపండితుల ఆశీర్వచనాలతో దిలీప్‌కుమార్ బ్యాంకు ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఎంపీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బూరగడ్డ వేదవ్యాస్ సమక్షంలో దిలీప్‌కుమార్ సహా మిగిలిన డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మొదటి రోజే కోటిన్నర డిపాజిట్లు సేకరించి దిలీప్‌కుమార్ బృందం ఒక రికార్డు స్థాపించింది. అనంతరం బృందావనపుర కల్యాణ మండపంలో జరిగిన అభినందన సభలో బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి ఖాతాదారులకు అందుబాటులో ఉండేలా బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ బ్యాంకులో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. బ్యాంకు నూతన అధ్యక్షుడు దిలీప్‌కుమార్ మాట్లాడుతూ తనకు మంత్రి కొల్లు రవీంద్ర, సీఎం చంద్రబాబు ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామన్నారు. డైరెక్టర్లు వేము కోటేశ్వరరావు, నూకల రమాదేవి, గెల్లి అరుణకుమారి, వంపుగడల చౌదరి, పోతాబత్తుల పాండురంగారావు, సూరిశెట్టి హరికృష్ణ, బొర్రా శ్రీనివాస్, గున్నం నాగరాజన్, టీడీపీ నేతలు గొర్రెపాటి గోపీచంద్, సనకా నాగులు, తూమాటి బసవయ్య, పిప్పళ్ల కాంతారావు, లోగిశెట్టి వెంకటస్వామి, టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, జనసేన నేత గడ్డం రాజు, బీజేపీ నేత పంతం గజేంద్ర పాల్గొన్నారు.

వైస్‌చైర్మన్ పదవి ఇవ్వాలని చౌదరి డిమాండ్

ప్రమాణ స్వీకారం అనంతరం మాజీ కౌన్సిలర్, జనసేన నేత వంపుగడల చౌదరి తనకు వైస్‌చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ మంత్రి కొల్లు రవీంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటారని సర్దిచెప్పారు.

బ్రహ్మ లింగయ్య చెరువులో బోటింగ్ పాయింట్!

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ● జోరువానలో గొల్లనపల్లిలో పర్యటన



గొల్లపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ

గన్నవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మ లింగయ్య చెరువులో బోటింగ్ పాయింట్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నట్టు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. మండలంలోని గొల్లనపల్లి గ్రామంలో గురువారం ఉదయం జోరు వానను సైతం లెక్కచేయకుండా వర్షంలో తడుస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.45 లక్షల ఖర్చుతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. రూ.2.40 కోట్ల ఖర్చుతో చేపట్టిన మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి, రూ.24 లక్షల ఖర్చుతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ బ్రహ్మ లింగయ్య చెరువును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఇక్కడ బోటింగ్ పాయింట్ ఏర్పాటుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించగా, సానుకులంగా స్పందించిన ప్రభుత్వం ఫీజిబిలిటీ సర్వే జరుపుతున్నట్టు వివాదాలకతీతంగా ప్రజల ఆమోదంతో పలుచోట్ల రోడ్ల విస్తరణ చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో కొండలు, గుట్టలు, చెరువుల్లో మట్టి దోచుకుంటూ 8ఏళ్లగా అక్రమాలకు పాల్పడిన వారిని వదిలే ప్రశ్న లేదని హెచ్చరించారు. కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలందరి సహకారంతో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెడతానన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నామంటూ ఇద్దరు మహిళలు యార్లగడ్డకు మొరపెట్టుకోగా వెంటనే స్పందించిన ఆయన రూ.5 లక్షల ఖర్చుతో సీసీ రోడ్లు నిర్మించాలని అధికారులు ఆదేశించారు. సర్పంచ్ గణపవరపు శాంతి, టీడీపీ మండలాధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్, ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసయ్య, మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాద్, దొంతు చిన్న, కొండేటి వెంకటేశ్వరరావు, గుజ్జర్లపూడి బాబురావు, యనమదల సతీష్, చిమటా రవి వర్మ ఎంపీడీవో స్వర్ణలత పాల్గొన్నారు. తెలుగుదేశం నేతలు ట్రాక్టర్ల ర్యాలీతో యార్లగడ్డకు స్వాగతం పలికారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఘనంగా ఎన్టీఆర్ జిల్లా యువజనోత్సవాలు





విద్యార్థులకు మెమెంటోలు అందజేస్తున్న ఆర్డీవో చైతన్య

వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అద్భుత ప్రదర్శనలు, ఆకట్టుకునే నృత్యాలు, యువత కేరింతల మధ్య ఎన్టీఆర్ జిల్లా యువజనోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. యువజన సర్వీసుల శాఖ, స్టెప్, క్రిషి ఆధ్వర్యంలో కొత్తపేట కేబీఎన్ కళాశాలలో గురువారం జరిగిన ఎన్టీఆర్ జిల్లా యువజనోత్సవాలకు విజయవాడ ఆర్డీవో కే చైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి యువజనోత్సవాలు మంచి వేదికన్నారు. జిల్లా యువత రాష్ట్ర, జాతీయ పోటీల్లో బహుమతులు సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ఎన్టీఆర్ జిల్లా యువజన సంక్షేమాధికారి, ముఖ్య కార్యనిర్వహణాధికారి యూ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన వారికి, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ప్రతి ఏటా జనవరిలో న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన వివిధ కళాశాలల విద్యార్థులు బృందగానం, నృత్యం, చిత్రలేఖనం వంటి అంశాల్లో పోటీపడ్డారు. అద్భుత ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. అబ్బురపరిచే ప్రదర్శనలను చూసి యువత కేరింతలు కొట్టారు. జానపద గీతాల విభాగంలో ఎం సింధు రాజేశ్వరి బృందం మొదటి స్థానంలో నిలవగా, టీ కిరణ్ బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. జానపద నృత్యం విభాగంలో విఘ్నేష్ కార్తికేయ బృందం మొదటి బహుమతిని, కౌశిక్ బృందం రెండో బహుమతిని దక్కించుకున్నాయి. సైన్స్ మేళలో కే అఖిల బృందం తొలి స్థానంలో, సీహెచ్ హాసిని బృందం ద్వితీయ స్థానంలో నిలిచాయి. స్టోరీ రైటింగ్‌లో కే బాల మణిప్రసాద్ ప్రథమ బహుమతిని, కే ప్రదీప్ కుమార్ ద్వితీయ బహుమతిని పొందారు. పోయెట్రీలో ఎం శ్రీలేఖ, వీ వర్షిణి మొదటి, రెండు స్థానాలు పొందగా, చిత్రలేఖనంలో డీ సుదీక్ష, ఎం శ్రీ వైష్ణవి, డిక్లమేషన్లో కే శ్రావణి, ఎస్కే నదియా ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. విజేతలకు విజయవాడ ఆర్డీవో కే చైతన్య, షైభారత్, యూత్ ఆఫీసర్ సుంకర రాము మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. స్టెప్ క్రిషి మేనేజర్ డీ సుబ్బారావు, యువజన సర్వీసుల శాఖ ఫీల్డ్ ఆఫీసర్ అభిజ్ఞాన్, సిబ్బంది, కళాశాల కమిటీ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కెంపే గౌడ విమానాశ్రయాన్ని సందర్శించిన ఏడీసీ బృందం

కెంపేగౌడ విమానాశ్రయంలో ఏడీసీ బృందం

కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ లక్ష్మీ పార్థసారథి, ఉద్యానవనం విభాగం అధికారులు గురువారం సందర్శించారు. అక్కడ విమానాశ్రయంలో అత్యంత శోభాయమానంగా అభివృద్ధి చేస్తున్న పచ్చదనాన్ని పరిశీలించారు. విమానాశ్రయ అధికారులు ఏడీసీ ప్రతినిధులకు గ్రీనరీ అభివృద్ధికి వారు అవలంబిస్తున్న పద్ధతులను క్షేత్రస్థాయిలో వివరించారు. విమానాశ్రయ పరిసరాల్లో పచ్చదనం అభివృద్ధి మొత్తం డ్రిప్ ఆటో మిషన్ ద్వారా నిర్వహిస్తున్నట్టు వివరించారు. ముఖ్యంగా పూలచెట్లు, మొక్కలు, నీటికుంటలు, వాటర్‌ఫౌంటెన్లు, కారిడార్ల వద్ద గ్రీనరీ అభివృద్ధికి మైక్రో ఇరిగేషన్ వ్యవస్థను ఉపయోగించడం ద్వారా పచ్చదనం పెంచడం సులువుగా ఉండటంతో పాటు అద్భుతమైన లక్ష్యాలను సాధిస్తున్నట్టు ఎయిర్‌పోర్ట్ ప్రతినిధులు ఏడీసీ బృందానికి వివరించారు. ప్రజా రాజధాని అమరావతిలో గ్రీనరీ అభివృద్ధికి తాము కూడా అత్యధిక పద్ధతులతో ముందుకు వెళ్తున్నామని సీఎండీ లక్ష్మీ పార్థసారథి, విమానాశ్రయ ప్రతినిధులకు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నగరాన్ని సందర్శించాలని వారికి ఆహ్వానం పలికారు. ఈ పర్యటనలో ఏడీసీ ఉద్యానవనం విభాగం అధికారులు, నిపుణులు పాల్గొన్నారు.



వేతన కార్యదర్శులకు బోనస్ పంపిణీ చేస్తున్న చలసాని

నాణ్యమైన పాల సేకరణపై దృష్టి పెట్టాలి

● విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన పాల సేకరణపై సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు మరింత దృష్టి పెట్టి పాల దిగుబడి పెంచడానికి మరింత కృషి చేయాలని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. గురువారం వీరవల్లి కామధేను యూనిట్‌లో హనుమాన్‌జంక్షన్ పాలశీతల కేంద్రం యూనిట్ పరిధిలోని వేతన కార్యదర్శులకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పాలసేకరణ ఆధారిత బోనస్ సొమ్ము రూ.18.19లక్షలు పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా రూ1.24 కోట్ల బోనస్ అందజేసినట్టు ఆయన తెలిపారు. నాణ్యమైన పాలసేకరణ పెరిగితే సంఘాలు బలోపేతం అవుతాయన్నారు. అధిక పాలసేకరణ చేసిన సంఘాలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వేతన కార్యదర్శులు చలసానిని శాలువతో సత్కరించారు. ఎండీ కొల్లి ఈశ్వరబాబు, ప్రొక్యూర్‌మెంట్ జీఎం పారీ, వివిధ సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు, క్షేత్రస్థాయి సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



క్యామెట్ యాప్‌పై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన గ్రామస్థులు

గ్రామంలో క్యామెట్ కల్లోలం

● యాప్‌కు బానిసలవుతున్న యువత

● పోలీసులకు గ్రామస్థుల ఫిర్యాదు

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ గ్రామంలో క్యామెట్ యాప్ కొంతకాలంగా ప్రకంపనలు సృష్టిస్తున్నట్టు గ్రామానికి చెందిన కొందరు జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లును ఆశ్రయించిన ఘటన గురువారం సంచలనం కలిగించింది. ఈ యాప్‌లో మహిళలు అర్ధనగ్నంగా సభ్యసమాజం సిగ్గుపడేలా వీడియోలు, ఫొటోలు పెడుతూ వెకిలి చేష్టలతో పోస్టులు చేస్తుండటంతో యువత, మహిళలు ఆకర్షితులై విద్యార్థులు పాఠశాలలకు, మహిళలు వ్యవసాయ పనులకు గైర్హాజరవటంతో పాటు బానిసలుగా మారుతున్నారు. అక్రమ సంపాదనకు కొందరు స్వార్థపరులు యాప్ లింకును పంపుతున్నట్టు గుర్తించామని తక్షణ చర్యలు తీసుకోకుంటే గ్రామ పరిస్థితి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామం నుంచే తెలంగాణలోని సూర్యాపేట జిల్లా మఠంపల్లి గ్రామానికి చెందిన మహిళల ద్వారా క్యామెట్ లింకు వెళ్లిందని గ్రామంలోని స్థానికులు గమనించి అప్రమత్తమై పోలీసుల దృష్టికి తీసుకెళ్లటంతో మొగ్గలోనే తుంచారని ఇక్కడ కూడా అలాగే చేయాలని సీఐని కోరారు. సీఐ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇస్తామని, యాప్‌ను తొలగించేందుకు జిల్లా సైబర్ టీంతో చర్చలు జరుపుతున్నామని ఆందోళన వద్దన్నారు. ఎస్ఐను కలిసిన వారిలో బాల్యానాయక్, గుగులోతు బగ్గీషా, గుగులోతు రాంబాబు ఉన్నారు.

కిలేడీ వ్యాపారి

● కాలం చెల్లిన ఆహార పదార్థాల విక్రయం

● విజిలెన్స్ సోదాలతో బయటపడిన వ్యవహారం

ఆంధ్రజ్యోతి - విజయవాడ: చిన్నారులు ఇష్టపడే బాదం పొడి.. కేక్‌లు.. చాక్లెట్లు.. బిస్కట్లు.. వంటి ఆహార పదార్థాలను కాలం చెల్లిపోయినా విక్రయించేసి సొమ్ములు చేసుకుంటోంది ఓ మహిళ. రాజకీయంగా, గ్యాంగ్‌ల పరంగా తనకున్న సంబంధాలను అడ్డుపెట్టుకుని చెలరేగిపోతుంది. విజయవాడ వన్‌టౌన్‌లో ఉంటూ భవానీపురంలోని ఫుడ్ ప్రొడక్ట్స్‌ను నిర్వహిస్తున్న వ్యవహారం విజిలెన్స్ సోదాలతో వెలుగులోకి వచ్చాయి. వన్‌టౌన్‌కు చెందిన ఓ వ్యక్తి ఈ ఫుడ్ ప్రొడక్ట్స్‌ను భవానీపురం కేంద్రంగా ఏర్పాటు చేశాడు. తర్వాత ఆయన సతీమణి మరోవ్యక్తితో కలిసి అతడిని హత్య చేసి ప్రతి వ్యాపారాన్ని తన చేతుల్లో పెట్టుకుని నడిపిస్తోంది. ప్రస్తుతం ఫుడ్ ప్రొడక్ట్స్‌ను ఆమె నడిపిస్తోంది.

లైసెన్స్ లేకుండా వ్యాపారాలు

సాధారణంగా ప్రతి వ్యాపారానికి ఒక లైసెన్స్ ఉంటుంది. ముఖ్యంగా ఆహార పదార్థాల విక్రయాలకు సంబంధించి ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్ ఉంటుంది. దీనికి కొంత గడువు ఉంటుంది. అది ముగిశాక రెన్యువల్ చేయించుకోవాలి. కానీ ఈ మహిళ రెన్యువల్ చేయించుకోకుండా యథేచ్ఛగా వ్యాపారం చేస్తోంది. ప్రశ్నించిన అధికారులపై రాజకీయ నేతలను, న్యాయవాదులను వదులుతోంది. లైసెన్స్ ఏ కేటగిరిలో తీసుకుంటే దాని ప్రకారమే వ్యాపారం చేయాలి. కానీ ఆమె ఉల్లంఘించి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ కంపెనీలో బాదం టీపొడి, పాల పొడి, బిస్కట్లు, చాక్లెట్లతోపాటు జామ్‌లను ఎలాంటి నిపుణుల పర్యవేక్షణ లేకుండా తయారు చేయడం గమనార్హం. ఈ మహిళకు తెలంగాణలోని గ్యాంగ్‌స్టర్ అనుచరులతో సంబంధాలున్నాయని ఆరోపణలున్నాయి. ఈ సంస్థపై విజిలెన్స్ ఫుడ్ సేఫ్టీ అధికారులు తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి వదిలేయడం గమనార్హం.

విశేషం

ధర్మదీక్షాచార్యుడు

అది ఉత్తరాది మఠం యతివరేణ్యులైన శ్రీసత్య ధ్యానతీర్థులు తిరుచానూరులో స్థాపించిన విద్యాపీఠం. అక్కడ అధ్యయనం చేస్తున్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి, ఫలితాలను ఒక కాగితం పై రాసి స్వామికి అధ్యాపకులు అందజేశారు. సాధించిన ఫలితాలకు తగిన నగదు బహుమతిని విద్యార్థులకు స్వామివారు ఇవ్వడం ఆనవాయితీ. అయితే ఒక విద్యార్థికి మొదటి శ్రేణి మార్కులు వచ్చినా... స్వామి తక్కువ నగదు అందజేశారు. ఇది గమనించిన మఠం దీవాన్... ఆ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. అప్పుడు స్వామి మందహాసం చేసి... "ఈ విద్యార్థి తీసుకొనేవాడు కాదు. భవిష్యత్తులో ఎంతోమందికి తానే ఇస్తాడు" అంటూ భవిష్యవాణి వినిపించారు. ఆ విద్యార్థి పేరు గురురాజాచార్. అతనే ఆ తరువాత 'శ్రీసత్య ప్రమోద తీర్థులు'గా... ఉత్తరాది మఠానికి 41వ అధిపతిగా... వేదాంత సామ్రాజ్యాన్ని ఏలారు.

తర్కశిరోమణి...

శ్రీసత్య ప్రమోద తీర్థులు 1918 ఆగస్టు 28న... కర్ణాటకలోని ధార్వాడలో శ్రీరంగాచార్యగుత్తల్, కమలాదేవి దంపతులకు 'గురురాజాచార్'గా జన్మించారు. ఆయన చిన్న వయసు నుంచే సంస్కృతం, వేద, శాస్త్రాధ్యయనాలలో చక్కటి ప్రతిభా పాటవాలు చూపి, గురువుల మెప్పు పొందారు. తర్కశాస్త్రంలో పాండిత్యానికి గాను 'తర్కశిరోమణి' అనే బిరుదు లభించింది. ఉత్తరాది మఠం 40వ అధిపతి అయిన శ్రీసత్యాభిజ్ఞ తీర్థులు... తన తరువాత మఠాధిపత్యాన్ని ఎవరికి ఇవ్వాలని ఆలోచిస్తున్నప్పుడు... ఆయన కలలో శ్రీసత్య ధ్యానతీర్థులు కనిపించి... గురురాజాచార్ అందుకు అర్హుడని సూచించారు. అయితే ఈ విషయాన్ని బహిర్గతం చేయడానికి ముందే శ్రీసత్యాభిజ్ఞతీర్థులు మంచానపడి, అచేతనులయ్యారు. ఆయన తన వారసుణ్ణి ప్రకటించకుండానే పరమపదిస్తారేమోనని అందరూ ఆందోళనలో ఉండగా... శ్రీసత్యాభిజ్ఞ తీర్థులు మళ్ళీ స్వస్థత చెందారు. 1947లో గురురాజాచార్యులకు సన్యాస దీక్షను అనుగ్రహించి, 'శ్రీసత్య ప్రమోద తీర్థులు'గా నామకరణం చేశారు. ఉత్తరాది మఠాధిపతిగా నియమించారు.



అచంచల గురుభక్తి

మహా పండితులైన తమకు బదులుగా దక్కిన మఠాధిపత్యాన్ని శ్రీసత్య ప్రమోద తీర్థులు ఎలా నిలుపుకోగలరో చూద్దామనే అనేకమంది పండితుల అసూయా ద్వేషాలు, బలహీనమైన తన ఆరోగ్య స్థితి, క్షీణించిన మఠం ఆర్థిక పరిస్థితి... ఇలా ఎన్నో సవాళ్ళను, సమస్యలను ఆయన ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎంతటి క్లిష్ట సమస్య అయినా... శ్రీసత్య ప్రమోదులు ఎన్నుకొన్న పరిష్కార మార్గం ఒక్కటే... అదే అచంచలమైన గురుభక్తి. తన గురువుల మీద ఉన్న అపారమైన విశ్వాసమే ఆయనకు శ్రీరామరక్షగా నిలిచింది. మలఖేడ్‌లో శ్రీజయతీర్థుల మూల బృందావనం దగ్గర ఆయన నిర్వహించిన మొదటి 'సుధామంగళ' కార్యక్రమం.. అనేకమంది పండితులను ఆయన విద్వత్తుకు దాసోహం చేసింది. అది ఆయన మొదటి విజయం. ఆయనది అద్భుతమైన జ్ఞాపకశక్తి. అలాగే ఆయన ధర్మ దీక్ష అనితర సాధ్యం. రోజూ జ్ఞానకార్యమైన 'సుధాపాఠం' లేనిదే... శ్రీమూలరాముల పూజ చేసేవారు కాదు.

విద్యాప్రదాత...

శ్రీసత్య ప్రమోదులు... ముంబాయిలో శ్రీసత్య ధ్యాన పీఠం, బెంగళూరులో శ్రీ జయతీర్థ విద్యాపీఠం నెలకొల్పి, ఎందరో వేద విద్యార్థులకు ప్రత్యక్షంగా తత్త్వ జ్ఞానాన్ని బోధించారు. అసంఖ్యాకమైన భక్తులకు బోధలు, మంత్రోపదేశాలు చేశారు, దీక్షలను అనుగ్రహించారు. భగవదానుగ్రహం పొందే జ్ఞానాన్ని ప్రసాదించారు. గ్రంథాలు రచించారు. ఆయన ప్రారంభించిన విద్యాదానం నేటికీ కొనసాగుతోంది. ప్రస్తుత మఠాధిపతి శ్రీసత్యాత్మ తీర్థులకు కూడా ఆయనే మంత్రోపదేశం చేసి, సన్యాస దీక్ష ప్రసాదించారు. శ్రీసత్య ప్రమోదులు దేశంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి... విష్ణుభక్తిని ప్రచారం చేశారు. ఉత్తరాది మఠం పరంపరలో... శ్రీనరహరి తీర్థుల తరువాత... ఒడిశాకు విచ్చేసిన మొదటి మఠాధిపతి ఆయనే. పల్లెటూర్లకు సైతం వెళ్ళి... హిందూ ధర్మాన్ని, మధ్వ సిద్ధాంతాన్ని బోధించి, ప్రజలను జాగృతం చేశారు. వారిలో భక్తి విశ్వాసాలను దృఢపరిచారు. ఎటువంటి భోగాలను ఆశించకుండా, నిస్వార్థమైన జీవనాన్ని సాగించిన శ్రీసత్య ప్రమోదుల ఆరాధనోత్సవాలు ఈనెల 23న ప్రారంభమయ్యాయి. 25వ తేదీ వరకూ కొనసాగుతాయి. శ్రీసత్య ప్రమోదుల 108వ జయంతి సందర్భంగా... ఆయన పేరు మీద 108 రూపాయల వెండి నాణేన్ని ఈ ఏడాది ఆగస్టు ముప్ఫైన కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

• శ్రీ మధ్వ ప్రచార పరిషత్

కార్తిక మాసం

కార్తికంలో ఆరు నియమాలు



ఆనాటి ఋషులు ఏర్పాటు చేసిన సంప్రదాయాల వెనుక ఎన్నో ఆరోగ్య, ఆధ్యాత్మిక, సామాజిక, జీవనగమన సంబంధమైన ఎన్నో అంశాలు ఉన్నాయి. తమతోపాటు అందరినీ తరింపజేయాలనే నిస్వార్థమైన దృక్పథంతో అనేక విధానాలను వారు మనకు ఏనాడో చెప్పారు. వాటిలో... కార్తిక మాసంలో ఆచరించవలసిన నియమాల గురించి తెలుసుకుందాం.

స్నానం దీపంచ దానంచ పురాణ శ్రవణం ద్విజాత్
బిల్వార్చనం చైవ వన భోజనమాచరేత్...

"కార్తిక మాసం అంతటా చేయవలసినవి... స్నానం, దీపం వెలిగించడం, దానం, పండితుల ద్వారా పురాణాన్ని వినడం, లక్ష బిల్వార్చనం, వన భోజనం" అని చెబుతోంది శాస్త్రం.

స్నానం: ఆశ్వయుజం, కార్తికం అనే రెండు మాసాలకూ కలిపి 'శరదృతువు' అని పేరు. ఆశ్వయుజంలో చలి ప్రారంభమైతే... కార్తికంలో కొంత మంచు చేరుతుంది. ఇలాంటి వాతావరణంలో ప్రజలు అనారోగ్యాలకు గురికావడం సాధారణంగా జరుగుతుంది. ఈ వాతావరణ మార్పును శరీరానికి అలవాటు పడేలా చేస్తూ, ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండాలంటే... ప్రతి నిత్యం చన్నీటి స్నానం చేయాలి. 'అసలే చలి. అందులోనూ చన్నీటి స్నానమా?' అనుకోకూడదు. ఔషధం తప్పనిసరిగా తీయగానే ఉండాలనుకోవడం సరికాదు. తెల్లవారు జామున స్నానాలు ప్రారంభించాక... మొదటి నాలుగైదు రోజులు జలుబు, ముక్కు బిగుసుకుపోవడం లాంటివి కలుగుతాయి. శత్రువుతో పోరాడేటప్పుడు... రెండు మూడు దెబ్బలు తిని ఊరుకుంటే ఓడిపోయినట్టే కదా! ఆ పరిస్థితిని దాటడం కోసం... స్నానాలను కొనసాగిస్తే శత్రువు లొంగుతాడు. శరీరం ఆ స్నానాలకు అలవాటు పడుతుంది. లేదా... మొదటి రెండు మూడు రోజులు కొద్దిగా వెచ్చగా, ఆ తరువాత రెండు రోజులు గోరువెచ్చగా... శరీరం అలవాటు పడేలా చేస్తే... ఆ తరువాత పూర్తిగా చన్నీటి స్నానాలు చేయవచ్చు. అది పెద్ద ఇబ్బందే కాదు. 'స్నానం చేసి తీరాలన్నారు కదా!' అని అనారోగ్యవంతులు, చన్నీటి స్నానాన్ని తట్టుకోలేని వృద్ధులు, రాత్రంతా పనిపాటలు చేసి పొద్దున్న నిద్రించే ఉద్యోగులు దీన్ని పాటించాలని నిర్బంధమేదీ లేదు. కొన్ని సందర్భాల్లో వారికి అది ప్రమాదకరం కూడా. ఈ విషయాన్ని కూడా పెద్దలు చెప్పారు.

దానం: దానం అనగానే లక్షలో, కోట్లో ఖర్చు చేయనవసరం లేదు. దైవదర్శనం కోసం ఆలయానికి వెళ్ళినప్పుడు... దీపారాధన నిమిత్తం కొంత నూనెను రోజూ ఇవ్వడం, అర్చకులకు శక్తిమేర బియ్యాన్ని సమర్పించడం, భోజనం చేసేటప్పుడు కాకులకు నేతి అన్నపు ముద్దను, పిచ్చుకలకు వడ్ల గింజలను పెట్టడం, చీమల కన్నాల దగ్గర బెల్లపు పొడి వేయడం, కుక్కలకు పెరుగన్నం పెట్టడం, పిల్లుల కోసం పాత్రలో పాలు ఉంచడం... ఇవన్నీ దానాలే. అన్ని జీవులూ భగవంతుని సంతానమే. కాబట్టి ఆ సంతానంలో ఒకరుగా మిగిలిన జీవులనూ మనం ఆదరించాలి. అప్పుడే మనకు, మన కుటుంబానికి ఆయన ఆశీస్సులు కలుగుతాయి.

పురాణ శ్రవణం: స్నానం, దీపం, దానం ద్వారా భౌతిక శుద్ధి కలుగుతుంది. మానసిక శుద్ధి కోసం పురాణాలను వినాలి. మనకు వచ్చే సమస్యల్లో చాలా వాటిని ఎవరికీ చెప్పుకోలేం. ఇరుగు పొరుగు వారికి చెబితే... వాటికి చిలవలూ పలవలూ జోడించి ఊరంతా చాటింపు వేయవచ్చు. మరి వాటికి పరిష్కారం ఎలా? పురాణాలు ఎన్నో కథలను చర్చిస్తాయి. వాటిలో చాలా సమస్యలకు పరిష్కారాలు సులువుగా దొరుకుతాయి. గుడిలో పురాణం వినిపించే పండితులను నేటికీ సన్మానిస్తూ ఉండడానికి కారణం... ఈ పరిష్కార లాభమే. అంతేకాదు... ధర్మాచరణను, సత్ప్రవర్తనను పురాణాలు నేర్పుతాయి. చెడు దారులు పట్టినవారికి పతనం తప్పదనే సత్యాన్ని స్పష్టం చేస్తాయి.



దీపం: 'తైలం' అంటే 'తిలలను (నువ్వులను' పిండగా వచ్చినది' అని అర్థం. కాబట్టి అవకాశం ఉంటే నెల మొత్తం ఆవు నేతి దీపాలు రెండు, లేదా నువ్వుల నూనె దీపాలు రెండు నిత్యం పూజా మందిరంలో వెలిగించాలి. ప్రదోష సమయంలో (సాయంత్రం ముగిసి రాత్రి రాబోవడానికి ముందు... చిరు సంజ చీకటి కాలంలో) ప్రధాన ద్వారానికి అటూ ఇటూ పెట్టాలి. చలి వాతావరణంలో పెరిగే లక్షణం ఉన్న హానికర క్రిములు... ఇలా వీధి గుమ్మం దగ్గిర పెట్టిన దీపానికి ఆకర్షితమై, మంటల్లో పడి మరణిస్తాయి. లేదా ఆ దరిదాపుల్లోకి రావు. దీపం పెట్టిన తరువాత... ఆ వెలుగులో దైవాన్ని దర్శించుకోవాలి. దేవుని స్తోత్రాలు, మంత్రాలు... ఇలా వేటినైనా చదువుకోవచ్చు. దీపాలను పత్తితో చేసిన వత్తులతో, మట్టి ప్రమిదల్లో పెట్టడం శ్రేష్ఠం.

లక్ష బిల్వార్చన: మారేడు ఆకులతో కషాయం కాచుకొని, రోజూ ఒక్క అర చెంచా చొప్పున తీసుకుంటే శ్వాసకోశ వ్యాధులు తొలగిపోతాయని, లేత మారేడు ఆకులను దంచి, ముద్ద చేసుకొని, ఆవు నేతిలో మిరియపు గింజంత కలిపి రోజూ తింటే జీర్ణక్రియలో లోపం ఉండదని పూర్వులు చెప్పారు. ఇక... లక్ష మారేడు దళాల మీద నుంచి వచ్చే గాలిని అర్చన ముగిసే వరకూ... సుమారు అయిదు గంటల సేపు పీలిస్తే శ్వాస వ్యాధులు పోతాయనేది వైద్య శాస్త్ర రహస్యం. ఈ మాసంలోని శీతోష్ణస్థితి అనారోగ్యాన్ని కలిగించేది కావడం వల్లే... ఈ పద్ధతిని ఏర్పాటు చేశారు. లేత బిల్వ దళాన్ని నీటిలో వేసుకొని, ఆ నీటిని అయిదారు గంటల తరువాత తాగితే ఆరోగ్యం బాగుంటుంది. మారేడువల్ల కలిగే ఇలాంటి ప్రయోజనాలను బిల్వ దళార్చన తరువాత పెద్దలు వివరిస్తూ ఉంటారు. బిల్వం... శివ, విష్ణు ప్రీతికరమైనది. మూడు ఆకులు శివుడి నేత్రాలకు సంకేతం. లక్ష్మీ పూజకు కూడా అవి ప్రశస్తమైనవి. అందుకే... బిల్వ దళాలను కోసిన తరువాత... పది రోజుల పాటు అవే పత్రాలతో పూజ చేయడం దోషం కాదంది శాస్త్రం.

వనభోజనం: వర్ష ఋతువైన శ్రావణ, భాద్రపదాల్లో బాగా కురిసిన వర్షాలకు... అంతకుముందు విత్తనాలుగా ఉన్న మొక్కలు క్రమంగా పెరుగుతాయి. అవి తమలో ఓషధీ శక్తులన్నిటినీ నింపుకొని, దృఢమైన మొక్కలుగా ఉండేది కార్తికానికే.




అందుకే కార్తిక వన భోజనాల పేరిట... వయోధికులను తీసుకువెళ్ళి, ఈ ఓషధీ వృక్షాలు, మొక్కల గురించి వివరంగా తెలుసుకుంటే... మన ఆరోగ్యం మన చేతిలో ఉన్నట్టే. సృష్టిలో మొక్కలకు ఉన్న శక్తి ఎంతటిదో కూడా మనకు అర్థం అవుతుంది. ఇలా పైన పేర్కొన్న అన్నిటిలో ఉన్న ఆరోగ్య రహస్యాలను తెలుసుకున్నప్పుడు... కార్తిక మాస ప్రాధాన్యం మనకు అవగతం అవుతుంది.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు

తెలుసుకుందాం

శివాలయాన్ని ఎలా దర్శించాలి?

పవిత్రమైన కార్తిక మాసంలో శివాలయ దర్శనం అత్యంత శుభప్రదం. ఆ దర్శన క్రమాన్ని మన పూర్వులు, మహర్షులు వివరించారు. శివాలయానికి వెళ్ళినవారు మూడు లింగాలను కచ్చితంగా దర్శించుకోవాలి. అవి: స్థూల లింగం, సూక్ష్మ లింగం, భద్ర లింగం. వాటినే 'లింగత్రయం' అంటారు.



స్థూల లింగం విమానంస్యాత్ సూక్ష్మ లింగం సదాశివమ్... బలిపీఠం భద్రలింగం లింగత్రయ మిహోచ్యతే... అంటే గర్భగుడిపైన నిర్మితమైన విమానం... స్థూల లింగం. ఆలయంలో కొలువుతీరిన మూల లింగం... సూక్ష్మ లింగం. ధ్వజ స్తంభానికి ముందు ఉండే బలిపీఠం... భద్ర లింగం. మొదట ఆలయ గోపురాన్ని దర్శించిన వెంటనే... దాన్ని స్థూల లింగంగా భావించి, నమస్కరించాలి. ఆ తరువాతనే ఆలయంలో ప్రవేశించాలి. ధ్వజ స్తంభం దగ్గర సాష్టాంగ నమస్కారం చేయాలి. భగవంతుడి నామాన్ని ఉచ్చరిస్తూ ఆలయానికి ప్రదక్షిణ చేయాలి.

మళ్ళీ ధ్వజ స్తంభం దగ్గర సాష్టాంగ నమస్కారం చేయాలి. ధ్వజస్తంభం, బలిపీఠం, నంది దగ్గర ఎదురుగా నిలబడి, స్తోత్రం చేసి, ఆలయంలో ప్రవేశించాలి. మొదట వినాయకుణ్ణి దర్శించుకొని... మూడుసార్లు గుంజిళ్ళు తీయాలి. అనంతరం ఆలయంలోని మూలస్థాన మూర్తి ముందు నిలబడి, రెండు చేతులూ జోడించి, నమస్కరించి, పంచాక్షరి మంత్రాన్ని (ఓం నమఃశివాయ) పఠిస్తూ, తమకు వచ్చిన స్తోత్రాలను చదువుతూ దర్శనం చేసుకోవాలి. ఆ తరువాత ఆలయంలోని అమ్మవారి సన్నిధికి వెళ్ళి... దేవీ స్తోత్రాలు పారాయణ చేస్తూ నమస్కారం చేయాలి. అలాగే ఉత్సవ విగ్రహాలను దర్శించి, రెండో ప్రదక్షిణ చేయాలి. తరువాత నటరాజ స్వామిని, శివకామసుందరి అమ్మవార్లను, ప్రాకారంలోని ఇతర పరివార దేవతలను దర్శించి, నమస్కరించుకోవాలి. తరువాత సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకొని, నవగ్రహ సన్నిధికి వెళ్ళాలి. అక్కడ ఒకసారి లేదా మూడుసార్లు ప్రదక్షిణలు చేయాలి. చివరిగా... ఆలయానికి మూడో సారి ప్రదక్షిణ చేయాలి. మూడోసారి ప్రదక్షిణ చేసేటప్పుడు... దక్షిణామూర్తి సన్నిధిని, దుర్గా సన్నిధిని, చివరిగా చండీశ్వరుణ్ణి దర్శించాలి. చండీశ్వరుడు మానవునిగా జన్మించి, పరమేశ్వరుణ్ణి ప్రసన్నం చేసుకొని, శివ నిర్మాల్యానికి అధిపతి అయ్యాడు. భక్తి మార్గంలో పరమేశ్వర సాయుజ్యం పొందాడు. ఆయన విగ్రహానికి నమస్కరించి... "ఈ దర్శన క్రమంలో ఏదైనా తప్పు ఉంటే క్షమించి, దర్శన ఫలితాన్ని ఇవ్వు" అని ప్రార్థించాలి. చివరగా ధ్వజస్తంభం దగ్గరకు వచ్చి, మరోసారి సాష్టాంగ నమస్కారం చేయాలి. అక్కడ కూర్చొని శివనామ జపం చేయాలి. తరువాత కాసేపు కన్నులు మూసుకొని... ఆలయంలో దర్శించిన మూర్తులను గుర్తుకు తెచ్చుకొని నమస్కరించాలి. శివ నామ ధ్యానంతో ఇంటికి బయలుదేరాలి.

అలా చేస్తే సత్ఫలితాలు

ఆలయంలో స్వామిని పాదాల నుంచి కిరీటం వరకూ... దిగువ నుంచి పైకి చూస్తూ దర్శనం చేసుకోవాలి. 'ధూళిదర్శనం దుఃఖనాశనం, పాదదర్శనం పాపనాశనం, శిఖరదర్శనం చింతనాశనం, కటిదర్శనం కర్మనాశనం, కంఠదర్శనం వైకుంఠ సాధనం, ముఖదర్శనం ముక్తిదాయకం, కిరీటదర్శనం కీర్తిదాయకం సర్వాంగ దర్శనం సర్వపాపవిమోచనం' అంటూ భగవంతుణ్ణి, ఆయన అవయవాలను దర్శిస్తే కలిగే ఫలితం గురించి 'తీర్థ క్షేత్ర మహిమ' గ్రంథం వివరించింది. 'ధూళి దర్శనం' అంటే మనం యాత్రకు బయలుదేరిన తరువాత ఆ క్షేత్రాన్ని చేరుకున్నాక... కాళ్ళు, చేతులు కడుక్కోవడం లాంటివి ఏవీ చేయకుండా... నేరుగా ఆలయంలోకి వెళ్ళి స్వామిని దర్శించడం. ఇది వినడానికి కొంత వింతగా అనిపించినా మన పూర్వీకులు దీన్ని సంప్రదాయంగా అనుసరించారు. దీనికి కారణం ఏమిటంటే... తీర్థయాత్ర ప్రారంభించినప్పటి నుంచి యాత్రికులు నియమ నిష్ఠలను, ఆహార నియమాలను పాటిస్తూ ఆ క్షేత్రానికి చేరుకుంటారు. ఆలయంలో ప్రవేశించి, ధ్వజస్తంభం దగ్గర సాష్టాంగ నమస్కారం చేసినప్పుడు... ఆ ఆలయంలోని పరమ భక్తుల పాదధూళి, ఆలయంలోని దివ్యత్వం అతణ్ణి పవిత్రుణ్ణి చేస్తాయి. అప్పుడు స్వామిని దర్శించుకొనే అర్హత అతనికి కలుగుతుంది. ధూళి దర్శనం దుఃఖాలను హరింపజేస్తుంది. శ్రీశైల క్షేత్రంలో ఈ ధూళి దర్శన సంప్రదాయం ఉంది. ఇక... ఆలయానికి చేరిన భక్తుడు ముందుగా విమాన శిఖరాన్ని దర్శించాలి. అది అతని చింతలను తీరుస్తుంది. దూరం నుంచి విమాన శిఖరాన్ని చూసినంత మాత్రాన సర్వపాపాల నుంచి విముక్తుడు అవుతాడు. అలాగే ఆలయంలో స్వామివారి వివిధ అవయవాలను దర్శించడం ద్వారా అనేక సత్ఫలితాలను భక్తులు పొందుతారు. కాగా ఆలయ విమానం నీడను దాటడం, తొక్కడం దోషం. బలి పీఠం దగ్గర తప్ప మరెక్కడా సాష్టాంగ నమస్కారం చేయకూడదు.

• దగ్గుపాటి నాగవరప్రసాద్, స్థపతి, 9440525788

సహజయోగ

శివతత్త్వం అంటే శివుణ్ణి చేరుకొనే గమ్యం. ఆ తత్త్వాన్ని సాధించాలంటే... మనం పయనించాల్సింది మధ్యస్థమైన విష్ణు మార్గంలో, అంటే సుషుమ్నా మార్గంలో. దానినే 'సోపాన మార్గం' అంటారు. అది సాధించాలంటే ఆ మార్గంలో ఉన్న ఆరు శక్తి కేంద్రాలు శుభ్రపడి, శక్తిని సంతరించు కోవాలి. అప్పుడే మనం ఆధ్యాత్మికంగా ఎదుగుతాం.

హృదయాన్ని శుభ్రపరుచుకుందాం!

ప్రతికూలతలు తొలగాలి

సర్వశక్తిమంతుడైన సదాశివుడు మనహృదయంలో ఆత్మ స్వరూపునిగా కొలువై ఉన్నాడు. ఆయన సర్వ స్వతంత్రుడు, నిరంతరంగా, శాశ్వతంగా ఉండేవాడు. శివుని నివాస స్థానం అన్నిటికీ అతీతంగా... అంటే మన బుద్ధికన్నా, ఆలోచనలకన్నా ఉన్నతంగా ఉంటుంది. మనం శివతత్త్వాన్ని సంతరించుకోవాలంటే ముందుగా హృదయ పవిత్రతపై దృష్టి పెట్టాలి. మన హృదయంలో ఈర్ష్యకూ, దుష్ట ఆలోచనలకు తావు ఉండకూడదు. సంబంధిత శక్తికేంద్రాలు శుభ్రపడాలి. అప్పుడే అది సాధ్యమవుతుంది. 'మనల్ని మనం తెలుసుకోవడం' అంటే... మన ఆత్మను తెలుసుకోవడం. దాని కోసం శివుణ్ణి ఆరాధించాలి. 'మనం ఆత్మ స్వరూపులం' అని గ్రహించాలి.. హృదయం స్వచ్ఛంగా ఉన్నట్టయితే... మనలోని ఆత్మ... పరిశుభ్రమైన అద్దంలా ఉంటుంది. దాని మీద భగవంతుడి ప్రతిబింబం స్పష్టంగా ఉంటుంది. హృదయం ఈర్ష్యతో, ద్వేషంతో నిండినట్టయితే... ఆ ప్రతిబింబం మసకబారుతుంది. మనం పూజ చేయడానికి ముందు స్నానం చేస్తాం. కానీ శుభ్రపరుచుకోవాల్సింది మన హృదయాన్ని. అందుకోసం మనలో అంతర్గతంగా ఉన్న ప్రతికూలతలను, మన పురోగతిని ఆటంకపరుస్తున్న అరిషడ్వర్గాలను తొలగించుకోవాలి. స్వచ్ఛమైన హృదయం ఉన్నప్పుడే భక్తి సాధ్యపడుతుంది.



ఆ గుణాల జాగృతి కోసం...

శివతత్త్వాన్ని సాధించాలంటే... చిన్న చిన్న విషయాల్లో చిక్కుకుపోకూడదు. శివుడి నుంచి ప్రేమ ప్రవాహం సదా వెలువడుతూనే ఉంటుంది. అందులో మనకు స్థానం ఉండాలంటే... అర్థం లేని విషయాలకు ప్రాధాన్యత ఇవ్వకూడదు. అప్పుడే మన చిత్తం ఆత్మ స్థానమైన హృదయంపైకి మళ్ళుతుంది. ఆత్మ ప్రకాశవంతం అవుతుంది. మనలోని లోపాలు తెలుస్తాయి. మాట్లాడే ప్రతి మాట హృదయం నుంచి వస్తుంది. సత్ప్రవర్తన పరిధులను అతిక్రమించకుండా ఉంటాం. సంపూర్ణ సంతృప్తితో జీవిస్తాం. మనలోని శక్తిని అసూయ, మోహం, శత్రుత్వం లాంటి ఉపయోగంలేని విషయాలతో వృధా చేసుకోకూడదు. అలాగైతేనే మనలోని ఆత్మ మన స్వభావంలో, వ్యక్తిత్వంలో, ప్రవర్తనలో ప్రకాశిస్తుంది. సహజయోగ సాధన ద్వారా మనలోని శివతత్త్వం జాగృతం చేసుకున్నప్పుడు... మనలోని సూక్ష్మమైన గొప్ప గుణాలు జాగృతం అవుతాయి. ఈ కార్తిక మాసం శివుణ్ణి, విష్ణువును ఆరాధించడానికి ఎంతో అనువైన కాలం.



డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

దైవమార్గం

మహా దార్శనికుడు

ఏసు క్రీస్తు శిష్యులలో ప్రముఖుడు యోహాను (జాన్). ఆయనను ఏసుకు ప్రియశిష్యుడిగా పరిగణిస్తారు. ఏసు శిష్యులందరిలో అతను చిన్నవాడు కావడం, ప్రభువును, ప్రభువు కుటుంబాన్ని అత్యంత విశ్వాసంతో, ప్రేమతో అంటిపెట్టుకొని ఉండడం దీనికి కారణాలు కావచ్చు. యోహాను... నలుగురు సువార్తికులలో ఒకరు మాత్రమే కాదు... 'నూతన నిబంధన'లోని చిట్టచివరి 'దర్శన గ్రంథ' రచయిత కూడా. క్రీస్తు జీవితంలోని అన్ని సందర్భాలలో పాలు పంచుకున్న వ్యక్తిగా అతను కనిపిస్తాడు. క్రీస్తు సాక్షాత్తూ దేవుడనీ, మానవుడిగా భూమిపై సంచరిస్తున్నాడని యోహాను గట్టిగా విశ్వసించాడు. అతని సువార్తకు ఈ అంశమే ప్రధాన సూత్రం అయింది. యోహాను మహా దార్శనికుడు. అతని ఊహా సౌందర్యం అత్యద్భుతమైనది. పరలోకాన్ని, పరలోకాధిపతి అయిన ఏసు రాకడను, దానికోసం మానవాళి తీసుకోవలసిన జాగ్రత్తలను, సిద్ధపడవలసిన అంశాలను ఆయన దర్శించాడు. అదే నూతన నిబంధన గ్రంథాలన్నిటిలో అమృతప్రాయమైన, అద్భుతమైన భావాలతో నిండిన 'దర్శన గ్రంథం' అయింది. యోహాను సువార్త 21 అధ్యాయాల గ్రంథం కాగా... దర్శన గ్రంథంలో 22 అధ్యాయాలు ఉన్నాయి. బైబిలు మొత్తాన్ని ఆధ్యాత్మిక కోణంలో... ఆద్యంతం భావనాపరంగానూ, మరెన్నో విశేషాలతోనూ ప్రకటించింది కాబట్టి... దర్శన గ్రంథానికి 'ప్రకటన గ్రంథం' అనే మరో పేరు కూడా ఉంది. యోహాను తన గ్రంథాన్ని కోయినె గ్రీకు భాషలోనే రాశాడు.




అది ప్రభువు మాట్లాడే అరమయిక్ భాషలోంచి కానీ, గ్రీకు నుంచి కానీ తర్జుమా అయినది కాదు. ఏసు ప్రభువును 'ఆదియందలి వాక్కు'గా యోహాను అభివర్ణించాడు. ఆ వాక్కే శరీరాన్ని ధరించి, మనుషుల మధ్య సంచరిస్తోందని పేర్కొన్నాడు. ఒక పేద ఇంట్లోని పెళ్ళి విందులో... నీటిని ద్రాక్ష రసంగా ఏసు మార్చిన వైనం మొదలుకొని... ఏసు మరణం, పునరుత్థానం వరకూ... ఎన్నో అద్భుతాలను తన గ్రంథంలో యోహాను పొందుపరిచాడు. యోహాను చిహ్నం 'ఎగురుతున్న గ్రద్ద' అని 'యెహెజ్కేలు గ్రంథం' పేర్కొంది.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

ఇక బ్యాంకు ఖాతాలకు నలుగురు నామినీలు

లాకర్లకూ ఇదే నిబంధన • నవంబరు 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక ఒక్కో బ్యాంకు ఖాతాపై డిపాజిటర్లు నలుగురి వరకు తన నామినీలుగా నామినేట్ చేయవచ్చు. సవరించిన ఈ నిబంధనలు నవంబరు 1 నుంచే అమల్లోకి వస్తాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. డిపాజిటర్లు ఈ నామినీల పేర్లను ఒకేసారి లేదా దఫదఫాలుగా పేర్కొనవచ్చు. అలాగే తన తదనంతరం బ్యాంకులోని తన డిపాజిట్‌లో ఏ నామినీకి ఎంత? లేదా ఎంత శాతం ఇవ్వాలో కూడా పేర్కొనవచ్చు. బ్యాంకు లాకర్లకూ ఇవే నిబంధనలు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త నిబంధనలతో డిపాజిటర్ల తదనంతరం సెటిల్‌మెంట్ ప్రక్రియ మరింత సులభం అవుతుందని భావిస్తున్నారు.



డిజిటల్ చెల్లింపులు అదుర్స్

దేశంలో డిజిటల్ చెల్లింపులు శరవేగంతో విస్తరిస్తున్నాయి. 2019లో రూ.1,775 లక్షల కోట్ల విలువైన 3,248 కోట్ల లావాదేవీలు నమోదవగా, గత ఏడాది (2024) మొత్తం మీద రూ.2,830 లక్షల కోట్ల విలువైన 20,849 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. శాతంపరంగా చూస్తే గత ఏడాది నమోదైన మొత్తం చెల్లింపుల లావాదేవీల్లో 99.7 శాతం డిజిటల్ చెల్లింపులని ఆర్‌బీఐ తెలిపింది. విలువపరంగా చూసినా ఈ చెల్లింపుల వాటా మొత్తం చెల్లింపుల్లో 97.5 శాతం వరకు ఉంది. కాగా ఈ ఏడాది (2025) తొలి ఆరు నెలల్లోనూ ఇదే పరిస్థితి. నెఫ్ట్, ఐఎంపీఎస్, ఆర్‌టీజీఎస్, ఎన్‌ఏసీహెచ్, డెబిట్, క్రెడిట్ కార్డ్స్, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్, యూపీఐ వంటి చెల్లింపులన్నీ డిజిటల్ చెల్లింపుల పరిధిలోకి వస్తాయి. వ్యాపార, వ్యక్తిగత చెల్లింపుల్లో డిజిటల్ లావాదేవీలు శరవేగంతో పెరుగుతుంటే, పేపర్ ఆధారిత చెక్కుల చెల్లింపుల వాటా ఇదే సమయంలో మొత్తం చెల్లింపుల్లో 2.3 శాతానికి పడిపోయింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనూ దేశంలో రూ.1,572 లక్షల కోట్ల విలువైన 12,549 కోట్ల డిజిటల్ చెల్లింపుల లావాదేవీలు నమోదయ్యాయి.

చెక్కుల క్లియరెన్స్‌లో ఇంకా బాలారిష్టాలు: ఎన్‌పీసీఐ

ఈ నెల 4వ తేదీ నుంచి ప్రవేశపెట్టిన సత్వర చెక్కుల క్లియరెన్స్‌లో ఇంకా కొన్ని బాలారిష్టాలు కొనసాగుతున్నట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. వీటిని కూడా అధిగమించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్టు పేర్కొంది. గతంలో చెక్కుల క్లియరెన్స్‌కు రెండు మూడు రోజుల సమయం పట్టేది. చెక్ ప్రజెంట్ చేసిన కొన్ని గంటల్లో అదే రోజు క్లియర్ చేసేలా చెక్ ట్రంకేటెడ్ సిస్టమ్ (సీటీసీ) పేరుతో ఆర్‌బీఐ ఈ నెల 4వ తేదీ నుంచి కొత్త విధానం ప్రవేశ పెట్టింది. అయితే సాంకేతిక సమస్యలు, బ్యాంకు సిబ్బందికి సరైన శిక్షణ లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో చెక్కుల క్లియరెన్స్‌కు ఐదారు రోజులు పడుతోంది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎన్‌పీసీఐ ఈ ప్రకటన విడుదల చేయడం విశేషం.

అదరగొట్టిన లారస్ ల్యాబ్స్

క్యూ2 లాభంలో 875% వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లారస్ ల్యాబ్స్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికాని (క్యూ2)కి గాను కంపెనీ రూ.1,653 కోట్ల రెవెన్యూపై రూ.195 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.20 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా 875 శాతం వృద్ధి చెందగా ఆదాయం 35 శాతం వృద్ధి చెందింది. కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ) విభాగం అద్భుతమైన పనితీరు కనబరచటం సహా జెనరిక్స్‌లో మెరుగైన వృద్ధి కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా వెల్లడించారు.

ఎలీ లిల్లీతో సిప్లా జట్టు

న్యూఢిల్లీ: టైప్-2 మధుమేహం, ఊబకాయం చికిత్సలో ఉపయోగించే ఔషధం టిర్జెపటైడ్‌ను 'యుర్పీక్' బ్రాండ్‌నేమ్‌తో భారత్‌లో విక్రయించేందుకు అంతర్జాతీయ ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీతో దేశీయ ఔషధ సంస్థ సిప్లా ఒప్పందం కుదుర్చుకుంది. ఎలీ లిల్లీ టిర్జెపటైడ్ ఔషధాన్ని మౌంజారో పేరుతో ఈ ఏడాది మార్చిలోనే భారత్‌లో ప్రవేశపెట్టింది. అయితే, దేశంలో ఈ ఔషధ లభ్యతను నగరాల పరిధి దాటి విస్తరించేందుకు మరో బ్రాండ్‌నేమ్ (యుర్పీక్)తోనూ విక్రయించేందుకు ఎలి లిల్లీ, సిప్లా జట్టు కట్టాయి. ఈ అగ్రిమెంట్‌లో భాగంగా ఎలీ లిల్లీ యుర్పీక్‌ను తయారు చేసి సిప్లాకు సరఫరా చేస్తుంది. సిప్లా ఈ ఔషధాన్ని మార్కెట్లో విక్రయిస్తుంది. దీన్ని కూడా మౌంజారో ధరకే విక్రయించనున్నట్లు ఇరు కంపెనీలు స్పష్టం చేశాయి. భారత్‌లో ఇది రెండో టిర్జెపటైడ్ బ్రాండ్.

పసిడి బాండ్లపై 325% రిటర్నులు

2017-18 ఆర్థిక సంవత్సరంలో నాలుగో విడతగా జారీ చేసిన ప్రభుత్వ పసిడి బాండ్ల విమోచన తుది ధరను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గురువారం ప్రకటించింది. యూనిట్‌కు రూ.2,971 చొప్పున 2017 అక్టోబరు 23న ఆర్‌బీఐ ఈ బాండ్లను జారీ చేసింది. వీటిని నగదీకరించుకునేవారికి చెల్లించబోయే ధరను యూనిట్‌కు రూ.12,704గా నిర్ణయించింది. అంటే, ఒక్కో యూనిట్‌పై ఇన్వెస్టర్లకు 325% ప్రతిఫలం లభించనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,080 ▼	1,14,650 ▼	1,74,000 ▼
విజయవాడ	1,27,000 ▲	1,20,000 ▲	1,58,000 ▲
విశాఖపట్నం	1,27,340 ▲	1,14,650 ▼	1,74,000 ▼
రాజమండ్రి	1,25,070 ▼	1,14,650 ▼	1,53,000 ▼
ప్రొద్దుటూరు	1,26,000 ▼	1,15,920 ▼	1,56,000 ▼
ముంబై	1,23,354 ▼	1,12,992 ▼	1,51,450 ▼

అదానీ గ్రూప్ నుంచి రూ.1,050 కోట్ల ఆర్డర్

బొండాడ ఇంజనీరింగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కి అదానీ గ్రూప్ నుంచి రూ.1,050 కోట్ల విలువైన భారీ ఆర్డర్ లభించింది. ఆర్డర్‌లో భాగంగా గుజరాత్‌లోని ఖావ్డా వద్ద అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ గ్రీన్ ఎనర్జీ సిక్స్ కంపెనీలు ఏర్పాటు చేసే 650 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుకు అవసరమైన యంత్ర పరికరాలను బొండాడ ఇంజనీరింగ్.. ఈపీసీ పద్ధతిలో సరఫరా చేస్తుంది. ఆర్డర్ అందుకున్న ఏడాదిలోగా ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	112	విజయవాడ	121
వరంగల్	112	గుంటూరు	121
కరీంనగర్	112	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	102
కర్నూలు	112	నెల్లూరు	107
విశాఖపట్నం	119	అనంతపురం	107
గోదావరి	121		

ట్రాన్స్‌ఫార్మర్ల తయారీలోకి ప్రీమియర్ ఎనర్జీస్

ట్రాన్స్‌కాన్ ఇండస్ట్రీస్‌లో 51% వాటా కొనుగోలు

డీల్ విలువ రూ.500 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్.. ట్రాన్స్‌ఫార్మర్ల తయారీలోకి ప్రవేశించింది. హైదరాబాద్‌కు చెందిన ట్రాన్స్‌కాన్ ఇండస్ట్రీస్ ఈక్విటీలో 51 శాతం వాటాను చేజిక్కించుకోవటం ద్వారా ఈ విభాగంలోకి అడుగుపెట్టినట్లు వెల్లడించింది. ఈ 51 శాతం వాటాను రూ.500.3 కోట్లకు కొనుగోలు చేసినట్లు కంపెనీ తెలిపింది. కాలుష్య రహిత ఇంధన రంగంలో సమగ్ర కంపెనీగా ఎదిగేందుకు ఈ కొనుగోలు దోహదం చేస్తుందని ప్రీమియర్ ఎనర్జీస్ పేర్కొంది. ట్రాన్స్‌కాన్.. విద్యుదుత్పత్తి, పంపిణీ సంస్థలకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేస్తోంది.

పుణె కంపెనీలోనూ వాటా: ట్రాన్స్‌కాన్ ఇండస్ట్రీస్‌తో పాటు పుణె కేంద్రంగా పని చేసే కేసోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ఈక్విటీలోనూ ప్రీమియర్ ఎనర్జీస్ రూ.86.7 కోట్లతో 51 శాతం వాటా చేజిక్కించుకుంది. మిగతా 49 శాతం వాటాను సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ రూ.83.3 కోట్లకు కొనుగోలు చేసింది. కాగా కేసోలార్ సంస్థ సోలార్ ఇన్వర్టర్ల తయారీలో ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 24వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	553
చిత్తూరు	583	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

ఏడాది గరిష్ఠాల నుంచి కిందికి..

- సెన్సెక్స్ 85,000, నిఫ్టీ 26,000 పైన ట్రేడింగ్ ప్రారంభం
- ఆఖర్లో అమ్మకాల కారణంగా స్వల్ప లాభాల్లో ముగింపు

ముంబై: భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై ఆశావహంతో పాటు ఐటీ, టెక్ షేర్లలో కొనుగోళ్లతో గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 85,000, నిఫ్టీ 26,000 స్థాయిల ఎగువన ట్రేడైనప్పటికీ, మళ్లీ కిందికి జారి స్వల్పలాభాలతో ముగింపు పలికాయి. ముహూరత్ ట్రేడింగ్ (మంగళవారం) ముగింపు స్థాయితో పోలిస్తే.. 727 పాయింట్ల లాభంతో 85,154 వద్ద ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 863.72 పాయింట్ల వరకు ఎగబాకి 85,290.06 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే, రష్యా ఇంధన దిగ్గజ సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించిన నేపథ్యంలో మదుపరులు అప్రమత్తమై ఆ కంపెనీల నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఇతర షేర్లలో పెద్దఎత్తున లాభాల స్వీకరణకు దిగారు. దాంతో సెన్సెక్స్ 130.06 పాయింట్ల లాభంతో 84,556.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 26,000 ఎగువన ట్రేడింగ్ ఆరంభించి, ఒక దశలో కొత్త ఏడాది గరిష్ఠ స్థాయి 26,104.20 వద్దకు చేరింది. ప్రాఫిట్ బుకింగ్‌తో మళ్లీ జారిన సూచీ కేవలం 22.80 పాయింట్ల లాభంతో 25,891.40 వద్ద ముగిసింది. సూచీలు లాభపడటం వరుసగా ఇది ఆరో రోజు.

కేవైసీ పూర్తి చేస్తేనే మ్యూచువల్ ఫండ్స్

సెబీ

న్యూఢిల్లీ:మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)కు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కొత్త ప్రామాణికాలు ప్రవేశపెట్టాలని ప్రతిపాదించింది. నో యువర్ క్లయింట్ (కేవైసీ) పూర్తి చేసిన మదుపరులను మాత్రమే ఇక నుంచి మ్యూచువల్ ఫండ్స్ సంస్థల్లో తొలి ఫోలియో (ఖాతా) ప్రారంభానికి అనుమతించాలని ప్రతిపాదించింది. చాలా మంది మదుపరులు కేవైసీ రిజిస్ట్రేషన్ ఏజెన్సీల (కేఆర్‌ఏ) వద్ద కేవైసీ పూర్తి చేయకుండానే ఎంఎఫ్ పథకాల్లో మదుపు చేస్తున్నట్టు ఇటీవల ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో సెబీ ఈ ప్రతిపాదన తీసుకువచ్చింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) తమకు అందిన మదుపరుల సబ్‌స్క్రిప్షన్ వివరాలను కేఆర్‌ఏలకు పంపించి నిర్ణయం తీసుకుంటాయి.

ఎన్‌ఆర్‌ఐలకూ ఊరట: ఎన్‌ఆర్‌ఐ మదుపరులకు జియో ట్యాగింగ్ విధానాన్నీ సులభతరం చేయాలని సెబీ ప్రతిపాదించింది. వీడియో క్లయింట్ ఐడెంటిఫికేషన్ (వీ-సీఐపీ) లేదా డిజిటల్ ఆన్‌బోర్డింగ్ పద్ధతిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ఎన్‌ఆర్‌ఐలు కేవైసీ చేసేటప్పుడు భౌతికంగా దగ్గర ఉండాల్సిన అవసరం ఉండదు.

కొన్ని ఉత్పత్తుల ధరలు పెరిగే చాన్స్: హెచ్‌యూఎల్

న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్లు తగ్గినా కొన్ని వస్తువుల రేట్లు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) భావిస్తోంది. ముఖ్యంగా జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రభావం లేని ఉత్పత్తుల ధరలు పెరుగుతాయని కంపెనీ సీఎఫ్‌ఓ రితేష్ తివారీ చెప్పారు. అయితే ఈ పెంపు స్వల్పస్థాయిలోనే ఉంటుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో తమ అమ్మకాల వృద్ధి రేటులో పెద్దగా ఎదుగూ బొదుగూ లేదన్నారు. అయితే నవంబరు నుంచి అమ్మకాల వృద్ధి రేటు ఊపందుకునే అవకాశం ఉందన్నారు. కాగా సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో హెచ్‌యూఎల్ నికర లాభం 3.8 శాతం పెరిగి రూ.2,694 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.15,703 కోట్ల నుంచి రూ.16,034 కోట్లకు పెరిగింది. కాగా రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.19 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

తగ్గిన సాగర్ సిమెంట్స్ నష్టాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సాగర్ సిమెంట్స్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.44 కోట్ల నికర నష్టాలను ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో నష్టం రూ.57 కోట్లుగా ఉంది. నిర్వహణపరంగా వ్యయాలు పెరిగిపోవటం పనితీరును దెబ్బతీసిందని కంపెనీ పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం 27 శాతం వృద్ధితో రూ.475 కోట్ల నుంచి రూ.602 కోట్లకు పెరిగింది. అమ్మకాలపరంగా మంచి పనితీరు కనిపించినప్పటికీ రుతుపవనాల ప్రభావం కొంత మేరకు పడిందని సాగర్ సిమెంట్స్ జేఎండీ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. నిర్వహణాపరంగా సామర్థ్యాలను పెంచుకోవటంపై దృష్టి పెట్టడం సహా వ్యయ నియంత్రణలను పాటించటం కలిసివచ్చిందని ఆయన పేర్కొన్నారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఇన్‌ఫ్రా, హౌసింగ్, నిర్మాణ కార్యకలాపాలు ఊపందుకుంటాయని అంచనా వేస్తున్నామని, దీంతో డిమాండ్ కూడా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం అమ్మకాలు 60 లక్షల టన్నులుగా ఉంటాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు.

అడిలైడ్‌లోనూ అదే తీరు

రెండో వన్డేలో టీమిండియా ఓటమి

ఆసీస్‌దే సిరీస్

- రోహిత్, శ్రేయాస్ పోరాటం వృథా
- స్పిన్నర్ జంపాకు నాలుగు వికెట్లు

17 ఏళ్లుగా అడిలైడ్‌లో భారత జట్టుకు ఓటమి లేదు.. పైగా ఇక్కడ వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచిన అనుభవం.. అంతేకాకుండా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి అచ్చొచ్చిన మైదానం. ఇన్ని అనుకూలతల మధ్య రెండో వన్డే బరిలోకి దిగిన టీమిండియా కచ్చితంగా నెగ్గి సిరీస్‌లో నిలుస్తుందనుకున్న ఆశలు అడియాశలే అయ్యాయి. రోహిత్ ఆకట్టుకున్నా, విరాట్ రెండోసారీ డకౌట్ కాగా.. అటు వరుసగా రెండు విజయాలతో ఆతిథ్య ఆసీస్ జట్టు సిరీస్ కూడా దక్కించుకుంది.



రోహిత్ (73)

1 విరాట్ కోహ్లీ వన్డే కెరీర్‌లో వరుసగా రెండు సార్లు డకౌట్ కావడం ఇదే తొలిసారి.

2008 తర్వాత అడిలైడ్ మైదానంలో భారత్ వన్డేల్లో ఓడడం ఇదే తొలిసారి.

అడిలైడ్: అత్యంత పటిష్ఠమైన జట్టుతో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమిండియాకు మరో పరాభవం. ఒత్తిడిని అధిగమిస్తూ వెటరన్ స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ (73) బ్యాటింగ్‌లో చెలరేగినా.. బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఫలితంగా గురువారం జరిగిన రెండో వన్డేలో ఆసీస్ రెండు వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే మూడు వన్డేల ఈ సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2-0తో దక్కించుకుంది. నామమాత్రపు ఆఖరి వన్డే శనివారం సిడ్నీలో జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 264 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (61), అక్షర్ పటేల్ (44), హర్షిత్ (24 నాటౌట్) రాణించారు. స్పిన్నర్ ఆడమ్ జంపాకు నాలుగు, పేసర్లు బార్ట్‌లెట్‌కు మూడు, స్టార్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 46.2 ఓవర్లలో 265/8 స్కోరుతో గెలిచింది. షార్ట్ (74), కూపర్ (61 నాటౌట్) అదరగొట్టారు. సుందర్, అర్ష్‌దీప్, హర్షిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఆడమ్ జంపా నిలిచాడు.

కూపర్ అజేయంగా..: ఈ పిచ్‌పై 265 పరుగుల ఛేదన కష్టమే అనిపించినా వన్‌డౌన్ బ్యాటర్ మాథ్యూ షార్ట్, మిడిలార్డర్‌లో 22 ఏళ్ల కూపర్ కనోలీ, ఓవెన్ సులువు చేశారు. భారత బౌలర్లు చివర్లో వికెట్లు తీసి ఉత్కంఠ నెలకొల్పినా.. ఛేదనకు పుష్కలంగా బంతులు మిగిలి ఉండడంతో ఆసీస్‌కు ఇబ్బంది ఎదురుకాలేదు. ఓపెనర్లు హెడ్ (28), మార్ష్ (11) విఫలమయ్యారు. అయితే షార్ట్ మాత్రం రెన్షా (30)తో మూడో వికెట్‌కు 55, కూపర్‌తో ఐదో వికెట్‌కు 55 రన్స్ జోడించి 36వ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వాత కూపర్ బాధ్యత తీసుకుని హాఫ్ సెంచరీతో అజేయంగా నిలిచాడు. ఓవెన్ సహకారంతో ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించాడు. చివర్లో విజయానికి 34 బంతుల్లో 10 రన్స్ కావాల్సిన వేళ 2 వికెట్లు కోల్పోయినప్పటికీ.. కూపర్ మరో 22 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

ఆదుకున్న రోహిత్-శ్రేయాస్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ స్కోరు 250 దాటగలిగిందంటే రోహిత్ శర్మ పోరాటమే కారణం. అతడికి శ్రేయాస్ సహకరించడంతో మూడో వికెట్‌కు 118 పరుగులు సమకూరాయి. అయితే ఆరంభంలో రోహిత్ తీవ్రంగా తడబడ్డాడు. తానెదుర్కొన్న తొలి 32 బంతుల్లో కేవలం 8 పరుగులే చేయడంతో పాటు మూడు సార్లు అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అటు పేసర్ బార్ట్‌లెట్ ఏడో ఓవర్‌లో కెప్టెన్ గిల్ (8), విరాట్ (0)ల వికెట్లు తీయడంతో భారత్ తీవ్ర ఒత్తిడిలో పడింది. ఈ దశలో రోహిత్‌కు శ్రేయాస్ జత కట్టాడు. ఆ తర్వాత రోహిత్ 19వ ఓవర్‌లో రెండు సిక్సర్లు,



జంపా (4/60)

శ్రేయాస్ ఫోర్‌తో 17 రన్స్ రాబట్టారు. ఇదే క్రమంలో ఇద్దరూ తమ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. అయితే వీరు స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరగా, అటు స్పిన్నర్ జంపా, హాజెల్‌వుడ్ మధ్య ఓవర్లలో రన్స్‌ను కట్టడి చేశారు. అక్షర్ బౌండరీలతో ఆకట్టుకున్నా మరో ఎండ్ నుంచి సహకారం అందలేదు. ఒకే ఓవర్‌లో అక్షర్, నితీశ్ (8)లను జంపా పెవిలియన్‌కు చేర్చడంతో భారీ స్కోరుపై ప్రభావం పడింది. కానీ తొమ్మిదో వికెట్‌కు హర్షిత్-అర్ష్‌దీప్ (13) జోడీ 37 పరుగులు జత చేయడంతో సవాల్ విసిరే స్కోరందుకుంది.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) హాజెల్‌వుడ్ (బి) స్టార్క్ 73, గిల్ (సి) మార్ష్ (బి) బార్ట్‌లెట్ 9, విరాట్ (ఎల్బీ) బార్ట్‌లెట్ 0, శ్రేయాస్ (బి) జంపా 61, అక్షర్ (సి) స్టార్క్ (బి) జంపా 44, రాహుల్ (బి) జంపా 11, సుందర్ (సి) హాజెల్‌వుడ్ (బి)బార్ట్‌లెట్ 12, నితీశ్ (స్టంప్) క్యారీ (బి) జంపా 8, హర్షిత్ (నాటౌట్) 24, అర్ష్‌దీప్ (బి) స్టార్క్ 13, సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 50 ఓవర్లలో 264/9. వికెట్ల పతనం:** 1-17, 2-17, 3-135, 4-160, 5-174, 6-213, 7-223, 8-226, 9-263; **బౌలింగ్:** స్టార్క్ 10-0-62-2, హాజెల్‌వుడ్ 10-2-29-0, బార్ట్‌లెట్ 10-1-39-3, ఓవెన్ 2-0-20-0, జంపా 10-0-60-4, కూపర్ 3-0-11-0, షార్ట్ 3-0-23-0, హెడ్ 2-0-16-0.

ఆస్ట్రేలియా: మార్ష్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 11, హెడ్ (సి) విరాట్ (బి) హర్షిత్ 28, షార్ట్ (సి) సిరాజ్ (బి) హర్షిత్ 74, రెన్షా (బి) అక్షర్ 30, క్యారీ (బి) సుందర్ 9, కూపర్ (నాటౌట్) 61, ఓవెన్ (సి) అర్ష్‌దీప్ (బి) సుందర్ 36, బార్ట్‌లెట్ (సి) గిల్ (బి) అర్ష్‌దీప్ 3, స్టార్క్ (సి) అక్షర్ (బి) సిరాజ్ 4, జంపా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 46.2 ఓవర్లలో 265/8. వికెట్ల పతనం:** 1-30, 2-54, 3-109, 4-132, 5-187, 6-246, 7-255, 8-260; **బౌలింగ్:** సిరాజ్ 10-0-49-1, అర్ష్‌దీప్ 8.2-0-41-2, హర్షిత్ 8-0-59-2, సుందర్ 7-0-37-2, నితీశ్ 3-0-24-0, అక్షర్ 10-0-52-1.

సెమీస్‌కు భారత్

మహిళల వరల్డ్‌కప్

53 పరుగులతో విజయం

- ప్రతీక, మంధాన శతక మోత
- న్యూజిలాండ్ అవుట్



స్మృతి మంధాన (109)

ప్రతీక రావల్ (122)

ముంబై: హ్యాట్రిక్ ఓటములతో డీలాపడిన భారత్.. మళ్లీ గెలుపు బాట పట్టింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్మృతి మంధాన (95 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 109), ప్రతీక రావల్ (134 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లతో 122) శతకాల మోతతో భారత్.. ప్రపంచ కప్‌లో సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకొంది. గురువారం జరిగిన వర్ష ప్రభావిత మ్యాచ్‌లో భారత్ 53 పరుగుల (డ/లూ పద్ధతి)తో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. మిగిలిన నాలుగో బెర్త్ హర్మన్‌సేన సొంతమవడంతో.. కివీస్ టోర్నీ నుంచి అవుటైంది. తొలుత భారత్ 49 ఓవర్లలో 3 వికెట్లకు 340 పరుగులు చేసింది. మెగా టోర్నీలో మనకిదే అత్యధిక స్కోరు. జెమీమా రోడ్రిగ్స్ (55 బంతుల్లో 11 ఫోర్లతో 76 నాటౌట్) దూకుడుగా ఆడింది. వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించారు. భారత ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత మరోసారి వరుణుడు పలకరించడంతో డక్‌వర్త్-లూయిస్ పద్ధతిలో కివీస్ లక్ష్యాన్ని 44 ఓవర్లలో 325 రన్స్‌గా సవరించారు. ఛేదనలో న్యూజిలాండ్ ఓవర్లన్నీ ఆడి 271/8 స్కోరు మాత్రమే చేసింది. హాలిడే (81), గేజ్ (65 నాటౌట్) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. రేణుక, క్రాంతి చెరో 2 వికెట్లు పడగొట్టారు.

నెమ్మదిగా మొదలెట్టి..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు ప్రతీక, మంధాన.. తొలి వికెట్‌కు 212 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ఠ పునాది వేశారు. 10 ఓవర్లలో భారత్ 40/0తో నిలిచింది. మంధాన.. జెస్ కెర్ బౌలింగ్‌లో సింగిల్‌తో టోర్నీలో తొలి శతకాన్ని నమోదు చేసింది. కానీ, స్మృతిని అవుట్ చేసి బేట్స్ జట్టుకు తొలి బ్రేక్ అందించింది. ఆ తర్వాత సింగిల్‌తో ప్రతీక శతకం సాధించగా.. జెమీమా బౌండ్రీలతో బౌలర్ల భరతం పట్టింది. కాగా, 43వ ఓవర్‌లో ప్రతీక క్యాచవుటైంది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (10) సహకారంతో ఫిఫ్టీ కొట్టిన రోడ్రిగ్స్.. జట్టు స్కోరును 300 దాటించింది.

మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధికంగా 17 శతకాలు సాధించిన మెగ్ లానింగ్ రికార్డును మంధాన సమం చేసింది. కాగా, వన్డేల్లో 14వ సెంచరీ సాధించిన స్మృతి.. లానింగ్ (15 శతకాలు) తర్వాతి స్థానంలో ఉంది.

స్కోరుబోర్డు

భారత్: ప్రతీక (సి/సబ్) రోవ్ (బి) కెర్ 122, మంధాన (సి/సబ్) రోవ్ (బి) బేట్స్ 109, జెమీమా (నాటౌట్) 76, హర్మన్‌ప్రీత్ (సి) కార్సన్ (బి) రోజ్‌మేరీ 10, రిచా ఘోష్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 49 ఓవర్లలో 340/3; వికెట్ల పతనం:** 1-212, 2-288, 3-336; **బౌలింగ్:** రోజ్‌మేరీ మెయిర్ 8-1-52-1, జెస్ కెర్ 8-1-51-0, డివైన్ 6-0-34-0, కార్సన్ 6-0-46-0, తహూహు 4-0-37-0, అమేలియా కెర్ 10-0-69-1, సుజీ బేట్స్ 7-0-40-1.

న్యూజిలాండ్: సుజీ బేట్స్ (సి) ప్రతీక (బి) క్రాంతి 1, ప్లిమ్మర్ (బి) రేణుక 30, అమేలియా కెర్ (సి) మంధాన (బి) రాణా 45, డివైన్ (బి) రేణుక 6, హాలిడే (సి) రాణా (బి) శ్రీచరణి 81, గ్రీన్ (సి) క్రాంతి (బి) ప్రతీక 18, ఇసబెల్లా (నాటౌట్) 65, జెస్ కెర్ (సి) మంధాన (బి) క్రాంతి 18, రోజ్‌మేరీ (సి) మంధాన (బి) దీప్తి 1, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 44 ఓవర్లలో 271/8; వికెట్ల పతనం:** 1-1, 2-51, 3-59, 4-115, 5-154, 6-226, 7-266, 8-271; **బౌలింగ్:** రేణుక 6-0-25-2, క్రాంతి గౌడ్ 9-0-48-2, స్నేహ్ రాణా 8-0-60-1, శ్రీచరణి 9-0-58-1, దీప్తి 8-0-57-1, ప్రతీక 4-0-19-1.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ఆస్ట్రేలియా	6	5	0	1	11	1.704
దక్షిణాఫ్రికా	6	5	1	0	10	0.276
ఇంగ్లండ్	6	4	1	1	9	1.024
భారత్	6	3	3	0	6	0.628
న్యూజిలాండ్	6	1	3	2	4	-0.490
శ్రీలంక	6	1	3	2	4	-1.035
బంగ్లాదేశ్	6	1	5	0	2	-0.578
పాకిస్థాన్	6	0	4	2	2	-2.651

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు; ఫ.తే: ఫలితం తేలనవి; ర.రే: రన్‌రేట్

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
శ్రీలంక x పాకిస్థాన్

దక్షిణాఫ్రికా ఘనవిజయం

- పాక్‌తో సిరీస్ 1-1తో సమం
- స్పిన్నర్ హార్మర్‌కు ఆరు వికెట్లు

రావల్పిండి: పాకిస్థాన్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన రెండు టెస్టుల సిరీస్ 1-1తో సమమైంది. గురువారం ముగిసిన ఆఖరి, రెండో టెస్టులో స్పిన్నర్ సిమోన్ హార్మర్ ఆరు వికెట్లతో పాక్‌ను దెబ్బతీశాడు. దీంతో సౌతాఫ్రికా 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. నాలుగో రోజు హార్మర్ ధాటికి పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 138 రన్స్‌కే పరిమితమైంది. బాబర్ ఆజమ్ (50), సల్మాన్ (28) రాణించారు. అనంతరం 68 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీలు 12.3 ఓవర్లలో 73/2 స్కోరుతో గెలిచారు. మార్‌క్రమ్ (42) వేగంగా ఆడాడు.

ఉన్నతి కూడా ఇంటికి..

ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్

సెసాన్-సెవిగ్నె (ఫ్రాన్స్): ఉన్నతి హుడా ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ప్రీక్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో ఉన్నతి 14-21, 11-21తో వాంగ్ జియి (చైనా) చేతిలో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ రోహన్/రుత్విక 23-21, 8-21, 17-21తో స్థానిక జంట థామ్ గిక్వెల్/డెల్ఫిన్ డెల్రూ చేతిలో ఓటమి పాలైంది.

ప్రపంచ రెజ్లింగ్‌లో ప్రియకు కాంస్యం

నోవి సాద్ (సెర్బియా): అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ ప్రియ పతకంతో సత్తా చాటింది. మహిళల 76 కిలోల విభాగంలో ప్రియ కాంస్యం సాధించింది. పతకపోరులో ప్రియ 8-1తో జిమెనెజ్ విలాల్బ (మెక్సికో)పై నెగ్గింది. మిగతా రెజ్లర్లలో నిషు (55 కి.), పుల్కిత్ (65 కి.), శ్రిష్టి (68 కి.) కాంస్య పోరుకు అర్హత సాధించారు.

ఆసియా యూత్ గేమ్స్ కబడ్డీలో స్వర్ణాలు

రిఫా (బహ్రెయిన్): ఆసియా యూత్ గేమ్స్‌లో భారత కబడ్డీ బాలబాలికల జట్లు స్వర్ణాలు సాధించాయి. బాలుర ఫైనల్లో భారత్ 35-32తో ఇరాన్‌ను ఓడించగా.. బాలికల జట్టు కూడా 75-21తో ఇరాన్‌నే చిత్తుచేసింది. బాలికల 5 వేల మీటర్ల రేస్ వాక్‌లో రంజన రజతం నెగ్గింది. ఇక కురాష్ ఈవెంట్‌లో భారత క్రీడాకారులు ఓ రజతం, రెండు కాంస్యాలు.. తైక్వాండోలో రెండు కాంస్యాలు సాధించారు.

ప్లీజ్.. సీసా స్కాన్ చేయండి!

- మందుబాబులను బతిమాలుతున్న ఎక్సైజ్ కానిస్టేబుళ్లు
- ఒక్కొక్కరు రోజుకు వంద స్కాన్ చేయించాలని టార్గెట్
- అవగాహన పేరుతో అధికారుల ఆదేశాలపై విమర్శలు
- మద్యం దుకాణాల వద్ద కానిస్టేబుళ్ల పడిగాపులు

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలు ఒరిజినలా? కాదా? అని నిర్ధారించుకునేందుకు ఏపీ ఎక్సైజ్ శాఖ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై వినియోగదారుల్లో అవగాహన పెంచుతోంది. యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి.. సీసాలు ఎలా స్కాన్ చేయాలనే సూచనలతో ప్రతి మద్యం దుకాణంలో పోస్టర్లు అతికిస్తోంది. అయితే, వినియోగదారులతో స్కాన్ చేయించే బాధ్యతను ఆ శాఖ కానిస్టేబుళ్లకు అప్పగించారు. ప్రతి కానిస్టేబుల్ వినియోగదారులతో స్కానింగ్ చేయించాలనే ఆదేశాలు అమల్లోకి వచ్చాయంటూ జిల్లాల అధికారులు ఈ కొత్త విధులను కానిస్టేబుళ్లకు అప్పగించారు. దీంతో 'ప్లీజ్.. సీసాలు స్కాన్ చేయండి' అంటూ కానిస్టేబుళ్లు షాపుల వద్ద మందుబాబులను బతిమాలుకునే పరిస్థితి ఏర్పడింది.

అవగాహన మంచిదే కానీ..

నకిలీ మద్యం పట్టుబడ్డ తర్వాత ఎక్సైజ్ శాఖ సురక్ష యాప్‌ను తీసుకొచ్చి వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తోంది. కానీ మందుబాబులతో దగ్గరుండి స్కాన్ చేయించే బాధ్యతను కానిస్టేబుళ్లకు అప్పగించడం మరీ అతిగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఒక్కో కానిస్టేబుల్ రోజూ కనీసం వంద మందితో సీసాలను స్కానింగ్ చేయించాలని జిల్లాల్లో అధికారులు టార్గెట్లు పెడుతున్నారు. ముందు వినియోగదారులతో యాప్ డౌన్‌లోడ్ చేయించి, ఆ తర్వాత స్కానింగ్ చేయించాలని ఆదేశిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇది మరీ ఎక్కువైంది. ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం ఆ జిల్లా పరిధిలోనే ఉండటంతో ఉన్నతాధికారుల మెప్పు కోసం అక్కడి అధికారులు మరింత అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. కాగా, పది మందిని అడిగితే అందులో ఇద్దరు ముగ్గురు మాత్రమే స్కాన్ చేస్తున్నారు.

స్మార్ట్ ఫోన్ లేకపోతే ఎలా?

రాష్ట్రంలో మద్యం తాగే వారిలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి స్మార్ట్ ఫోన్లు, యాప్‌ల వినియోగం తెలియదు. అలాంటి చోట్లే నకిలీ మద్యం లాంటి అక్రమాలు వెలుగుచూస్తుంటాయి. ప్రజలకు అవగాహన ఉన్న ప్రాంతాలను అక్రమార్కులు ఎంపిక చేసుకోరు. అలాంటి ప్రాంతాల్లో స్కానింగ్ చేయడం దాదాపుగా జరగదు. అలాంటి చోట్ల నకిలీని ఎలా గుర్తించాలనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే జిల్లాల అధికారులు యాప్‌పై అత్యుత్సాహంగా ఉంటే రాష్ట్రస్థాయి అధికారులు మాత్రం ప్రచారంపై పెద్దగా ఆసక్తి చూపట్లేదు. జిల్లాలకు ఆదేశాలు జారీచేయడం మినహా రాష్ట్రస్థాయిలో ఎలాంటి అవగాహన కార్యక్రమం చేపట్టలేదు.

పబ్లిక్ సర్వెంట్ నిర్వచనం పరిధిలోకి

వలంటీర్లు ఎలా వస్తారు?

- గౌరవ వేతనం మాత్రమే చెల్లించారు
- పిటిషనర్‌ను ప్రశ్నించిన హైకోర్టు
- పవన్ కల్యాణ్‌పై కేసు ఉపసంహరణ పిటిషన్‌ను తమ ముందు ఉంచాలని ఆదేశం

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ సర్వెంట్ నిర్వచనం పరిధిలోకి వలంటీర్లు ఎలా వస్తారని పిటిషనర్‌ను హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. సేవలు అందించినందుకుగాను ప్రభుత్వం వారికి గౌరవ వేతనం మాత్రమే చెల్లించిందని గుర్తుచేసింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై గుంటూరు కోర్టు పీపీ దాఖలు చేసిన క్రిమినల్ కేసు విచారణార్హతపై సందేహం వ్యక్తం చేసింది. పవన్ కల్యాణ్‌పై ప్రాసిక్యూషన్ ఉపసంహరణ కోసం వేసిన పిటిషన్‌ను తమ ముందు ఉంచాలని పిటిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ముందు వారాహి యాత్రలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. వలంటీర్లు సేకరించిన సమాచారం అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్తుందని, మహిళలు అపహరణకు గురౌతున్నారని అన్నారు. ఈ వ్యాఖ్యలపై గతేడాది ఫిబ్రవరిలో వైసీపీ ప్రభుత్వం ఐపీసీ సెక్షన్ 499, 500 కింద గుంటూరు కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా పవన్‌పై క్రిమినల్ కేసు దాఖలు చేసింది. అప్పట్లో కేసు వేసేందుకు అఫిడవిట్లు ఇచ్చిన ఐదుగురు వలంటీర్లు.. ఆ తర్వాత పవన్ వ్యాఖ్యల వల్ల తమ ప్రతిష్ఠకు భంగం కలగలేదని, వైసీపీ నేతలు తమ నుంచి సంతకాలు తీసుకొని పిటిషన్లు వేశారని అఫిడవిట్లు వేశారు. న్యాయాధికారి ముందు వాంగ్మూలం కూడా ఇచ్చారు. దీంతో పవన్‌పై ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు అనుమతించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుంటూరు కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో గుంటూరు నాలుగో అదనపు జిల్లా జడ్జి పవన్ కల్యాణ్‌పై ప్రాసిక్యూషన్ ఉపసంహరణకు అనుమతిస్తూ గతేడాది నవంబరులో ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సరళ, మరో ముగ్గురు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. కేసు ఉపసంహరణకు అనుమతించే అధికార పరిధి గుంటూరు కోర్టుకు లేదన్నారు. విజయవాడ ఎంపీ, ఎమ్మెల్యేల కోర్టు పరిధిలోకి ఈ వ్యవహారం వస్తుందన్నారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ ఘటన జరిగే నాటికి పవన్ కల్యాణ్ ప్రజాప్రతినిధి కాదు కదా? అని ప్రశ్నించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ... క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేసే అర్హత పిటిషనర్లకు లేదని, పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.

'స్వయం సహాయం'లో ఏపీ ఫస్ట్

- అత్యధికంగా రూ.34.83 లక్షల కోట్ల పంపిణీ
- రెండు, మూడు స్థానాల్లో యూపీ, బిహార్

న్యూఢిల్లీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళల సంక్షేమంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. మహిళా సాధికారత, సంఘాలకు రుణాల అందజేయడంలో రోల్ మోడల్‌గా మారింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మహిళా సాధికారత, రుణాల అందజేత, వ్యాపారాభివృద్ధి తదితర అంశాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతోంది. మహిళా బృందాల్లోని సభ్యులకు పెద్దఎత్తున రుణాలు ఇవ్వడంతో పాటు వాటి ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో ఏపీ మొదటిస్థానంలో నిలిచింది. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆంధ్రప్రదేశ్ రూ.34,83,725 కోట్లు అందజేసి అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో రూ.1,23,326 కోట్లు అందజేసి ఉత్తరప్రదేశ్ రెండోస్థానంలో, రూ.1,05,132 కోట్లు పంపిణీ చేసి బిహార్ మూడోస్థానంలో నిలిచాయి. అలాగే, స్థిరమైన జీవనోపాధిని ప్రోత్సహించడం, వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలకు సంబంధించి మహిళా రైతులను ప్రోత్సహించడంలోనూ ఆంధ్రప్రదేశ్ తనదైన ముద్ర వేసింది. 12,97,051 మంది మహిళ లకు చేయూతనిచ్చి మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలవగా, 11,37,950 మంది మహిళా రైతులను మద్దతుగా నిలిచి ఉత్తరప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. 10,43,085 మంది మహిళా రైతులకు చేయూతనిచ్చి ఆంధ్రప్రదేశ్ మూడోస్థానంలో నిలిచింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

చిరంజీవి వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు భంగం కలిగించొద్దు

● కోర్టు ఆదేశం

చిరంజీవికి సిటీ సివిల్ కోర్టులో ఊరట లభించింది. ఆయన అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం ఫొటోలు, బిరుదులు వాడుకోవడాన్ని నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన వ్యక్తిత్వ, ప్రచార హక్కులకు రక్షణ కల్పిస్తూ జడ్జి ఎస్.శశిధర్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల ప్రకారం.. ఆన్‌లైన్ దుస్తుల సంస్థలు, డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల సహా ఏ సంస్థ కూడా చిరంజీవి పేరు, 'మెగాస్టార్', 'చిరు' వంటి బిరుదులు, ఆయన ఫొటోలు, వాయిస్‌ను వ్యాపార ప్రకటనల కోసం వినియోగించకూడదు. పలు సంస్థలు అనుమతి లేకుండా తన గుర్తింపును వాడుకుంటూ వాణిజ్యపరంగా లబ్ధి పొందుతున్నాయని చిరంజీవి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన కోర్టు తక్షణమే ఉల్లంఘనలను ఆపాలని ఆదేశిస్తూ స్టే మంజూరు చేసింది. తదుపరి విచారణను ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది.



ఒకే ఫ్రేమ్‌లో... వెంకీ, చిరు

టాలీవుడ్ దిగ్గజాలు చిరంజీవి, వెంకటేశ్ కలసి ఒక సినిమా చేస్తే చూడాలనేది ఎన్నాళ్లగానో వారిద్దరి అభిమానుల కల. ఒకే ఫ్రేమ్‌లో వారిద్దరూ కలసి కనిపించే ఆ తరుణం ఆసన్నమైంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా రూపొందుతున్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంలో వెంకటేశ్ కీలకపాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో చిత్రీకరణ జరుగుతోంది. గురువారం వెంకటేశ్ ఈ చిత్రం సెట్స్‌లోకి అడుగుపెట్టారు. వారిద్దరిపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన వీడియోలో వెంకటేశ్‌కు చిరంజీవి స్వాగతం చెబుతుండగా, ఆయన్ను వెంకటేశ్ ఆత్మీయంగా హత్తుకున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్ర్కీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. అర్చన సమర్పిస్తున్నారు. ఇందులో చిరంజీవి పాత్రచిత్రణ నవ్యపంథాలో ఉండబోతోంది. ఆయనకు జోడీగా నయనతార నటిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సమీర్‌రెడ్డి.

అత్యంత ధైర్యవంతుడైన సైనికుడి కథ



ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు తీపి కబురు అందింది. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రభాస్, హను రాఘవపూడి సినిమా టైటిల్‌ను 'ఫౌజీ'గా మేకర్స్ ప్రకటించారు. ఈ టైటిల్ చిత్రం ప్రారంభమైన నాటి నుంచి ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మేకర్స్ ప్రభాస్‌కు బర్త్‌డే విషెస్ తెలిపారు. 'పద్మవ్యూహాన్ని ఛేదించిన అర్జునుడు.. పాండవుల పక్షాన నిలిచిన కర్ణుడు.. గురువులేని ఏకలవ్యుడు.. పుట్టుకతోనే అతను ఓ యోధుడు.. మన చరిత్రలో దాగిన అత్యంత ధైర్యవంతుడైన సైనికుడి కథ ఇది' అని పేర్కొన్నారు. ఇమాన్వీ కథానాయిక. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాను నిర్మిస్తున్నారు.

సినిమాను పండుగలా...



'సినిమాను పండుగలా మార్చే వ్యక్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు' అని 'రాజాసాబ్' చిత్రబృందం ప్రభాస్‌కు విషెస్ తెలిపింది. ఈ సందర్భంగా ఓ స్టైలిష్ పిక్‌ను విడుదల చేసింది. ఇందులో చుట్టూ జన సమూహం మధ్యలో ఓపెన్ టాప్ కారులో ప్రభాస్ ఇస్తున్న పోజు ప్రస్తుతం అందర్నీ ఆకట్టుకుంటోంది. ఆయన కథానాయకుడిగా మారుతి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 9న విడుదల కానుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ హారర్ కామెడీ థ్రిల్లర్‌ను నిర్మిస్తున్నారు. మరోవైపు, ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం.

శ్రీవిష్ణుకు జోడీగా...



విభిన్నమైన కథాంశాలను ఎంపిక చేసుకుంటూ తన ప్రతీ సినిమాతో ప్రేక్షకులకు గొప్ప వినోదాన్ని అందిస్తున్నారు కథానాయకుడు శ్రీవిష్ణు. ప్రస్తుతం ఆయన హీరోగా కొత్త దర్శకుడు యధునాథ్ మారుతీరావు 'ఎస్ఎస్‌సీ నంబర్ 3' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బేనర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. ఇందులో శ్రీవిష్ణు సరసన నయన్ సారిక కథానాయికగా నటించనున్నట్లు దర్శకనిర్మాతలు ప్రకటించారు. గురువారం నయన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ చిత్ర యూనిట్ ఓ ప్రత్యేక వీడియోని విడుదల చేసింది. ఒంగోలు పట్టణం నేపథ్యంలో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రంలో సత్య, బ్రహ్మాజీ, ప్రవీణ్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

కుటుంబ కథా చిత్రం




కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా నటిస్తున్న చిత్రం 'దీక్ష'. ఆర్‌కే ఫిల్మ్స్ బేనర్‌పై ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వంలో పి.అశోక్‌కుమార్ నిర్మిస్తున్నారు. డీఎస్ గౌడ్ సమర్పిస్తున్నారు. తాజాగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్‌కే గౌడ్ మాట్లాడుతూ 'ఇదొక అందమైన కుటుంబ కథా చిత్రం. త్వరలోనే ఓ ప్రత్యేక పాటను చిత్రీకరించనున్నాం. ఒక మనిషి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనే మంచి పాయింట్‌తో మీ ముందుకు తెస్తున్నాం' అని అన్నారు. ఆక్స ఖాన్, తులసి, అనూష, కీర్తన కీలక పాత్రలు పోషిస్తున్నారు.



డబుల్ సెలబ్రేషన్

● కవలలకు జన్మనివ్వనున్న రామ్‌చరణ్ ఉపాసన దంపతులు



రామ్‌చరణ్-ఉపాసన దంపతులు అభిమానులకు శుభవార్త చెప్పారు. వారిద్దరూ రెండోసారి తల్లిదండ్రులవబోతున్నారు. ఈసారి ఉపాసన కవలలకు జన్మనివ్వబోతున్నారు. ఈ విషయాన్ని గురువారం వారి పీఆర్ టీమ్ ధ్రువీకరించింది. అలాగే తన సీమంతం వేడుక వీడియోను షేర్ చేసిన ఉపాసన మరోసారి తల్లి కాబోతున్న ఆనందాన్ని పంచుకున్నారు. 'ఈ దీపావళి మా ఇంట ఆనందాన్ని రెండింతలు చేసింది, రెట్టింపు ఆశీర్వచనాలు అందాయి' అని ఆనందం వ్యక్తం చేశారు. దీపావళి రోజున చిరంజీవి తన నివాసంలో నిర్వహించిన పండుగ వేడుకలకు మెగా కుటుంబ సభ్యులతో పాటు, బంధువులు, పలువురు సినీ నటులు హాజరయ్యారు. అప్పుడే ఉపాసన సీమంతం వేడుకలను చిరంజీవి ఘనంగా నిర్వహించినట్లు తెలుస్తోంది. 2023లో ఉపాసన తొలికాన్పులో పాప క్లీంకారాకు జన్మనిచ్చారు.

అంచనాలు రెట్టింపు



సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'త్రిముఖ'. రాజేశ్ నాయుడు దర్శకత్వంలో అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బేనర్‌పై శ్రీదేవి మద్దాలి, రమేశ్ మద్దాలి నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన చిత్ర టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. నెట్టింట ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. దీంతో సినిమాపై అంచనాలు రెట్టింపు అయ్యాయి. 'త్రిముఖ' సినిమా పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న అద్భుతమైన ప్రేమతో మేము ఎంతో సంతోషంగా ఉన్నాం. ఇది మా కష్టానికి నిదర్శనం. మంచి కంటెంట్‌కు ఆదరణ ఎప్పుడూ ఉంటుందని మరోసారి రుజువవుతోంది' అని చిత్రబృందం పేర్కొంది.

జగన్ ఇంట్లో కూర్చుని మాట్లాడితే కుదరదు

- ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననడం సరికాదు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా
- నేనూ ఆయన అభిమానినే.. డిప్యూటీ స్పీకర్ రఘురామ



సీతమ్మధార (విశాఖపట్నం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ తనకు భయపడి అసెంబ్లీకి రావడం లేదని తాను అనుకోవడం లేదని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు అన్నారు. ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాననే వాదన సమంజసం కాదని, ఆయన ఇంట్లో కూర్చుని మాట్లాడితే కుదరదని అన్నారు. విశాఖ నగరం సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రఘురామ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా వచ్చేదీ లేనిదీ.. వచ్చే ఎన్నికల తర్వాతే తేలుతుందన్నారు. అయితే జగన్ ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షానికి నాయకుడిగా కూడా సభకు రావొచ్చని, వస్తేనే సమాధానం లభిస్తుందని అన్నారు. ఇంట్లో కూర్చుని మాట్లాడితే దానికి సమాధానం చెప్పాలా..? అని ప్రశ్నించారు. 'జగన్ ఇంట్లో ఆయన... మా ఇంట్లో నేను మాట్లాడుకుంటే ఏం ఉపయోగం. అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి' అని హితవు పలికారు. పవన్‌కల్యాణ్ బాధ్యతగల మంత్రిగా, ప్రజాప్రతినిధిగా ఆలోచించి డీఎస్పీపై ఫిర్యాదు చేశారని రఘురామ అన్నారు. ఆయన అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నానని చెప్పారు. తాను డిప్యూటీ స్పీకర్‌గా కాకుండా.. ఆ ప్రాంత ఎమ్మెల్యేగా మాట్లాడానని అన్నారు. తానూ పవన్ అభిమానినేనని.. కొందరు అభిమానులు తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారు. భీమవరం డీఎస్పీని సపోర్టు చేయడం లేదని, ఆయన గురించి తన వద్ద ఉన్న సమాచారం మేరకే మాట్లాడానని వెల్లడించారు.

ఆ డీఎస్పీకి రఘురామ కితాబు సరికాదు: కొత్తపల్లి



నరసాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విచారణను ఎదుర్కొంటున్న డీఎస్పీ జయసూర్యకు కితాబు ఇస్తూ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడటం సరికాదని కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. నరసాపురంలోని తన నివాసంలో కొత్తపల్లి విలేకరులతో మాట్లాడారు. 'ఆర్ఆర్ఆర్ మాటలతో విచారణపై ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది. పేకాట క్లబ్‌లు, సెటిల్‌మెంట్లు, ఇతర అంశాల్లో డీఎస్పీ జయసూర్యపై వచ్చిన ఆరోపణపై డిప్యూటీ సీఎం హోదాలో విచారించి నివేదిక ఇవ్వమని కోరారే తప్ప ముందస్తుగా చర్యలు తీసుకోమని చెప్పలేదు. పవన్ ఇచ్చిన ఆదేశాలతో విచారణ జరుగుతుండగా రఘురామకృష్ణరాజు, డీఎస్పీ మంచివాడని కితాబివ్వడం సరికాదు. డిప్యూటీ స్పీకర్ హోదాలో పేకాట క్లబ్‌ల గురించి పబ్లిక్‌గా మాట్లాడం సరికాదు. పశ్చిమ గోదావరి జిల్లాలో పేకాట సహజమని చెప్పడం వల్ల ఇక్కడి ప్రజలపై తప్పుడు భావన వెళ్లే ప్రమాదం ఉంది. డిప్యూటీ సీఎంకు, రఘురామకృష్ణరాజుకు మంచి స్నేహం ఉంది. పబ్లిక్‌గా మాట్లాడకుండా నేరుగా పవన్‌తో చర్చించి ఉంటే బాగుండేది' అని కొత్తపల్లి హితవు పలికారు.

'మీ మూలధనం- మీ హక్కు'పై ప్రచారం

- బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లపై నేటి నుంచి అవగాహన

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భారత ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో 'మీ మూలధనం- మీ హక్కు' (యువర్ మనీ- యువర్ రైట్) అనే ప్రత్యేక ప్రచారాన్ని చేపడుతున్నట్లు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి వెల్లడించింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో ఉన్న క్లెయిమ్ చేయని(అన్ క్లెయిమ్డ్) డిపాజిట్లను వాటి ఖాతాదారులు లేదా హక్కుదారులు తిరిగి పొందే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించనుంది. దీనిపై రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం.. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి అన్ని జిల్లా కేంద్రాల్లో.. క్లెయిమ్ చేయని డిపాజిట్లపై బ్యాంకులు, బీమా సంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేసి, ఖాతాదారులకు నిద్ర ఖాతాలు, క్లెయిమ్ చేయని డిపాజిట్లు, వాటిని తిరిగి పొందే విధానంపై అవగాహన కల్పిస్తారు. రెండు, మూడు విడతల్లో భాగంగా నెల్లూరు, ఏలూరు, శ్రీకాకుళం జిల్లాలోనూ ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. అలాగే షార్ట్ ఫిల్మ్ ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించనున్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని భాస్కరరావు సూచించారు. తద్వారా బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో ఉన్న క్లెయిమ్ చేయని డిపాజిట్లు నిజమైన లబ్ధిదారులకు చేరేలా చేసి, భారత ప్రభుత్వ 'మీ మూలధనం- మీ హక్కు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మా చర్యలే బలంగా మాట్లాడతాయి

- జేసీ ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలకు అనంత డీఐజీ షిమోషి కౌంటర్

అనంతపురం క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసుల మాటల కంటే చర్యలు బలంగా మాట్లాడతాయని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి కీలక వ్యాఖ్యలు చేశారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఆమె గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఏఎస్పీ రోహిత్ కుమార్‌పై జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన అవమానకర, అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. ఆ వ్యాఖ్యలు పోలీసుల విధి నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలిగించలేవు. పోలీసుల నిబద్ధతను, మనోధైర్యాన్ని దెబ్బతీయలేవు. ఆలిండియా సర్వీస్ సభ్యులుగా దేశానికి, పౌరులకు సేవ చేయడమే మా ప్రధాన ధ్యేయం. మతం, ప్రాంతం, కులం, వర్ణం మొదలైన ఏ తేడాలూ పోలీసుల సేవా ధోరణిని ప్రభావితం చేయలేవు. మా దృష్టిలో రాజ్యాంగం, చట్టాలు అత్యున్నతమైనవి. ఒక ఐపీఎస్ అధికారిని, లేదా ఒక ప్రభుత్వ ఉద్యోగిని అవమానకర భాషలో సంబోధించడం పరిపాలనా ప్రమాణాలకు విరుద్ధం. శాంతి, భద్రత, చట్టాల స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుంది' అని డీఐజీ పేర్కొన్నారు.

సీజేఐపై దాడి ఘటనలో కేసు నమోదు ఏదీ?

- 1న దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ: మంద కృష్ణమాదిగ

విజయవాడ (గాంధీనగర్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై కోర్టులోనే దాడి జరిగి 12 రోజులు గడుస్తున్నా నేటి వరకు నిందితుడిపై కేసు ఎందుకు నమోదు చేయలేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రశ్నించారు.. దీనిని నిరసిస్తూ, హైదరాబాద్‌లో నవంబరు 1న దళితుల ఆత్మగౌరవ నిరసన ర్యాలీ చేపడుతున్నట్టు పేర్కొన్నారు. త్వరలో ఢిల్లీలోనూ నిరసన చేపడతామని ప్రకటించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'దళితుడైన జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని దళిత జాతిపై జరిగిన దాడిగా భావిస్తున్నాం. ఈ దాడి చేసిన నిందితుడితో పాటు అతడి వెనుక ఉన్న శక్తులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలి. అత్యున్నత స్థానంలోని దళితుడిపైనే దాడి జరిగితే సామాన్యుల పరిస్థితి ఏమిటి? గవాయ్ స్థానంలో అగ్రకులాలకు చెందిన వ్యక్తి ఉంటే పోలీసులు ఇలానే నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారా? దళితులు ఎంత ఉన్నతస్థానంలో ఉన్నప్పటికీ వివక్షకు గురి కాక తప్పదా?' అని పేర్కొన్నారు.



టాస్మేనియా యూనివర్సిటీ ప్రతినిధులతో మంత్రి లోకేశ్



మెల్‌బోర్న్ యూనివర్సిటీ ప్రతినిధులతో చర్చిస్తున్న లోకేశ్

క్వాంటమ్ రిసెర్చ్‌లో
భాగస్వాములవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కల్పించే కార్యక్రమాలు, పాఠ్యాంశాలు రూపొందించాలని ఆయన కోరారు. 'రాష్ట్రం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న క్వాంటమ్ రీసెర్చ్‌లో భాగస్వాములవండి. పునరుత్పాదక ఇంధనం, వ్యవసాయ, ఆరోగ్య రంగాల్లో సలహాలు, సూచనలు చేస్తూ మార్గనిర్దేశం చేయండి. రాష్ట్రాభివృద్ధి లక్ష్యాల సాధనలో సహకరించండి. పంట దిగుబడులు పెరిగేలా నీటి నిర్వహణ, సుస్థిర వ్యవసాయ విధానాలు మెరుగుపరచడంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలసి పరస్పరం సహరించుకునేలా కార్యాచరణ రూపొందించాలి. స్థానిక సంస్థలను భాగస్వాములను చేసి డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్, టెలి-మెడిసన్ ద్వారా ఆరోగ్య సేవలను మెరుగుపరిచేందుకు మెల్‌బోర్న్ వర్సిటీ సహకారాన్ని అర్థిస్తున్నాం. స్మార్ట్ సిటీ ప్లానింగ్, వ్యర్థ నిర్వహణ, పునరుత్పాదక విద్యుత్ రంగాల్లో నైపుణ్యాలను పంచి రాష్ట్రాభివృద్ధికి మద్దతుగా నిలవండి' అని కోరారు.



విక్టోరియా రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖల మంత్రి స్టీవ్ డిమోపౌలోస్‌తో చర్చిస్తున్న లోకేశ్

హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి సహకరించండి

ఏపీలో హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి సహకరించాలని విక్టోరియా రాష్ట్ర పర్యావరణ, పర్యాటక, స్పోర్ట్స్ శాఖల మంత్రి స్టీవ్ డిమోపౌలోస్‌ను లోకేశ్ కోరారు. క్రికెట్, హాకీల్లో ఉమ్మడి శిక్షణా శిబిరాలు, ఫ్రెండ్లీ మ్యాచ్‌లు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నూతన ఆలోచనలను అందించాలని కోరారు. వారసత్వ పర్యాటకానికి విక్టోరియా ప్రసిద్ధి చెందిందని.. తమ రాష్ట్రంలోనూ పాపికొండలు, విశాఖ బీచ్ వంటి సుందర ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షిస్తాయని లోకేశ్ వివరించారు. ఈ ప్రాంతాల్లో పర్యటించి టెంపుల్ టూరిజం, వారసత్వ టూరిజం అభివృద్ధికి తగిన సలహాలూ సూచనలూ చేయాలని కోరారు. గ్రేట్ ఓషన్ రోడ్ తరహా పర్యావరణ బ్రాండింగ్‌కు విక్టోరియా నమూనాగా నిలించిందని.. ఈ నైపుణ్యాన్ని తమకూ అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖతో కలసి హెరిటేజ్ టూరిజం, మార్కెటింగ్, ఎకో సర్టిఫికేషన్స్‌పై కలసి పనిచేయాలని ప్రతిపాదించారు. రాష్ట్రానికి 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఉందని, విక్టోరియా పోర్ట్ ఫిలిప్ బే ప్రాజెక్టు తరహాలో వాతావరణ సాంకేతికతను ఉపయోగించి ఏపీ తీరప్రాంత అభివృద్ధిపై ఉమ్మడి పరిశోధన- అభివృద్ధి, కార్యాచరణ చేపట్టాలని డిమోపౌలోస్‌ను కోరారు. విక్టోరియా సర్క్యులర్ ఎకానమీకి చేయూతనిస్తున్న వ్యర్థాల నిర్వహణ, కార్బన్ న్యూట్రల్ టూరిజం తరహాలో రాష్ట్రంలోనూ అంతర్జాతీయ కార్యకలాపాలు చేపట్టేలా సహకరించాలని విజ్ఞప్తిచేశారు. ఆంధ్రప్రదేశ్, విక్టోరియాల్లో క్రికెట్, హాకీ వంటి క్రీడలకు చెందిన ఉమ్మడి శిక్షణ శిబిరాలు, స్నేహపూర్వక మ్యాచ్‌లను నిర్వహించాలని అభ్యర్థించారు. పరస్పర సహకారంతో స్పోర్ట్స్ సైన్స్‌ను అమలు చేయాలన్నారు. విక్టోరియా అడ్వెంచర్ టూరిజంను రాష్ట్రానికి పరిచయం చేయాలని.. టూరిజం గవర్నెన్స్ తరహాలో అరకులో ట్రెక్కింగ్, పులికాట్‌లో వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేయాలని కోరారు. విక్టోరియా సంస్థల ద్వారా అడ్వెంచర్ గైడ్స్, రేంజర్ల సర్టిఫికేషన్స్, నైపుణ్యాభివృద్ధికి సహకారం అందించాలని ప్రతిపాదించారు. విక్టోరియా ఆఫ్‌షోర్ విండ్, సోలార్ రెన్యువల్ ప్రాజెక్టులు విజయవంతంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో యువతకు గ్రీన్ లాబ్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో సహకారం అందించాలని కోరారు.

ఫార్మసీ, పారామెడికల్ కోర్సుల్లో పాఠ్యాంశాలు..

యూనివర్సిటీ ఆఫ్ టాస్మేనియాను కూడా గురువారం లోకేశ్ సందర్శించారు. వర్సిటీ డిప్యూటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నలాలీ బ్రౌన్, స్కూల్ ఆఫ్ ఫార్మసీ అండ్ ఫార్మకాలజీ హెడ్ గ్రైన్ జాక్సన్‌తో చర్చలు జరిపారు. ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఆస్ట్రేలియాలో అమలు చేస్తున్న కఠిన అక్రిడిటేషన్ వ్యవస్థల తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ ఫార్మసీ, పారామెడికల్ కోర్సుల్లో పాఠ్య ప్రణాళిక అభివృద్ధికి సహకరించాలని లోకేశ్ కోరారు. 'ఈ కోర్సులకు సంబంధించిన శిక్షణలో డిజిటల్ హెల్త్ టూల్స్ (ఏఐ)ను అనుసంధించాలి. ఆంధ్రప్రదేశ్‌లోని వైద్య కళాశాలలు, స్కిల్ వర్సిటీకి, ఫార్మా/హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌ను అందించే పరిశ్రమలకు సాంకేతిక నైపుణ్యాన్ని అందించండి. ఉమ్మడి పరిశోధనలు చేపట్టేందుకు సహకరించండి. ఏపీలోని నర్సింగ్, ఫార్మసీ విద్యార్థుల కోసం స్టూడెంట్/ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు చేపట్టాలి. ఆస్ట్రేలియా అర్హతలకు అనుగుణంగా ఏపీ ఫార్మసీ విద్యార్థుల స్కిల్ సర్టిఫికెట్‌ను బెంచ్‌మార్క్ చేయాలి' అని విజ్ఞప్తి చేశారు.

విశాఖలో జీసీసీ.. మల్టీనేషనల్ హెల్త్ కేర్ అండ్ ఇన్సూరెన్స్ సంస్థ లేసా ఆసియా పసిఫిక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో) బిజల్ సెజ్‌పాల్, ఎంటర్‌ప్రైజెస్ ఇంటెలిజెన్స్ హెడ్ దినేశ్ కంతేటితో లోకేశ్ సమావేశమయ్యారు. ఐటీ, డేటా సెంటర్ రంగాల్లో శరవేగంగా విస్తరిస్తున్న విశాఖలో లుపా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామీణ డిజిటల్ ఆరోగ్య సేవల కోసం రాష్ట్రంతో కలసి పనిచేయాలని అభ్యర్థించారు.

వివేకా హత్య కేసులో..
నిందితులకు సీబీఐ కోర్టు
నోటీసులు

- 'తదుపరి దర్యాప్తు'పై 27లోపు అభిప్రాయాలు చెప్పాలని ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు సంబంధించి అభిప్రాయాలు తెలియజేయాలని నిందితులకు సీబీఐ కోర్టు నోటీసులు జారీచేసింది. తన తండ్రి హత్యకు సంబంధించి ఇంకా వెలుగు చూడాల్సిన అనేక విషయాలు ఉన్నాయని, సీబీఐ లోతుగా దర్యాప్తు చేయకుండా వదిలేసిందని పేర్కొంటూ వివేకా కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై గురువారం నాంపల్లి సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి టి.రఘురాం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున న్యాయవాది ఎస్.గౌతమ్ వాదనలు వినిపించారు. 'తదుపరి దర్యాప్తు చేయాలన్న మా పిటిషన్‌ను విచారణార్హత పేరిట తిరస్కరించరాదని సుప్రీంకోర్టు నిర్దేశించింది. అందరి వాదనలూ విని 8వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది' అని తెలిపారు. కాగా, పిటిషన్‌పై తేల్చడానికి సుప్రీంకోర్టు సమయం నిర్దేశించిన నేపథ్యంలో ఈ నెల 27లోపు కౌంటర్లు దాఖలు చేయాలని నిందితులు టి.గంగిరెడ్డి (ఏ1), సునీల్ యాదవ్(ఏ2), ఉమాశంకర్‌రెడ్డి(ఏ3), దస్తగిరి (ఏ4-అప్రూవర్), దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి (ఏ5), గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఏ6), వైఎస్ భాస్కర్‌రెడ్డి (ఏ7), కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డితోపాటు ప్రతివాదిగా ఉన్న సీబీఐకి కూడా ఆదేశాలు జారీచేశారు. తదుపరి విచారణను 27కు వాయిదా వేశారు. మరోవైపు వివేకా హత్యకు సంబంధించిన ప్రధాన కేసు సైతం గురువారం విచారణకు వచ్చింది. నిందితులు గంగిరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి కోర్టుకు హాజరుకాగా మిగతావారు రాలేదు. తదుపరి విచారణ నవంబరు 10కి వాయిదా పడింది.

జగన్‌కు మద్యంపై మాట్లాడే అర్హత లేదు: అచ్చెన్న

శ్రీకాకుళం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యంపై మాట్లాడే నైతిక అర్హత జగన్‌రెడ్డికి ఎక్కడుందని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో గురువారం విలేకరులతో మంత్రి మాట్లాడారు. 'కల్తీ మద్యం తయారీ దారులను పట్టుకున్నదే మా ప్రభుత్వం. నిందితుల్లో టీడీపీ నాయకులుంటే వారిని సస్పెండ్ చేశాం. ఓ వైపు గంజాయి, మరోవైపు కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని గత ఐదేళ్లు జగన్‌రెడ్డి భ్రష్టు పట్టించేశారు. అప్పట్లో లిక్కర్ మాఫియా నడిపి రూ.3,600 కోట్ల అవినీతికి పాల్పడ్డారు. గత ప్రభుత్వం మద్యం తయారీ కంపెనీలన్నింటినీ జగన్ గుప్పెట్లో పెట్టుకొని 'జే-బ్రాండ్' పేరిట మద్యం తయారు చేశారు. కల్తీ మద్యం తయారు చేసిన వారిపై కనీస చర్యలు తీసుకోలేదు. కల్తీ మద్యంలోని వాస్తవాలను బయటకు తీసేందుకు ప్రత్యేక సిట్ ఏర్పాటు చేశాం. ప్రజారోగ్యమే మాకు ముఖ్యం. ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతీయాలని చూస్తే ఉపేక్షించేదిలేదు' అని అచ్చెన్న స్పష్టం చేశారు.

గూగుల్ డేటా సెంటర్‌ను
స్వాగతిస్తున్నా
రాబోయేది క్వాంటమ్ ఏఐ యుగం



- డేటా సెంటర్‌తో ఎకో సిస్టమ్ ఏర్పడుతుంది
- పర్యావరణానికి ముప్పు ఉండదు
- సెంటర్‌కు నా హయాంలోనే అంకురార్పణ
- మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలు

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటును మాజీ సీఎం జగన్ ఎట్టకేలకు స్వాగతించారు. తాడేపల్లి నివాస ప్రాంగణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం సానుకూల మీడియా ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పుడు నడుస్తున్నదే గాక రాబోయేది కూడా క్వాంటమ్ ఏఐ యుగమేనని తెలిపారు. ఇటువంటి సమయంలో రాష్ట్రానికి డేటా సెంటర్లు రావడం ఆహ్వానించదగ్గ పరిణామమని, ఈ సెంటర్ల వల్ల ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుందన్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని వస్తున్న విమర్శల్లో నిజం లేదన్నారు. పర్యావరణ ముప్పు ఉంటుందని ఎవరంటున్నారో వాళ్లనే ఆ విషయం అడగాలని ఓ ప్రశ్నకు సమాధానంగా విలేకరులపై అసంతృప్తి వ్యక్తంచేశారు. తామెప్పుడూ గూగుల్ డేటా సెంటర్‌ను వ్యతిరేకించలేదన్న ఆయన, డేటా సెంటర్‌ను తమ హయాంలోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. డేటాసెంటర్‌ను అదానీ గ్రూపు నిర్మిస్తుందని, ఆ తర్వాత గూగుల్ ఇక్కడకు వస్తుందని తెలిపారు. తానే డేటా సెంటరును తెచ్చినట్లుగా సీఎం చంద్రబాబు చెబుతుండటం సరికాదని, అదానీకి ఆయన కనీసం కృతజ్ఞతలు కూడా చెప్పలేదని విమర్శించారు. 'ఎఫిషియెన్సీ వీక్.. వేరేవాళ్ల క్రెడిట్ చోరీ చేయడంలో పీక్' అంటూ చంద్రబాబుపై అవాకులుచెవాకులు మాట్లాడారు. "2023 మే 3న అదానీ డేటా సెంటర్‌కు విశాఖలో శంకుస్థాపన చేశాం. సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌ను సింగపూర్ నుంచి తీసుకువచ్చే కార్యక్రమానికి అప్పుడే అంకురార్పణ జరిగింది" అని తెలిపారు. చంద్రబాబు పాలనను గాలికి వదిలేశారని, ఒక యాడ్ ఏజెన్సీ రాష్ట్రంలో నడుస్తున్నట్లుందని జగన్ విమర్శించారు. తనను సైకో అంటూ విమర్శించిన ఎమ్మెల్యే బాలకృష్ణ ఆ రోజున అసెంబ్లీకి తాగివచ్చారని, అలాంటి వ్యక్తిని స్పీకర్ ఎలా అనుమతించారో తెలియట్లేదన్నారు.

జనార్దనరావును జయచంద్రారెడ్డిని వదిలేశారెందుకు?

రాష్ట్రమంతా కల్తీ మద్యం పారుతోందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. తమ వారెక్కడ నుంచి వస్తున్నా విమానాశ్రయంలోనే పట్టుకుని అరెస్టు చేసే పోలీసులు... తంబళ్లపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన జయచంద్రారెడ్డిని మాత్రం ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. మరో నిందితుడు జనార్దనరావును ఎందుకు వదిలేశారంటూ ఆయన అసహనం వ్యక్తంచేశారు. తనకు అనుకూలుడైన అధికారిని సిట్‌కు అధిపతిగా నియమించారని, సీబీఐతో దర్యాప్తు చేయిస్తే నకిలీ మద్యం మూలాలన్నీ బయటకు వస్తాయన్నారు.

ఇవేం పిల్లిమొగ్గలు!?

(మొదటి పేజీ తరువాయి)

మరొకరు భయపెట్టారు. 'అబ్బే... అది వేస్ట్. దానివల్ల ఉద్యోగాలేవీ రావు' ఇంకొకరు గేలి చేశారు. రేడియేషన్ రూపంలో భారీ ఉష్ణోగ్రత బయటకు వస్తుందని, వాతావరణం కలుషితమవుతుందని, కూలింగ్ స్టేషన్ల కోసం భారీగా నీరు కావాలని ప్రజలను భయాందోళనకు గురిచేసేందుకు ప్రయత్నించారు. సముద్ర నీటిని శుద్ధిచేసి డేటా సెంటర్లకు వాడుకుంటారని కూడా తప్పుడు కథనాలను వండి జనంపైకి వదిలారు. అటు జగన్‌రోత మీడియా... ఇటు వైసీపీ అనుకూల సోషల్ మీడియాలో దీనిపై పుంఖానుపుంఖాలుగా కథనాలు వండివార్చారు.

అసూయ... అసహనం..

విశాఖలో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుపై ఈనెల 14వ తేదీన కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వనీ వైష్ణవ్ సమక్షంలో గూగుల్ ప్రతినిధులతో ఒప్పందం కుదిరింది. ఐదేళ్లలో 1.36 లక్షల కోట్ల పెట్టుబడి... దశలవారీగా నాలుగు గిగావాట్ల సామర్థ్యంతో దీనిని నిర్మిస్తామని గూగుల్ ప్రకటించింది. ఆ వెంటనే ప్రపంచమంతా ఒక్కసారిగా విశాఖ వైపు చూపు సారించింది. ఇతర రాష్ట్రాలు ఏపీని చూసి ఈర్ష్యకు లోనయ్యాయి. గూగుల్ రాకతో విశాఖకు మరిన్ని కంపెనీలు తరలి వస్తాయని... దీనికి అనుకూలమైన ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. ప్రపంచమంతా మెచ్చుకున్నప్పటికీ.... వైసీపీకి మాత్రం గూగుల్ రాక నచ్చలేదు. దీనిపై రాష్ట్ర ప్రజలను గందరగోళంలోకి నెట్టే ప్రయత్నం బలంగా జరిగింది. కానీ... ఎంత బురదచల్లినా ఫలితం కనిపించలేదు. జగన్‌కు ఉన్న 'ట్రాక్ రికార్డు' వల్ల కాబోలు... వైసీపీ దుష్ప్రచారాన్ని జనం నమ్మలేదు. దీంతో... ప్లేటు తిప్పక తప్పలేదు. గూగుల్ డేటా సెంటర్‌పై ఇదే స్థాయిలో దుష్ప్రచారం కొనసాగిస్తే, ప్రజలు వైసీపీని ఛీకొట్టే పరిస్థితి వస్తుందని భయపడ్డారని... జగన్ తాజా ప్రకటనకు అదే కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. డేటా సెంటర్‌ను జగన్ స్వాగతించడంతో ఆ పార్టీ నేతలే విస్మయానికి గురవుతున్నారు.

డ్రాయర్ల కంపెనీని వెళ్లగొట్టిన వ్యక్తి
డేటా కంపెనీ తెచ్చాడట..!

- జగన్ పూర్తి పిచ్చోడని నిర్ధారణయింది: సోమిరెడ్డి



నెల్లూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పాపాలు చేసే జగన్ వంటి వ్యక్తులు కూడా నీతులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. 'తాను చేసే నకిలీ మద్యం వ్యవహారంతో తనకు సంబంధం లేదని బుకాయిస్తాడు. తనకు సంబంధం లేని గూగుల్ అంశంలో తానే క్రెడిట్ దక్కించుకునేలా మాట్లాడుతున్నాడు. డ్రాయర్ల కంపెనీని వెళ్లగొట్టిన వ్యక్తి డేటా కంపెనీ తెచ్చాడట..! చెప్పుకోవడానికైనా సిగ్గుండాలి. డేటా సెంటర్ అంటే... అదో గోడౌన్ అని సాక్షిలో రాయిస్తారు. మళ్లీ దాన్ని తెచ్చింది తానేనంటాడు. పెట్టుబడులు రాకుండా చేసి, సొంత కంపెనీల ద్వారా మద్యం సరఫరా చేయించి ప్రజాధనాన్ని గుటుక్కున మింగిన ఆయన... గూగుల్ తెచ్చారా..? భోగాల కోసం రుషికొండ ప్యాలెస్ కట్టుకున్న పెద్ద మనిషి. భోగాపురం ఎయిర్‌పోర్టు గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. ఇన్నాళ్లూ జగన్ సగం పిచ్చోడనుకున్నాం.. ఇప్పుడు పూర్తి పిచ్చోడని అర్థమైంది' అంటూ మండిపడ్డారు.

జగన్ గూగుల్ తెచ్చాడంటే ఎవరూ నమ్మరు: అనగాని



అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నిజం చెబితే తల వెయ్యి చెక్కలు అవుతుందని జగన్‌రెడ్డికి శాపం ఉన్నట్టు ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా చేశారు. 'ఒక్క ఆధారం చూపకుండా జగన్ రెండు గంటలపాటు ప్రెస్‌మీట్ పెట్టి ప్రజల సమయాన్ని వృథా చేసినందుకు సిగ్గుపడాలి. విశాఖకు గూగుల్‌ని జగన్ తెచ్చాడని అంటే ఆయన కుటుంబంలో మిగిలిన ముగ్గురు సభ్యులే నమ్మరు. నకిలీ మద్యానికి జగన్ బ్రాండ్ అంబాసిడర్' అని అనగాని విమర్శించారు.

జగన్‌కు చేసే పనిపై శ్రద్ధ లేదు: నీలాయపాలెం

'జగన్‌కు చేసే పనిపై శ్రద్ధ లేదు. ప్రజలంటే గౌరవం లేదు. దానికి నిదర్శనమే గూగుల్‌పై ఆయన చెప్పిన అడ్డగోలు అబద్ధాలు. కనీస హోంవర్క్ కూడా చేయకుండా ప్రెస్‌మీట్లలో అబద్ధాలు చెప్పడం ఏమిటి?' అని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. 'తాను ఏది చెప్పినా జనం నమ్మేస్తారనే భ్రమ నుంచి జగన్ ఇంకా బయటకు రాలేదు. చంద్రబాబు 2019 ఫిబ్రవరి 14న రూ.70 వేల కోట్లతో అదానీ డేటా సెంటర్‌కి విశాఖలో శంకుస్థాపన చేస్తే, దానికి 2020 నవంబరులో తానే శంకుస్థాపన చేశానని జగన్ అడ్డగోలుగా అబద్ధాలు చెబుతున్నారు. అబద్ధాలు ఎంత అలవోకగా చెప్పాలో జగన్‌ను చూసి నేర్చుకోవాలి' అని నీలాయపాలెం ఎద్దేవా చేశారు.

ఐదేళ్లలో ఒక్క వైద్య కళాశాలనైనా ఎందుకు కట్టలేదు?

- ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



రాష్ట్రంలో వైద్య విద్యను విస్తృతం చేయాలనే దృఢ సంకల్పంతో కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో కొత్తగా 10 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. జగన్ హయాంలో వైద్యవిద్య పూర్తిగా స్తంభించిపోయిందని అన్నారు. గత ఐదేళ్లలో ఒక్క మెడికల్ కాలేజీనీ పూర్తి స్థాయిలో ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. పీపీపీ విధానంలో ప్రభుత్వమే వైద్య కళాశాలలు, ఆసుపత్రులు నడిపిస్తుందని, ప్రైవేటు రంగం కేవలం మౌలిక వసతుల అభివృద్ధికి మాత్రమే సహకరిస్తుందని అన్నారు.

హోం మంత్రిపై తప్పుడు పోస్టులు
మాజీమంత్రి దాడిశెట్టి అనుచరుడి అరెస్టు



జగన్‌తో వీరబాబు

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి దాడిశెట్టి రాజా అనుచరుడు గణేశుల వీరబాబును పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా తునిలో గురుకుల పాఠశాల విద్యార్థిని అత్యాచార ఘటనకు సంబంధించి హోంమంత్రి అనితపై అతడు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు షేర్ చేశాడు. దీనిపై తుని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం అతడిని పోలీసులు అరెస్టు చేశారు.

జగన్ తప్పు తెలుసుకో... లెంపలేసుకో: లంకా దినకర్

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత జగన్ అబద్ధాలను నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ మండిపడ్డారు. 'ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు ఊరికేరావు. అనుకూలమైన వాతావరణం ఉన్నప్పుడు మాత్రమే వస్తాయనే విషయాన్ని జగన్ తెలుసుకోవాలి. పెట్టుబడులపై జగన్.. ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి కేవలం రూ.8వేల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అదీ గతంలో స్థాపించిన కంపెనీలను విస్తరించడానికి మాత్రమే వచ్చాయి. కూటమి పాలనలో రూ.11 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయి. పెట్టుబడులు రాబట్టడంలో విఫలమైన జగన్... ఇప్పటికైనా తన తప్పు తెలుసుకుని లెంపలేసుకోవాలి' అని దినకర్ అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణపై జగన్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ... 'అసెంబ్లీకి రాకుండా అసెంబ్లీలో సభ్యుడి గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు' అని దినకర్ స్పష్టం చేశారు.



అమెరికాలోని డాలస్‌లో జరిగిన అవగాహన సదస్సులో ప్రవాస భారతీయులు

భారతీయులకు చెడ్డపేరొస్తోంది!

- వీధుల్లో ఉత్సవాలు, బాణసంచా కాల్చడం, లౌడ్ స్పీకర్ల వాడకం ప్రమాదకరం
- థియేటర్ల వద్ద పాలతో అభిషేకాలు, ఈలలు, డ్యాన్సులతో అమెరికన్ల చిన్నచూపు... డాలస్ సదస్సులో వక్తలు

(డాలస్ నుంచి కిలారు గోకుల్‌కృష్ణ)

"అమెరికాలో నివసిస్తున్న భారతీయులు, మరీ ముఖ్యంగా కొందరు ప్రవాస తెలుగువారి ప్రవర్తనతో భారతీయులకు చెడ్డపేరు వస్తోంది. కొందరు అవగాహనా రాహిత్యంతో వ్యవహరిస్తుండడంతో ప్రవాస భారతీయుల గౌరవానికి భంగం వాటిల్లుతోంది" అని డాలస్‌లో వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరి విపరీత పోకడల వల్ల భారతీయులందరూ అపఖ్యాతిని మూటగట్టుకోవాల్సి వస్తోందని చెప్పారు. తోటకూర ప్రసాద్ ఆధ్వర్యంలో డాలస్‌లో 'ప్రవాస భారతీయ అవగాహనా సదస్సు' నిర్వహించారు. ఈ సదస్సులో స్థానిక చట్టాలు, నియమనిబంధనలు, సాంస్కృతిక విలువలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ఎలా జీవించాలన్న అంశంపై చర్చించారు. విభిన్న సంస్కృతులు, భాషలు, మతాల ప్రజలు నివసించే అమెరికాలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ప్రవాస భారతీయుల ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని వక్తలు వాపోయారు. అమెరికా చట్టాల ప్రకారం అనుమతులు లేకుండా వీధుల్లో ఉత్సవాలు జరుపుకోవడం, బాణసంచా కాల్చడం, లౌడ్‌స్పీకర్లు వినియోగించడం ప్రమాదకరమని చెప్పారు. రోడ్లు మూసివేసి జరిపిన ఉత్సవాల వల్ల ఒక అమెరికన్ డ్రైవర్ తుపాకీతో బెదిరించిన ఘటనను ఉదహరించారు. ఇలాంటి వేడుకలు ఆలయ ప్రాంగణాలు లేదా ఖాళీ స్థలాల్లోనే చేసుకోవాలని కోరారు. సినిమా థియేటర్ల వద్ద పాలతో అభిషేకాలు, ఈలలు, డ్యాన్సులు వంటి విపరీత చేష్టల వల్ల అమెరికన్లు మనల్ని చిన్నచూపు చూస్తారని.. ఇలాంటి ఘటనలు ప్రవాస భారతీయులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపారు. రాజకీయ నాయకుల అమెరికా పర్యటనల సందర్భంగా కార్ల ర్యాలీలు, నినాదాలు, హోటళ్ల వద్ద గోల చేయడం సరికాదన్నారు. అమెరికన్లతో స్నేహపూర్వక సంబంధాలు మెరుగుపర్చుకోవాలని చెప్పారు. డాలస్‌ను డల్లాస్‌పురమని, గంటర్‌ను గుంటూరు అని, క్యారల్టన్‌ను కేరళటౌన్ అని పేర్కొనడం వల్ల చులకన భావం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. దుకాణాల్లో దొంగతనాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ స్థలాల్లో బిగ్గరగా మాట్లాడడం వంటి పనులతో చెడ్డపేరు వస్తుందని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా రాజకీయ విమర్శలు, అనుచిత పోస్టులు అమెరికన్ అధికారుల దృష్టికి వస్తాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



అపెక్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ చైర్మన్ ఖలీఫా ఖౌరీతో చర్చిస్తున్న సీఎం చంద్రబాబు



అబూధాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్‌జాబీతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మా రాష్ట్రానికి రండి

(మొదటి పేజీ తరువాయి)

బ్యాటరీ స్టోరేజీ ద్వారా గ్రిడ్ డిమాండ్‌ను నిర్వహించేందుకు ఆస్కారం ఉందని అపెక్స్ ప్రతినిధులు ఆయనకు తెలిపారు. సూపర్ కెపాసిటర్స్ తయారీలోనూ అపెక్స్‌కు మంచి పేరుండడంతో ఏపీలో అందులోనూ పెట్టుబడులు పెట్టాలని సీఎం కోరారు. చంద్రబాబు ఆహ్వానాన్ని తప్పక పరిశీలిస్తామని, పెట్టుబడులు పెడతామని అపెక్స్ హామీ ఇచ్చింది. అపెక్స్ సూపర్ కెపాసిటర్ ఉత్పత్తులను రాష్ట్రానికి పంపాలని సీఎం కోరగా.. తప్పనిసరిగా పంపుతామని, సముద్రమార్గంలో వాటిని పంపుతామని చైర్మన్ ఖలీఫా తెలిపారు. ఆతిథ్య రంగంలోనూ ఈ సంస్థ ఉండడంతో అందులోనూ పెట్టుబడులకు చంద్రబాబు ఆహ్వానించారు. అనంతరం పునరుత్పాదక ఇంధన రంగంలో పేరొందిన మస్దార్ సంస్థ సీఈవో మొహమ్మద్ జమీల్ అల్ రమాహీతో ఆయన భేటీ అయ్యారు. ఏపీ-మస్దార్ మధ్య భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. సౌర, పవన, గ్రీన్‌హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజి ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో దిగ్గజ సంస్థ అగ్రియా గ్రూప్ సీఈవో సల్మీన్ అల్మేరీతోనూ చంద్రబాబు సమావేశమయ్యారు. హార్టీకల్చర్, ఆక్వా కల్చర్‌లో ఏపీలో పెట్టుబడులకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని.. రాష్ట్రంలో కోకో ఉత్పత్తి జరుగుతోందని.. చాక్లెట్ పరిశ్రమ ఏర్పాటుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని పరిశీలించాలని కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అవసరమైన అపారమైన వనరులు ఏపీలో ఉన్నాయని, ఒకసారి పర్యటించాలని సీఎం విజ్ఞప్తి చేయగా.. అగ్రియా సీఈవో సానుకూలంగా స్పందించారు. లులూ గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీతో జరిగిన సమావేశంలో.. ఏపీలో మాల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెడుతున్న పెట్టుబడులపై చర్చించారు. యూఏఈకి చెందిన సంస్థలతో ఏపీలో పెట్టుబడులు పెట్టించేందుకు సహకరించాలని యూసఫ్ అలీని సీఎం కోరారు.



లులూ గ్రూప్ చైర్మన్ యూసుఫ్ అలీని సత్కరించిన సీఎం చంద్రబాబు

పెట్రో కెమికల్ రంగంలో..

దక్షిణాసియాలో సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఉన్న ఏపీ.. ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూలమని చంద్రబాబు స్పష్టం చేశారు. అబూధాబీలోని అల్ మైరాహ్ ఐలాండ్‌లోని ఏడీజీఏ స్క్వేర్‌లో అబూధాబీ నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధి అహ్మద్ బిన్ తలిత్‌తో ఆయన సమావేశమయ్యారు. కృష్ణపట్నం, మచిలీపట్నం, రామాయపట్నం, కాకినాడ పోర్టుల సమీపంలో పెట్రో కెమికల్, ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు అనువుగా ఉన్నట్లు తెలిపారు. సదరు కంపెనీ-ఏపీ మధ్య సాంకేతిక సహకారంపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని ఈ భేటీలో నిర్ణయించారు. అనంతరం అబూధాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీతో, జీ42 సీఈవో మన్సూర్ అల్ మన్సూరీతోనూ సీఎం సమావేశమయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ పయనిస్తోందని, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తాయని వారికి తెలిపారు. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్ టెక్ రంగాల్లో నూతన ఆవిష్కరణలపై పనిచేస్తున్న జీ 42 సంస్థను.. ఏఐ డేటాసెంటర్లు, ఇన్నోవేషన్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు. స్మార్ట్ గవర్నెన్స్ టెక్నాలజీని రాష్ట్రంలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు.

రెండో రోజు 9 సమావేశాలు..

రెండో రోజు పర్యటనలో చంద్రబాబు అబూధాబీలో ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో మొత్తం 9 సమావేశాలు నిర్వహించారు. అనంతరం యాస్ ఐలాండ్‌లోని పర్యాటక ప్రాజెక్టులను సీఎం బృందం సందర్శించింది. చంద్రబాబు గౌరవార్థం భారత కాన్సుల్ జనరల్ తన నివాసంలో గురువారం రాత్రి ఏపీ బృందానికి విందు ఇచ్చారు.

బీసీలను బలహీన వర్గాలు అనడం సరికాదు: మాధవ్



డిప్యూటీ సీఎం పవన్‌తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 'బీసీలను బలహీన వర్గాలు అనడం సరికాదు. ఈ దేశంలో అత్యంత బలమైన వర్గం బీసీలే. స్వతంత్ర భారతావని వందేళ్ల పూర్తి చేసుకోబోతున్న తరుణంలో బీసీ అనే పదానికి ఉన్న భావనలో మార్పు రావాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. బీసీ వర్గానికి చెందిన మాధవ్ పార్టీ రాష్ట్ర పగ్గాలు చేపట్టిన తరువాత విశ్వకర్మ జయంతి, సృష్టి-స్ఫూర్తి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని బీసీ సంఘాల నేతలు కేశన శంకర్రావు నేతృత్వంలో గురువారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. మాధవ్ మాట్లాడుతూ.. 'దేశంలో 50 శాతానికి పైగా బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇచ్చిన బీజేపీ.. ప్రధాన మంత్రి స్థానానికి బీసీని(నరేంద్ర మోదీ) ఎంపిక చేసింది. బీసీ వర్గాలకు అత్యంత చేరువగా బీజేపీ ఉంటుంది. అందులోనూ బాగా వెనుకబడ్డ బీసీల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తాం' అని మాటిచ్చారు.

ప్రతి ఇంటా స్వదేశీ మన బాధ్యత: డిప్యూటీ సీఎం

స్వదేశీ వస్తువులు వినియోగించాలన్న చైతన్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు మాధవ్ విజ్ఞప్తి చేశారు. 'ఇది మనందరి బాధ్యత.. తప్పకుండా చేద్దాం.. ఇప్పుడే నా సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేస్తా' అంటూ పవన్ స్పందించారు. గురువారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను మాధవ్, బీజేపీ సంఘటనా మంత్రి మధుకర్ తదితర బీజేపీ నేతల బృందం కలిసింది. విదేశీ పన్నులతో అప్రమత్తమైన భారత్... స్వదేశీ ఉద్యమాన్ని సెప్టెంబరు 25(పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి)న దేశ వ్యాప్తంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా 'ఇంటింటా స్వదేశీ... ప్రతి ఇంటా స్వదేశీ' అంటూ చేస్తున్న ప్రచారంలో పాల్గొనవలసిందిగా పవన్‌ను బీజేపీ నేతలు కోరారు. 'ఇంటింటా స్వదేశీ.. ప్రతి ఇంటా స్వదేశీ' స్టిక్కర్‌ను ఆవిష్కరించిన పవన్.. మరింత విస్తృతంగా ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉందన్నారు.

సారాయి చరిత్ర జగన్ కుటుంబానిదే: నాగోతు

సారాయి వ్యాపారం, ఎర్రచందనం స్మగ్లింగ్ వంటి చరిత్ర జగన్ కుటుంబానిదేనని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు విజయవాడలో అన్నారు. 'అక్రమార్జనకు బ్రాండ్ అంబాసిడర్ జగన్. కల్తీ మద్యం సరఫరా చేసి 30 వేల మంది చావుకు కారణమయ్యారు. జయచంద్రారెడ్డి గురించి ఎవరినడిగినా పెద్దిరెడ్డి మనిషే అని చెబుతారు. కల్తీ మద్యంలో జోగి రమేశ్ కుట్ర వెలుగులోకి వచ్చింది. దీంతో దిక్కుతోచని జగన్ వైద్య కళాశాలలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని చెప్పారు.

మనిషిని బట్టే మందు!

ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డి. నాగేశ్వర్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇద్దరికి తీవ్ర విష జ్వరం వచ్చింది. ఓ వైద్యుడి దగ్గరికి వెళితే వారికి ఒకే రకమైన మందులను, ఒకే మోతాదులో సూచించారు. అవి వాడితే ఒకరి వేగంగా కోలుకుంటే.. మరొకరిలో ఏమాత్రం ప్రయోజనం కనిపించలేదు. వేర్వేరు వ్యక్తుల శరీరతత్వం వేర్వేరుగా ఉండటం, ఆయా మందులకు వేర్వేరుగా స్పందించడమే దానికి కారణం. అలా కాకుండా రోగి శరీరతత్వానికి అనుగుణంగా ఏ మందు, ఎంత మోతాదులో, ఎన్నిసార్లు ఇవ్వాలని నిర్ణయించడమే ప్రెసిషన్/పర్సనలైజ్డ్ మెడిసిన్. ఇలా కచ్చితత్వంతో మందులు సూచించడానికి తోడ్పడేదే 'ఫార్మకోజినోమిక్స్' పరీక్ష. వ్యక్తుల శారీరక పరిస్థితి, జన్యుక్రమాన్ని పరిశీలించి, పూర్తిస్థాయిలో విశ్లేషించే ఈ అత్యాధునిక పరీక్ష ఏఐజీ ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చినట్టు ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఫార్మకోజినోమిక్స్ పరీక్ష ప్రయోజనాలపై ఆయన గురువారం జూమ్ సమావేశం నిర్వహించారు. ఔషధాలకు ప్రతి వ్యక్తి శరీరం భిన్నంగా స్పందిస్తుందని నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఒకరికి బాగా పనిచేసే మందు మరొకరికి ఫలించకపోవచ్చు, ఒక్కోసారి హానికరం కూడా కావొచ్చని చెప్పారు. ఈ అంశానికి సంబంధించి ఏఐజీ ఆస్పత్రిలో డాక్టర్ కల్యాణ్ ఉప్పలూరి, డాక్టర్ ఉష ఆధ్వర్యంలో 2వేల మందిపై అధ్యయనం చేశామని వెల్లడించారు. దేశంలో ప్రతీ ముగ్గురిలో ఒకరు తమ జన్యునిర్మాణానికి అనువుగాలేని మందులు తీసుకుంటున్నారని.. ఇది రోగి భద్రత, వైద్య ఖర్చులపై ప్రభావం చూపుతుందని తమ అధ్యయనంలో తేలిందని వివరించారు.

తక్కువ ధరలో పరీక్ష అందుబాటులోకి..

వైద్య రంగానికి చెందిన ఏఐ సంస్థ 'జీన్ పవర్ ఎక్స్'తో కలిసి.. ప్రతి వ్యక్తి శరీరతత్వం, జన్యుక్రమం ఆధారంగా కచ్చితత్వంతో మందులు సూచించేందుకు వీలుకల్పించే 'ఫార్మకోజీనోమిక్స్' పరీక్షను ప్రారంభించామని నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. తమ ఆస్పత్రిలో చేసే ఫార్మకోజీనోమిక్స్ టెస్టు వ్యక్తి జన్యుక్రమాన్ని కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో విశ్లేషించి.. వివిధ సమస్యల కోసం ఉపయోగించే మందులకు వారి శరీరం ఎలా స్పందిస్తుందో అంచనా వేస్తుందని చెప్పారు. పరీక్షలో వెల్లడైన అంశాలతో ప్రత్యేకమైన నివేదికను ఇస్తామని తెలిపారు. పశ్చిమ దేశాల్లో ఇలాంటి జెనొమిక్ పరీక్షకోసం రూ.80 వేల వరకు తీసుకుంటారని.. ఏఐజీలో కేవలం రూ.5 వేలకే అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. తమ ఆస్పత్రికి వచ్చే ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్లకు ఈ పరీక్ష చేస్తామని తెలిపారు.

2,536 ఎంఎస్ఎంఈలకు 275 కోట్ల ప్రోత్సాహకాలు

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల అభివృద్ధి కోసం ప్రోత్సాహకాలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతగా రాష్ట్రంలోని 2,536 ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్) యూనిట్లకు రూ.275.47 కోట్ల నిధుల విడుదలకు అనుమతిచ్చింది. 182 భారీ, మెగా పరిశ్రమలకు రూ.694.44 కోట్లు, పరిశ్రమల శాఖలో 306 బస్సుల కోసం రూ.56 కోట్లు, డిపార్ట్‌మెంటల్ విజిలెన్స్ కేసుల పరిష్కారం కోసం రూ.39 కోట్లు కలిపి మొత్తం రూ.1,030.95 కోట్ల నిధులను పారిశ్రామిక ప్రోత్సాహకాలుగా అందించనుంది. ఈ నిధుల విడుదలకు సంబంధించి పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్లు, జిల్లా పరిశ్రమల కేంద్రాల అధికారులకు కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది.

సమస్య వస్తే గురువే దిక్కు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్య
- చాగంటికి పోలూరి హనుమజ్జానకీరామశర్మ పురస్కారం



చాగంటి కోటేశ్వరరావుకు పురస్కారం అందిస్తున్న వెంకయ్య నాయుడు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): గూగుల్ వచ్చినా సమస్య వస్తే మాత్రం గురువు దగ్గరకే వెళ్లాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చమత్కరించారు. ధారాళంగా మాట్లాడే నేర్పు తన గురువు బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీ రామశర్మ ప్రేరణతోనే తనకు వచ్చిందన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు హాల్లో జరిగిన కార్యక్రమంలో పోలూరి హనుమజ్జానకీ రామశర్మ ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుడు చాగంటి కోటేశ్వరరావుకు వెంకయ్య అందజేశారు. శాలువా, జ్ఞాపికతో పాటు ప్రశంసాపత్రంతో సత్కరించి రూ.25,000 నగదు పురస్కారాన్ని అందించారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు పెద్దవారికి మాత్రమే అనుకునే భ్రమను తొలగించి యువతరాన్ని కూడా ఆకట్టుకున్నారని చాగంటిని ప్రశంసించారు. తెలంగాణ సారస్వత పరిషత్తుకు వెంకయ్య నాయుడు ఇచ్చిన రూ.5 లక్షల విరాళంతో ఆయన గురువు హనుమజ్జానకీరామశర్మ పేరుమీద ప్రతి ఏటా ఒకరికి పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి జే.చెన్నయ్య చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న శాంతా-వసంతా ట్రస్టు వ్యవస్థాపకుడు కేఐ వరప్రసాదరెడ్డి, సాహితీవేత్త రేపూరి అనంతపద్మనాభరావు కూడా పోలూరి శిష్యులే అని సభాధ్యక్షత వహించిన తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారుడు కేవీ రమణాచారి చెప్పారు. పురస్కార గ్రహీత చాగంటి మాట్లాడుతూ సనాతన ధర్మంలో గురువు మాటకు విశిష్టమైన స్థానం ఉందని అన్నారు.

సంస్కరణల ఫలాలు గ్రామీణులకందాలి

- 1 నుంచి డీడీఓ కార్యాలయాల ప్రారంభం
- ఏనుగులతో ఇబ్బందులు.. నియంత్రించాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ పాలనాపరమైన సంస్కరణలు తీసుకొచ్చామని, వాటి ఫలాలు ప్రజలకు సక్రమంగా అందించే బాధ్యత ఉద్యోగులపై ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. నవంబరు ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రాంతీయ అభివృద్ధి అధికారులు(డీడీఓ) కార్యాలయాలను ప్రారంభించాలని ఆదేశించారు. క్లస్టర్ విధానాన్ని రద్దు చేసి 13,351 గ్రామ పంచాయతీలను స్వతంత్ర యూనిట్లుగా మార్చడం ద్వారా గ్రామీణులకు మెరుగైన సేవలందించే వెసులుబాటు తీసుకొచ్చామని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు పంచాయతీలు ఆర్థిక స్వయం ప్రతిపత్తి సాధించే విధంగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నిధుల వినియోగం, పాలనా సంస్కరణల అమలుపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. పల్లె పండుగ 2.0 ద్వారా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి ప్రణాళికలు అందించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దు ప్రాంతానికి ఒడిశా వైపు నుంచి వస్తున్న మదపుటేనుగుల సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. మన్యంలో ఏనుగుల సంచారంతో జరిగిన పంట నష్టంపై నివేదిక ఇవ్వాలని సూచించారు. ఏనుగుల గుంపుల జాడను ఎప్పటికప్పుడు తెలుసుకుని, పంటలకు నష్టం వాటిల్లకుండా, వాటిని మళ్లించే ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. గురువారం మంగళగిరి క్యాంప్ కార్యాలయంలో పవన్ కల్యాణ్ అధ్యక్షతన రాష్ట్ర వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 'మన్యం జిల్లా సరిహద్దుల్లో ఏనుగుల సంచారంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. ఒడిశా వైపు నుంచి ప్రవేశించిన రెండు గుంపులు పంటల్ని ధ్వంసం చేస్తున్నాయి. బద్వేల్-నెల్లూరు మధ్య నాలుగు లైన్ల 67వ నంబరు జాతీయ రహదారికి 34.67 హెక్టార్ల భూమి అవసరం ఉంటుంది. ఈ ప్రాంతం ఎకో సెన్సిటివ్ జోన్‌లో ఉంది. ఈ భూముల బదిలీకి జాతీయ వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కౌన్సిల్ అనుమతి కోసం పంపనున్నాం. బెంగుళూరు-కడప- విజయవాడ కారిడార్ కోసం నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌తో పాటు శ్రీవేంకటేశ్వర నేషనల్ పార్కు నుంచి 40.86 హెక్టార్ల భూమి బదిలీకి నేషనల్ టైగర్ కన్జర్వేటివ్ అథారిటీ, వైల్డ్‌లైఫ్ ఇండియా అనుమతులతో పాటు జాతీయ వన్యప్రాణి బోర్డుకు నివేదిక అందజేయనున్నాం. ప్రధాని మోదీ అధ్యక్షతన ఈనెల 29న జరిగే జాతీయ వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. రాష్ట్రంలో కనిపించే అరుదైన.. తిరుమల లిమినియేసి బ్లూ టైగర్ సీతాకోక చిలుకను రాష్ట్ర సీతాకోక చిలుకగా గుర్తించాలని జాతీయ వన్యప్రాణి బోర్డుకు ప్రతిపాదన చేస్తున్నాం' అని పవన్ వివరించారు. అటవీశాఖ ప్రత్యేక సీఎస్ కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి ఎంఎం నాయక్, పీసీసీఎఫ్ చలపతిరావు పాల్గొన్నారు.



వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

తిరువూరులో.. తెలుగు తమ్ముళ్ల రచ్చ

ఎంపీ కేశినేని చిన్ని X ఎమ్మెల్యే కొలికపూడి

మీడియా, సోషల్ మీడియాలో ఆరోపణల రచ్చ

విజయవాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో కీలక టీడీపీ నేతలు వీధికెక్కారు. మీడియాలోనే గాక సోషల్ మీడియాలో కూడా ఆరోపణలు, ప్రత్యారోపణలతో రచ్చచేశారు. పార్టీ ప్రతిష్ఠ బజారునపడేశారని సీఎం చంద్రబాబుపై ఇద్దరిపైనా మండిపడ్డారు. ఎంపీ కేశినేని శివనాథ్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మధ్య గత కొన్నాళ్లుగా పొసగడం లేదు. పదవుల పంపకాల్లో విభేదాలతో తాజాగా బహిరంగ విమర్శలకు దిగారు. గురువారం తిరువూరు నియోజకవర్గంలో ఇద్దరూ వేర్వేరుగా పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి రెండ్రోజుల ముందు.. ఎంపీ కార్యాలయంలో పనిచేస్తున్న కిశోర్.. తన నియోజకవర్గంలో పదవుల పంపకాలకు డబ్బులు వసూలు చేశారని కొలికపూడి ఆరోపించారు. మర్నాడు వీటిపై ఎంపీ చిన్ని ఓ మీడియా చానల్‌తో ప్రత్యేకంగా మాట్లాడారు. వైసీపీ కోవర్టులకు చచ్చినా పదవులు ఇవ్వబోమని, తాను డబ్బులు వసూలు చేశానో లేదో తిరువూరు ప్రజలకు తెలుసని వ్యాఖ్యానించారు. గురువారం నియోజకవర్గంలో ఉభయులూ వేర్వేరు కార్యక్రమాల్లో పరస్పరం ఆరోపణలు చేసుకోవడంతో వాతావరణం వేడెక్కింది. కొలికపూడి ముందుగా తన పీఏ ద్వారా ఎంపీ కేశినేనిపై తీవ్ర ఆరోపణలు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తిరువూరు టీడీపీ టికెట్ తనకు కేటాయించినప్పుడు చిన్ని తనను రూ.5 కోట్లు అడిగారని ఆరోపించారు. '2024 ఫిబ్రవరి 7న రూ. 20 లక్షలు, ఫిబ్రవరి 8న రూ.20 లక్షలు, ఫిబ్రవరి 14న రూ.20 లక్షలు చొప్పున చెల్లించాను. ఆ తర్వాత పోరంకిలో చిన్ని పీఏకు రూ.50 లక్షలు ఇచ్చాను. గొల్లపూడిలోని తన స్నేహితులు రూ.3.50 కోట్లు చెల్లించారు' అని అందులో పేర్కొన్నారు. ఇందుకు ఆధారంగా కొన్ని బ్యాంకు స్టేట్‌మెంట్లు విడుదల చేశారు. డబ్బులు తీసుకుని పదవులు ఇచ్చారని కూడా ఆరోపించారు. దీనిపై నియోజకవర్గ పర్యటనలో ఉన్న కేశినేని శివనాథ్ తక్షణం స్పందించారు. విజయవాడ ఉత్సవ్ వంటి కార్యక్రమాన్ని సొంత డబ్బుతో నిర్వహించానని.. అలాంటిది తిరువూరులో ఐదు లక్షలకు, పది లక్షలకు పదవులు ఇచ్చానంటే ప్రజలెవరూ నమ్మరని స్పష్టంచేశారు. కొలికపూడి వైసీపీ కోవర్టు అని బాంబు పేల్చారు. పొద్దునే పేర్ని నానితో, మధ్యాహ్నం దేవినేని అవినాశ్‌తో, సాయంత్రి కేశినేని నానితో, రాత్రికి స్వామిదాస్‌తో తాను కాపురం చేయడం లేదని ఎద్దేవాచేశారు. 'నాకు టీడీపీ కార్యకర్తలు మాత్రమే తెలుసు. నా కోసం పోరాడేవారిని మధ్య సముద్రంలో వదిలేసి వైసీపీ నాయకులతో చెట్టపట్టాలు వేసుకుని తిరగను. కేశినేని నాని గతంలో తెలుగుదేశంలో ఉండగా.. ఆయన ఫొటో పెట్టుకుని ఉంటే తప్పులేదు. కానీ మా అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌లపై ఎన్నికల సమయంలో దారుణంగా వ్యాఖ్యలు చేసిన కేశినేని నాని మా అందరికీ శత్రువే. అలాంటి వ్యక్తి ఫొటోను ఈ కాలంలో పెట్టుకునే వారు కూడా మాకు శత్రువులే. వైసీపీ కోవర్టులకు చచ్చినా పదవులివ్వం. మేం కరడుగట్టిన టీడీపీ నాయకులం. చిన్ని నికార్సయిన, నిజాయితీపరుడైన తెలుగుదేశం కార్యకర్త' అని అన్నారు. ఆయన వ్యాఖ్యలపై కొలికపూడి కూడా స్పందించారు. తన వాట్సాప్ స్టేటస్‌లో.. 'నేను జగన్ మీద పోరాటం చేసి రాజకీయాలలోకి వచ్చాను. కసిరెడ్డి, చెవిరెడ్డి ఇచ్చిన లిక్కర్ డబ్బుతో రాలేదు' అని పోస్టు చేశారు. దీంతో పాటు తన అనుచరుల ద్వారా ఎంపీపై సోషల్ మీడియాలో మరిన్ని ఆరోపణలు చేయించారు. హైదరాబాద్ ప్రగతి నగర్‌లో ప్రీలాంచింగ్ పేరుతో రూ.150 కోట్లు వసూలు చేసి ఒక్క అపార్ట్‌మెంట్ కూడా కట్టలేదని.. ప్రభుత్వ స్థలంలో వెంచర్ పేరుతో మోసం చేశారని, అమాయకులు కేసు వేస్తే తప్పించుకుని తిరుగుతున్నారని.. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టిందని చెప్పారు. నందిగామ, తిరువూరు, జగ్గయ్యపేటలో ఎంపీ ఇసుక వ్యాపారం చేయిస్తున్నారని, గంజాయి వ్యాపారం చేయిస్తుంటే అడ్డుకోవడానికి తాను ర్యాలీ చేశానని, పేకాట క్లబ్బులు కూడా నడుపుతున్నారని ఆరోపణలు చేయించారు. చిన్ని మనుషులు ఢిల్లీ, హైదరాబాద్‌లోనూ పేకాట ఆడిస్తున్నట్టుగా తన నియోజకవర్గంలో ఆడించడానికి అంగీకరించేది లేదన్నారు. వైసీపీ నేతలతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు నెరపుతున్నారని.. వారితో కలిసి వ్యాపారాలు చేస్తున్నారని కూడా ఆరోపణలు చేయించారు. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలతో తిరువూరు నియోజకవర్గం గురువారం అట్టుడికింది. సీనియర్ నేతలు రచ్చకెక్కడంతో టీడీపీ నాయకత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. కేంద్ర కార్యాలయానికి రావాలని ఇద్దరినీ ఆదేశించింది. కానీ సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈ భేటీని చివరి నిమిషంలో రద్దుచేశారు.

బాధ్యత లేకుండా ప్రవర్తిస్తారా?

- ఎన్టీఆర్ జిల్లా టీడీపీ నేతలపై సీఎం ఆగ్రహం
- పెట్టుబడుల కోసం నేను విదేశాల్లో పర్యటిస్తుంటే రచ్చచేస్తారా?
- క్రమశిక్షణారాహిత్యాన్ని సహించను: చంద్రబాబు

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. ఓవైపు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు తాను విదేశాల్లో పర్యటిస్తుంటే.. కొందరు నేతలు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పార్టీలో అయినా, ప్రభుత్వంలో అయినా.. సానుకూలతను దెబ్బతీసేలా, క్రమశిక్షణ ఉల్లంఘించేలా వ్యవహరించేవారిని ఇక ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. క్రమశిక్షణారాహిత్యంతో మీడియాలో.. సోషల్ మీడియాలో రచ్చకు దిగడంపై అసహనం వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో ఆయన ఫోన్లో మాట్లాడారు. జరుగుతున్న పరిణామాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ నేతలు బహిరంగంగా విమర్శలు చేసుకోవడం, వివాదాలు సృష్టించేలా వ్యాఖ్యలు చేయడం ఏమిటని ఆగ్రహించారు. పల్లా స్పందిస్తూ.. వివాదానికి కారణమైన ఇద్దరు నేతలనూ పిలిపించి మాట్లాడతానని చెప్పారు. పార్టీ గీత దాటిన నేతలతో మాట్లాడాల్సిన అవసరం లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. తాను యూఏఈ నుంచి వచ్చాక దీనిపై దృష్టిసారిస్తానని, అప్పటి వరకు ఎవరినీ పిలిపించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. ఏమైనా ఇబ్బందులుంటే పార్టీ అంతర్గత వేదికపై చర్చించుకోవాలని.. ఇలా బహిరంగ విమర్శలు చేసుకోవడం క్రమశిక్షణను ఉల్లంఘించడమేనని, బాధ్యతారహిత వ్యాఖ్యలతో అనవసరమైన చర్చకు తావిచ్చేలా వ్యవహరించడం సమంజసం కాదని, కఠినంగా డీల్ చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. సీఎం ఆగ్రహం నేపథ్యంలో జిల్లా నేతలతో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని పల్లా రద్దు చేశారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ టాప్

» సీఎస్‌తో భేటీలో నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం



నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎస్ విజయానంద్

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు తీరంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ ముందుందని నీతిఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. పూర్వోదయ పథకం, విశాఖపట్నం గ్రోత్ హబ్‌పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌తో ఆయన గురువారం అమరావతి సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పూర్వోదయ పథకం ద్వారా తీరప్రాంతంలో మరింత అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఏపీలో పలు ఓడరేవులు ఉన్నప్పటికీ ప్రత్యేకంగా ఒక కంటైనర్ మెగా పోర్టు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. విశాఖపట్నం, అమరావతి, తిరుపతి గ్రోత్ కారిడార్ల ఏర్పాటు, వాటిద్వారా జరిగే అభివృద్ధి ప్రయోజనాలపై చర్చించారు. అనంతరం సీఎస్ మాట్లాడుతూ.. విశాఖపట్నం గ్రోత్ హబ్ పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా ఒక అధికారిని ఇన్‌చార్జిగా నియమిస్తామని చెప్పారు.

విద్యుత్ కొనుగోళ్లలో వ్యూహాలు పాటించండి: సీఎస్

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోళ్ల విషయంలో విద్యుత్ సంస్థలు ఆర్థిక పరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఈ ఏడాది నవంబరులో విద్యుత్ కొనుగోలుకు సంబంధించి విద్యుత్ సంస్థలతో గురువారం సీఎస్ సమీక్ష నిర్వహించారు. కొనుగోళ్లలో సమర్థవంతమైన ఆర్థికవ్యూహాలు పాటించాలని నిర్దేశించారు. నవంబరుకు 213 మిలియన్ యూనిట్ల విద్యుత్ అందుబాటులో ఉందని, గ్రిడ్ డిమాండ్ 218 మిలియన్ యూనిట్లుగా అంచనా వేశామని సీఎస్ తెలిపారు. రోజువారీ డిమాండ్ తీర్చడంలో పునరుత్పాదక విద్యుత్ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తి 70 మెగావాట్ల నుంచి 1870 మెగావాట్లు, పవన విద్యుత్ 90 మెగావాట్ల నుంచి 400 మెగావాట్ల మధ్య ఉండబోతోందని చెప్పారు.

సీఆర్డీఏ కార్యాలయంలో కార్యకలాపాలు



సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న కమిషనర్ కన్నబాబు

తుళ్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిర్మించిన సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో గురువారం కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. వేద మంత్రాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవ తేజ తమ చాంబర్లలోకి అడుగుపెట్టారు. ఐదో ఫ్లోర్‌లో కన్నబాబు, మూడో ఫ్లోర్‌లో భార్గవతేజ తమ తమ చాంబర్లలో ఆశీనులయ్యారు. అలాగే ఇంజనీర్ ఇన్ చీఫ్ ఆర్.గోపాలకృష్ణారెడ్డి ఐదో ఫ్లోర్‌లోని తన చాంబర్‌లో అడుగుపెట్టారు. వీరికి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్, అదనపు కమిషనర్‌కు సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మబ్బు చాటు అందాలు...

సహజసిద్ధ అందాల సమాహారమైన విజయవాడ సమీపంలోని కొండపల్లి ఖిల్లాకు వర్షం మరింత అందాన్ని అద్దింది. పచ్చని చెట్లతో ఆకుపచ్చ కోక కట్టిన కొండలను దట్టమైన కరి మబ్బులు కమ్మేశాయి.

- ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం



పాపం పండింది!

(మొదటి పేజీ తరువాయి)



తుని శివారులోని కోమటిచెరువు వద్ద నిందితుడు నారాయణరావు మృతదేహం

చెందిన ఒక బాలిక స్థానిక గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఆమె సమీప బంధువు తాటిక నారాయణ రావు(62) అప్పుడప్పుడు పాఠశాలకు వచ్చి... ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ బాలికను బయటకు తీసుకెళ్లేవాడు. తాతయ్య వరుసని చెప్పడంతో సిబ్బందికీ అనుమానం రాలేదు. మంగళవారం మధ్యాహ్నం నారాయణరావు మరోసారి బాలికను తీసుకెళ్లాడు. తొండంగి మండలం పైడికొండ శివార్లలో సపోటా తోటలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు అప్పటికప్పుడు స్పందించి కేసు నమోదు చేశారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు నారాయణరావును అరెస్ట్ చేశారు. ఎఫ్ఐఆర్, ప్రాథమిక సాక్ష్యాల సేకరణ పూర్తి చేసి నిందితుడిని తుని న్యాయాధికారి ముందు ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. మేజిస్ట్రేట్ సెలవులో ఉండటంతో ప్రత్తిపాడు న్యాయాధికారి వద్దకు బయల్దేరారు. రాత్రి 10.30 సమయంలో తుని శివారులోని కోమటిచెరువు వద్దకు రాగానే.. నిందితుడు బహిర్భూమికి వెళ్లాలని, వాహనం ఆపాలని ఒత్తిడి తెచ్చాడు. దీంతో పోలీసులు జీపు ఆపారు. ఆ సమయంలో వర్షం పడుతుండటంతో ఎస్కార్ట్ పోలీసులు దూరంగా చెట్ల కింద నిలబడ్డారు. వారు చూస్తుండగానే నారాయణరావు చెరువులోకి దూకేశాడు. తప్పించుకునే యత్నంలో ప్రమాదవశాత్తు పడిపోయాడా, పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకునేందుకు చెరువులో దూకాడా పోలీసులకు అర్థం కాలేదు. చెరువులో అప్పటికప్పుడు గాలింపు జరిపినా ఆచూకీ లభించలేదు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించారు. గురువారం ఉదయం వలలతో గాలించగా చెరువు మధ్యలో మృతదేహం లభించింది.

చనిపోవడమే కరెక్ట్ అంటూ...

పోలీసులు నారాయణరావు మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. శవ పంచనామాకు కుటుంబ సభ్యుల నుంచి అనుమతిపత్రం అవసరం కాగా... వారెవరూ సంతకం చేసేందుకు ముందుకు రాలేదు. అతడికి ఇద్దరు భార్యలు. నారాయణరావు చేసిన పనిని క్షమించలేమని కుమారుడు సురేశ్, కోడలు రాజేశ్వరి అన్నారు. "పోలీసులు ఫోన్ చేసి నారాయణరావు చనిపోయాడని తెలిపారు. అలాంటి వాడు చావడమే కరెక్టనుకున్నాం" అని తెలిపారు. చేసిన తప్పునకు శిక్ష పడాల్సిందేనని.. అందుకే అరెస్టు చేసినా తాము స్టేషన్ వైపు రాలేదని కుమార్తె నాగలక్ష్మి చెప్పారు. బాలికపై అత్యాచారం చేసినట్లుగా సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు తీయకపోవడం సరికాదని మండిపడ్డారు.

బాలిక కుటుంబానికి అండగా ఉంటాం..

» మహిళా కమిషన్ చైర్‌పర్సన్ హామీ

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికలు, మహిళలపై జరిగే అఘాయిత్యాల విషయంలో రాజకీయాలకు అతీతంగా మానవీయకోణంలో స్పందించడం, బాధితులకు అండగా నిలవడం అందరి సామాజిక బాధ్యతని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. అత్యాచారానికి గురై కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను వాట్సాప్ వీడియో కాల్ చేసి పరామర్శించారు. ఆమె కుటుంబసభ్యులతో మాట్లాడారు. బాలికను జాగ్రత్తగా చూసుకోవాలని మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బాలిక ఆరోగ్యం, చదువు విషయంలో కమిషన్ అన్నివిధాలా అండగా ఉంటుందని.. కుటుంబానికి సొంతింటితో పాటు ఆర్థిక ఉపాధి కల్పించాలని ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని శైలజ హామీ ఇచ్చారు.

గోవుల మృతిపై ఆధారాలు

మీడియాకు అప్పుడే ఇచ్చాను!

» మీకు ఇప్పుడు కొత్తగా ఇవ్వాల్సిన అవసరం లేదు

» పోలీసులకు భూమన జవాబు..?

» 2 గంటలకు పైగా విచారించిన డీఎస్పీ



న్యాయవాదితో కలిసి ఎస్వీ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌కు వచ్చిన భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ గోశాలలో వంద గోవులు మృతి చెందాయని చేసిన ఆరోపణలకు తన వద్ద ఆధారాలున్నాయని టీటీడీ మాజీ చైర్మన్, తిరుపతి వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు. అయితే ఆ ఆధారాలను ఆనాడే మీడియాకు అందజేశానని.. ఇప్పుడు పోలీసులకు కొత్తగా ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టంచేసినట్లు తెలిసింది. గోశాలలో గోవులు భారీ సంఖ్యలో చనిపోయాయని గతంలో ఆయన ఆరోపించడం.. ఇవి అసత్య ఆరోపణలంటూ టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేయడం.. దీనిపై కేసు నమోదు చేసిన యూనివర్సిటీ పోలీసు స్టేషన్ సీఐ రామయ్య.. ఆధారాలతో గురువారం తమ ముందు విచారణకు హాజరుకావాలని వాట్సాప్ ద్వారా భూమనకు నోటీసులు పంపడం తెలిసిందే. ఉదయం 10.50 గంటలకు తిరుపతి వైసీపీ ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, న్యాయవాదులు, వైసీపీ శ్రేణులతో కలిసి భూమన స్టేషన్‌కు వచ్చారు. ఆయనతోపాటు న్యాయవాదులు మాత్రమే లోపలకు వెళ్లారు. డీఎస్పీ భక్తవత్సలం, పోలీసు అధికారులు భూమనను 20ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాలు తెలిపిన ప్రకారం.. గోశాలలో 3 నెలల వ్యవధిలో దాదాపు 100 గోవులు చనిపోయాయన్న తన ఆరోపణలకు ఆధారాలున్నాయని భూమన పునరుద్ఘాటించారు. టీటీడీలోని కీలక శాఖల్లో పనిచేస్తున్న వారిలో చాలా మందితో ఇప్పటికీ తనకు సంబంధాలున్నాయని, వారి ద్వారా ఆధారాలు తెప్పించుకుని మాట్లాడుతున్నట్లు తెలిపారు. ఎప్పుడెప్పుడు ఎన్ని గోవులు చనిపోయాయో తన వద్ద లెక్కలున్నాయని ఆయన సమాధానమిచ్చారు. దాదాపు 2.20 గంటలపాటు విచారణ సాగింది. భూమన జవాబులను క్రోడీకరించి నివేదికను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పిస్తామని పోలీసు వర్గాలు తెలిపాయి.

అమరావతికి మరో 1,750 కోట్లు!

డిసెంబరు నాటికి ప్రపంచ బ్యాంకు విడుదల

ఇప్పటికే మొదటి విడతగా రూ.1,800 కోట్లు

విజయవాడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాజధాని అభివృద్ధి పనుల కోసం ప్రపంచ బ్యాంకు ఈ ఏడాది డిసెంబరు నాటికి రెండో విడతగా 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1,750 కోట్లు) విడుదల చేసే అవకాశం ఉందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ గురువారం వెల్లడించారు. అమరావతిలో మొదటిదశ అభివృద్ధిలో భాగంగా తలపెట్టే ప్రాజెక్టులకు ప్రపంచబ్యాంకుతో పాటు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) 800 మిలియన్ డాలర్ల చొప్పున మొత్తం 1,600మిలియన్ డాలర్లు (సుమారు రూ.13,600 కోట్లు) ఫండింగ్ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రపంచబ్యాంకు ఇప్పటికే తొలివిడతలో సుమారు రూ.1800 కోట్లు రుణం విడుదల చేసింది. వీటికి తోడు కేంద్రం ఫేజ్-1 అభివృద్ధికి కేటాయించిన రూ.15వేల కోట్లలో ప్రస్తుతం రూ.1,400 కోట్లను సమకూర్చబోతోంది. ప్రపంచ బ్యాంకు మొదటి విడతలో విడుదల చేసిన నిధుల్లో దాదాపు 50 శాతం ఖర్చు చేసినట్టు సురేష్‌కుమార్ తెలిపారు. మొదటి విడత రుణంలో 75శాతం ఖర్చుచేసిన తర్వాత మిగతా బిల్లులు సమర్పించటానికి వెసలుబాటు ఉంటుందని, డిసెంబరు కంటే ముందే తదుపరి వాయిదాను క్లెయిమ్ చేసుకోగలమని పేర్కొన్నారు.

వీడని వాన.. తప్పిన వాయుగండం

(మొదటి పేజీ తరువాయి)



నెల్లూరు జిల్లాలో నేరేళ్లవాగులో కొట్టుకుపోయిన వ్యక్తి మృతదేహాన్ని బయటకు తెస్తున్న సహాయక సిబ్బంది



అనంతపురం నగరంలోని జనశక్తి నగర్‌కాలనీలో నిలిచిన వర్షం నీరు

గంగవరంలో 8.3, ముక్కామలలో 7.9, నెల్లూరు జిల్లా రాపూరు, కండలేరు, ఏలూరు జిల్లా కలిదిండిలలో 7.8, కోనసీమ జిల్లా మలికిపురంలో 7.6, కాకినాడ జిల్లా కోటనందూరులో 7.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జలదంకి మండలం చామదల గ్రామానికి చెందిన దంపూరు మల్లికార్జున(45) గురువారం బ్రాహ్మణక్రాక-బోగోలు ఆర్అండ్‌బీ రోడ్డు చప్టా దాటుతూ నేరేళ్లవాగు ప్రవాహంలో బైక్‌తో సహా కొట్టుకపోయి మరణించారు. అనంతపురం జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. కూడేరు మండలం కలగళ్లలో పిడుగుపాటుకు గాలిమర దగ్ధమైంది. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోనూ వాగులు, కాలువలు పొంగి పొర్లుతున్నాయి. పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. చీరాల ప్రాంతంలో నివాసాల్లోకి వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం వరకు అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ, కోస్తాలో కాకినాడ నుంచి పల్నాడు వరకు, రాయలసీమలోని మిగిలిన జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో శుక్ర, శని, ఆదివారాలు భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, శుక్రవారం కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తూ జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తోంది. జిల్లాల్లో పరిస్థితులను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అన్ని జిల్లాల కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర సమాచారశాఖ డైరెక్టర్ విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు. సహాయక చర్యల కోసం నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించారు. భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

మంత్రుల పర్యవేక్షణ

జిల్లాల్లో పరిస్థితులపై మంత్రులు పర్యవేక్షణ చేస్తున్నారు. వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనిత, స్పెషల్ సీఎస్ జయలక్ష్మి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంకో నాలుగైదు రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని నిర్దేశించారు. మండలాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ అధికారులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. పంట ఉత్పత్తులను వీలైనంత వరకు సురక్షిత ప్రాంతాల్లో భద్రపర్చుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

నేడు అల్పపీడనం

కోస్తాకు మరో వాయుగుండం ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతం, దక్షిణ అండమాన్ సముద్రంలో గురువారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో శుక్రవారం ఆగ్నేయ, తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది ఈనెల 25, 26 నాటికి వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ తెలిపింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి ఈనెల 27వ తేదీ తర్వాత ఉత్తరకోస్తా వైపు రానుందని అంచనా వేస్తున్నారు. రానున్న రెండు రోజుల్లో దీనిపై మరింత స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. వాయుగుండం ప్రభావంతో దక్షిణ, ఉత్తర కోస్తాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందంటున్నారు.

జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌ల ఫోన్‌నంబర్లు ఇవీ..

జిల్లా	ఫోన్ నంబర్లు
గుంటూరు	0863 2234014
నెల్లూరు	0861 2331261, 7995576699
చిత్తూరు	08572 242777, 9491077325
కాకినాడ	0884 2356801
బాపట్ల	0864 3220226
కడప	08562 246344

డిసెంబరు 10 నుంచి టెట్

» నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ..

» నేడు నోటిఫికేషన్ ఇవ్వనున్న పాఠశాల విద్యాశాఖ

అమరావతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్ గురువారం విడుదలైంది. అక్టోబరు 24 నుంచి నవంబరు 23 వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. డిసెంబరు 10 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. డిసెంబరు 3 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉంచుతారు. జనవరి 19న ఫలితాలు విడుదల చేయనున్నారు. టెట్ నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేస్తారు.

ఇవీ మార్గదర్శకాలు

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈసారి టెట్‌లో ప్రధానంగా రెండు కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు డిగ్రీ మార్కుల్లో 5 శాతం సడలింపు ఇస్తున్నారు. ఇకపై పూర్తిగా ఎన్‌సీటీఈ నిబంధనలు పాటించాలని స్పష్టం చేసింది. స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించిన 2ఏ, 2బీ పేపర్లు టెట్ రాసే అభ్యర్థులకు డిగ్రీలో 50శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు 45శాతం మార్కులు ఉండాలి. 2011 నుంచి టెట్ అమల్లోకి వచ్చింది. అంతకంటే ముందు ఉద్యోగాలు పొందిన టీచర్లు కచ్చితంగా టెట్ ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించింది. ఈ మేరకు ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ రాసే అవకాశాన్ని పాఠశాల విద్యాశాఖ కల్పించింది. అయితే ప్రభుత్వ మేనేజ్‌మెంట్ల టీచర్లకు, ఎయిడెడ్ పాఠశాలల్లోని టీచర్లకు ఇంటర్మీడియట్, డిగ్రీలో కనీస మార్కుల నిబంధన వర్తించదు. ఇక 2011 జూలై 29 కంటే ముందు బీఈడీ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో అడ్మిషన్ పొంది ఉంటే వారికి అర్హత మార్కుల శాతంతో సంబంధం లేదని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. కాగా, 2011కు ముందు కోర్సులు పూర్తిచేసిన వారికి సంబంధిత అర్హత కోర్సు(డిగ్రీ, ఇంటర్)లో ఓసీలకు 45 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు 40శాతం మార్కులు ఉండాలి. టెట్ నిర్వహణకు పాఠశాల విద్య కమిషనర్ నేతృత్వంలో కమిటీని నియమించింది.

రెండు భాషల్లో ప్రశ్నపత్రం


- 150 ప్రశ్నలతో 150 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో టెట్ నిర్వహిస్తారు.
- ప్రశ్నాపత్రం ఇంగ్లిష్‌తో పాటు ఎంపిక చేసుకున్న భాషలో ఉంటుంది.
- టెట్‌లో ఉత్తీర్ణతకు ఓసీలకు 60శాతం, బీసీలకు 50శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు 40 శాతం మార్కులు రావాలి.
- ఇప్పటికే టెట్ అర్హత సాధించినవారు మార్కుల మెరుగుదల కోసం మళ్లీ పరీక్ష రాయవచ్చు. టెట్ సర్టిఫికెట్‌కు జీవితకాలం వ్యాలిడిటీ ఉంటుంది.
- టీఆర్‌టీలో టెట్‌కు 20శాతం వెయిటేజీ ఇస్తారు.
- 2017కు ముందు స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, స్కూల్ అసిస్టెంట్-లాంగ్వేజస్‌కు కలిపి ఉమ్మడిగా టెట్ ఉండేది. ఉమ్మడి పేపర్‌లో టెట్ అర్హత సాధించినవారు ఇప్పుడు ఎస్ఏ-సోషల్, ఎస్ఏ-లాంగ్వేజస్‌కు వేర్వేరుగా పరీక్ష రాసుకోవచ్చు.

టెట్ షెడ్యూల్...

నోటిఫికేషన్	అక్టోబరు 24న
ఫీజు చెల్లింపు గడువు	అక్టోబరు 24 - నవంబరు 23
దరఖాస్తు సమర్పణ గడువు	అక్టోబరు 24 - నవంబరు 23
ఆన్‌లైన్‌లో నమూనా పరీక్షలు	నవంబరు 25 నుంచి
హాల్‌టికెట్ల డౌన్‌లోడ్	డిసెంబరు 3 నుంచి
పరీక్షలు	డిసెంబరు 10 నుంచి
ప్రాథమిక కీ విడుదల	జనవరి 2
ప్రాథమిక కీపై అభ్యంతరాలు	జనవరి 2 నుంచి 9 వరకూ
తుది కీ విడుదల	జనవరి 13
ఫలితాలు విడుదల	జనవరి 19

ప్రాణ..ఆస్తి నష్టం జరక్కూడదు!

» దుబాయ్ నుంచి సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



అమరావతి/నెల్లూరు(సిటీ), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు రూ.2 కోట్ల చొప్పున, మిగతా వర్ష ప్రభావిత జిల్లాలకు రూ.కోటి చొప్పున అత్యవసర నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలపై గురువారం దుబాయ్ నుంచి సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తీవ్రంగా ప్రభావితమైన నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కడప, తిరుపతి, అన్నమయ్య జిల్లాల పరిస్థితిపై కలెక్టర్లు, ఆర్టీజీఎస్ అధికారులను ఆరా తీశారు. 'అధికారులు అప్రమత్తంగా ఉండి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. తీవ్ర ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు మోహరించాలి. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. పునరావాస కేంద్రాల్లో బాధితులకు నాణ్యమైన ఆహారం అందించాలి. పంట నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి' అని దిశానిర్దేశం చేశారు.

వర్షాలపై మున్సిపాలిటీల్లో కాల్‌సెంటర్లు: మంత్రి నారాయణ

ఎడతెరపి లేని వర్షాలతో పట్టణాలు, నగరాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను మంత్రి పి.నారాయణ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపాలిటీల్లో 24 గంటలూ పనిచేసేలా కాల్‌సెంటర్ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

బనకచర్లపై హేతుబద్ధతతో వెళ్లండి

» జల వనరుల శాఖ ప్రత్యేక సీఎస్‌కు ఆలోచనాపరుల వేదిక వినతి

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలవరం - బనకచర్ల అనుసంధాన పథకంపై దూకుడు విధానంతో కాకుండా హేతుబద్ధతతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్‌ను ఆలోచనాపరుల వేదిక కోరింది. వెలగపూడి సచివాలయంలో గురువారం ప్రత్యేక సీఎస్‌ను వేదిక తరఫున నిఘా మాజీ అధినేత ఏబీ వెంకటేశ్వరరావు, జల వనరుల నిపుణుడు టి.లక్ష్మీనారాయణ, వ్యవసాయ రంగ నిపుణులు అక్కినేని భవానీ ప్రసాద్, సామాజికవేత్త నల్లబోతు చక్రవర్తి, జొన్నలగడ్డ రామారావు కలిశారు. ఈ సందర్భంగా పోలవరం - బనకచర్ల అనుసంధానంపై పొరుగు రాష్ట్రాల నుంచి వ్యతిరేకత రాకుండా, రాష్ట్ర జల హక్కులను కాపాడేలా ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణంపై అభిప్రాయాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండాలి: గొట్టిపాటి

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వర్ష ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు, ప్రమాదాలు తలెత్తకుండా ఆ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం మంత్రి సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాల కలెక్టర్లు, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని, విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు తక్షణం స్పందించాలని ఆదేశించారు.

మరో రెండు బీసీ కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

అమరావతి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో రెండు బీసీ కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రెడ్డి అనంతకుమారిని ఇప్పటికే ప్రభుత్వం నియమించింది. తాజాగా దేవళ్ల వెంకట్రాముడు(ఎమ్మిగనూరు), జి.అమర్నాథ్ (పుంగనూరు), గుబ్బళ్ల ఫణికుమార్(రాజోలు), అంగార రంగనాథ్(పెడన), దాసరి తాతారావు(పలాస)లను డైరెక్టర్లుగా నియమించింది. కాగా, బెస్త సంక్షేమ కార్పొరేషన్‌గా చైర్మన్‌గా సూళ్లూరుపేటకు చెందిన బొమ్మన సుధీర్‌ను నియమించిన ప్రభుత్వం.. ఇప్పుడు 15 మంది డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బెస్త పవన్‌కుమార్(అనంతపురం అర్బన్), బెస్త శ్రీనివాసులు(ధర్మవరం), బెస్త మల్లికార్జున(డోన్), బెస్త మనోహర్(శ్రీసత్యసాయి), చంద్రశేఖర్(రాయచోటి), భాస్కర్‌రావు(కర్నూలు), కొడిపర్తి శ్రీధర్(గూడూరు), మల్లె వెంకటసుబ్బయ్య(కమలాపురం), పి.అమరావతి(పూతలపట్టు), పి.తిరుమగల్(కుప్పం), బొమ్మని పలాని(సూళ్లూరుపేట), వేటగిరి రాంప్రసాద్(కడప), బెస్త రామాంజనేయులు(ఆదోని), చాప సోమయ్య(బాపట్ల), టీజీ రమేశ్ బాబు(కర్నూలు)లను డైరెక్టర్లుగా నియమించింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.